సమావేశము – VI
వాల్యూము – VI
నెం. 1

వెల : రూ. 19–50
3 జనవరి, 2017
మంగళవారం,
(శక సం. 1938,
పుష్యం – 13)

# తెలంగాణ శాసన సభ కార్యకలాపాలు

## అధికార నివేదిక

### <u>విషయ సూచిక</u>

| | | | పేజి. నెం. |
|---|---|---|---|
| 1. | నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు – వాగ్రూప సమాధానములు | ... | 01 |
| 2. | సభా సమక్షంలో ఉంచబడిన పత్రాలు | ... | 19 |
| 3. | సభా కార్యక్రమం :<br>వాయిదా తీర్మానాల అనుమతి గురించి | ... | 19 |
| 4. | జీరో అవర్ | ... | 19 |
| 5. | లఘు చర్చ (కొనసాగింపు) :<br>"రాష్ట్రంలో మత్స్య పరిశ్రమాభివృద్ధి" గురించి. | ... | 23 |

* * *

# తెలంగాణ శాసన సభ

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | : | శ్రీ ఎస్. మధుసూదనాచారి |
| ఉప సభాపతి | : | శ్రీమతి ఎం. పద్మా దేవేందర్ రెడ్డి |
| కార్యదర్శి | : | డా. ఎస్. రాజ సదారామ్ |
| సంయుక్త కార్యదర్శి | : | డా. వి. నరసింహాచార్యులు |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ టి. బి. జయచందర్<br>శ్రీ ఎస్. దుర్గాప్రసాద్<br>శ్రీ సిహెచ్. ఉపేందర్ రెడ్డి<br>శ్రీమతి వి.ఎస్. ప్రసన్న కుమారి |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ పి. శ్రీనివాస్ |

# తెలంగాణ శాసన సభ కార్యకలాపాలు

# అధికార నివేదిక

## ( ఆరవ సమావేశము – పదమూడవ రోజు)

## మంగళవారం, జనవరి 3, 2017

### (సభ ఉ.గం. 10.00 లకు ప్రారంభమైనది)

### (గౌరవ సభాపతి అధ్యక్ష స్థానములో ఉన్నారు)

### నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు – వ్రాతపూర్వక సమాధానములు

**మిస్టర్ స్పీకర్:–** గౌరవ సభ్యులందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు.

### ఎం.ఎన్.జె. క్యాన్సర్ ఆసుపత్రిలో రేడియేషన్ యంత్రము

*ప్రశ్న నెం. 49 (1885) శ్రీ తమ్మన్న గారి రాంమోహన్ రెడ్డి (పరిగి) , డాక్టర్ జి.చిన్నారెడ్డి (వనపర్తి), శ్రీ జీవన్ రెడ్డి తాటిపర్తి (జగిత్యాల), శ్రీమతి డి.కె. అరుణ (గద్వాల్) – వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా :

(అ) ఎం.ఎన్.జె.క్యాన్సర్ ఆసుపత్రి అధికారులు రూ.22 కోట్ల విలువ గల రేడియేషన్ మెషిన్‌ను కొనుగోలు చేసిన విషయం వాస్తవమేనా;

(ఆ) రేడియేషన్ మెషిన్ కొనుగోలు కోసం అణు ఇంధన నియంత్రణ సంస్థ నుండి అనుమతిని పొందలేదన్న విషయం కూడా వాస్తవమేనా;

(ఇ) అయితే ఈ విషయంలో తీసుకున్న చర్య ఏమిటి?

వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి (డా.సి. లక్ష్మారెడ్డి): (అ) లేదండీ, రూ.14,51,19,000ల వ్యయంతో మెసర్స్ వారియన్ మెడికల్ సిస్టమ్స్ తయారు చేసిన ఐ.జి.ఆర్.టి.తోపాటు హై ఎనర్జీ లీనియర్ ఏక్సిలరేటర్ రేడియేషన్ మెషీన్‌ను ఎం.ఎన్.జె.ఇన్స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ మరియు రీజనల్ క్యాన్సర్ సెంటర్ కొనుగోలు చేసింది.

(ఆ) లేదండీ, ఎం.ఎన్.జె. ఆసుపత్రి 20.07.2015 తేదీ గల అనుమతి నెం. ఏఇఆర్‌బి/415/ఎన్‌ఓసి –ఆర్‌సిసి/ఆర్ఎస్‌డి/ఆర్‌టి–డిపై– 901/2015/4066 ద్వారా రేడియేషన్ మెషిన్ కొనుగోలు కోసం అణు ఇంధన నియంత్రణ సంస్థ అనుమతిని పొందింది.

(ఇ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ టి.రాంమోహన్ రెడ్డి:– అధ్యక్షా, పండిట్ జవహార్‌లాల్ నెహ్రూ గారు 1955వ సంవత్సరంలో ఎం.ఎన్.జె.కేన్సర్ ఆసుపత్రిని ప్రారంభించడం జరిగింది. అటానమస్ స్టేటస్ కలిగి ఉండి పేద రోగులకు అత్యంత ఖరీదైనటువంటి క్యాన్సర్ వ్యాధికి ట్రీట్‌మెంట్ ఇవ్వగలుగుతున్నది. ఈ ఆసుపత్రిలో సంవత్సరానికి ఒకలక్షా ఇరవైవేల మంది రోగులు ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నారు. ఇలాంటి ఆసుపత్రికి స్వయంగా ముఖ్యమంత్రిగారే గవర్నింగ్ కౌన్సిల్‌కు ఛైర్మన్‌గా, ఆరోగ్యశాఖా మంత్రిగారు ప్రో ఛైర్మన్‌గా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి కాంగ్రెస్ హయాంలోనే రూ.120కోట్లు శాంక్షన్ కావడం జరిగింది. ఇందులో 70/30 రేషియో లోపల మనము కూడా మార్జిన్స్ ఇన్‌వెస్ట్‌మెంట్స్ చేయాలి. సీనియారిటీ ప్రకారం అక్కడ ఇన్‌ఛార్జ్ డైరెక్టర్‌లు అపాయింట్ కావాలి. అలా కాకుండా తక్కువ సీనియారిటీ వాళ్లు ఉంటున్నారు. వాళ్లు ప్రభుత్వం నుంచి ఎన్.ఓ.సి. తీసుకోకుండా విదేశీ పర్యటనకు వెళుతున్న విషయం ప్రభుత్వానికి తెలియాలి.

స్పెసిఫికేషన్స్‌లో ఒక ఐటమ్ ఉంటే మరొక ఐటమ్‌ను కొనుగోలు చేశారు. క్రిష్ణారెడ్డి అనే ఒక డాక్టర్‌గారు ఇదే మిషన్‌ను ఎప్పుడూ వాడేవారు. వారు ఒక రిపోర్టులో ఏమి చెప్పారంటే Model supplied is not in the website. Model

supplied is not as per the tender requirement and specimen. Model supplied is not as per the order. Model supplied is not full and complete. Model approval will take four months delay. Supply was delayed. Supply to MNJ is at lower specification. Model is not FDI approved. Proper clearance from the Government is not taken. PO was not amended to give effect to the model supplied, etc, etc. ఈ విధంగా ఎన్నో డీవియేషన్లను చేస్తూ ప్రభుత్వం అపాయింట్ చేసిన ఎక్స్‌పర్ట్ కమిటీ కూడా ఈ ఎక్విప్‌మెంట్ నాణ్యత లేనిది, ప్రమాణాలు లేనిది కొనుగోలు చేయడం జరిగింది. మంత్రిగారు దాని ఖరీదు రూ.14,51,19,000లని చెబుతున్నారు. దీనికి వారంటీ ఉండాలి. రూ.22కోట్లు చెల్లించాలని పర్చేజ్ ఆర్డర్ ఏదైతే ఉన్నదో నా దగ్గర పర్చేజ్ ఆర్డర్ కాపీ కూడా ఉన్నది. ఇందులో వారంటీకి సంబంధించి ఆర్డర్ ఇవ్వడం జరిగింది. పేద రైతులు వైద్యం అందకుండా చనిపోతున్న సందర్భాలు మన ఆసుపత్రిలో ఉన్నాయి. నా దగ్గర దీనికి సంబంధించిన సాక్ష్యాలు ఉన్నాయి. నేను ప్రూవ్ చేస్తాను. ఎం.ఎన్.జె. క్యాన్సర్ ఆసుపత్రికి ముఖ్యమంత్రిగారు స్వయంగా ఛైర్మన్‌గా ఉన్నారు. క్వాలిటీ లేని ఎక్విప్‌మెంట్‌లను కొనడం వలన రోగులు చనిపోతున్నారు. ఖచ్చితంగా దీనిపైన సభాసంఘం వేయండి. లేకపోతే ఏసిబి దర్యాప్తుకు మీరు ఆదేశాలు ఇవ్వండి, లేదంటే మీరు మంత్రిగారిని, అధికారులను పిలవండి, నా దగ్గర సమగ్ర సమాచారం ఉన్నది. మీ దగ్గరే నేను ఖచ్చితంగా ప్రూవ్ చేస్తాను, ఆ అధికారులపైన చర్యలు తీసుకోవాలని మీ ద్వారా నేను కోరుతున్నాను.

డా.జి.చిన్నారెడ్డి : అధ్యక్షా, తమరి ద్వారా సూటిగా ఒకటి రెండు ప్రశ్నలను వేయదలచుకున్నాను. ఈ రేడియేషన్ మిషన్ రూ.14,51,19,000లతో కొనడం జరిగిందని గౌరవ మంత్రిగారు చెప్పారు. అణు ఇంధన సంస్థ యొక్క అనుమతి లేకుండా ఈ మిషన్‌ను కొనడం జరిగిందని మాకు సమాచారం తెలిసింది. కానీ, మంత్రిగారు వారి రెండవ సమాధానంలో20.07.2015 నాడు అనుమతి వచ్చిందని చెబుతున్నారు. ఈ మిషన్ కొనాలని ఎం.ఎన్.జి. ఆసుపత్రి వారు 2013లోనే ప్రభుత్వం యొక్క అనుమతి కోరారు. ఈ అనుమతి వచ్చిన తర్వాత మిషన్ కొన్నారా, మిషన్ కొన్న తర్వాత అణు ఇంధన సంస్థ అనుమతి ఇచ్చిందా అనే విషయాన్ని చెప్పవలసిందిగా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను. ఈ మిషన్‌ను ఆసుపత్రిలో వాడటానికి 2.5 ఎమ్.ఎమ్.బిమ్. మాత్రమే ఉపయోగించాల్సి ఉన్నది. కానీ, ఈ మిషన్ 5ఎమ్.ఎమ్.బీమ్. ఉన్నదనే మాట చెబుతున్నారు. 2.5 ఎమ్.ఎమ్.బిమ్. ఉంటే ఎక్కడైతే ట్యూమర్ ఉన్నదో ఆ ట్యూమర్‌పైన ఈ బీమ్‌ను ప్రసరింపజేస్తే , ఆ ట్యూమర్‌లో ఉండే క్యాన్సర్ కణాలు చనిపోవడానికి అవకాశం ఉంటుంది. దీని మూలంగా క్యాన్సర్ ఇతర భాగాలకు వ్యాపించకుండా ఉంటుంది. కానీ, 5 ఎమ్.ఎమ్.బీమ్.ను మనం వాడితే ట్యూమర్ కణాలతోపాటు చుట్టూ ఉండే మంచి కణాలు కూడా చనిపోవడానికి ఆస్కారం ఉన్నది. దాని వలన నష్టం జరిగే ఆస్కారం ఉన్నదనే రిపోర్టులు నా దగ్గర ఉన్నాయి. ఈ మిషన్ 2.5 ఎమ్.ఎమ్.బిమ్.ని కలిగి ఉందా? 5 ఎమ్.ఎమ్.బీమ్. కలిగి ఉన్నదా? అనే విషయాన్ని మంత్రిగారు సమాధానం చెప్పవలసినదిగా కోరుతున్నాను.

**శ్రీ టి.జీవన్ రెడ్డి:–** అధ్యక్షా, గౌరవ మంత్రిగారు ఈ రేడియేషన్ మిషన్ అణు ఇంధన శాఖ అనుమతితో తీసుకోవడం జరిగిందని చెప్పారు. అసలు ఈ మిషన్‌ను ఇప్పుడు వాడుతున్నారా? లేదా అనే విషయాన్ని మంత్రి గారు సభకు తెలియజేయలేదు. ఇందాక గౌరవ సభ్యులు చిన్నారెడ్డిగారు అడిగినట్లు ఈ మిషన్ 2.5 ఎమ్.ఎమ్.బిమ్. లేదా 5ఎమ్ఎమ్‌బీమ్‌ని కలిగి ఉన్నదా అనే విషయాన్ని మంత్రిగారు సమాధానం చెప్పవలసినదిగా కోరుతున్నాను. 5ఎమ్ఎమ్‌బీమ్ కెపాసిటి ఉంటే అవయవాల చుట్టూ ఉండే ఇతర కణాలు కూడా చనిపోయే అవకాశం ఉంటుంది కాబట్టి ఈ రెండింటి మీద సమాధానం చెప్పవలసినదిగా కోరుతున్నాను.

**10.10 ఉ.** **డా.సి.లక్ష్మా రెడ్డి:–** అధ్యక్ష, గౌరవ సభ్యులు చెప్పినట్లుగా ఎమ్.ఎన్.జె. క్యాన్సర్ హాస్పటల్ గత కొన్ని సంవత్సరాలుగా ఎంతో మంది బీద ప్రజలకు మంచి ట్రీట్‌మెంట్‌ను అందిస్తోంది. దురదృష్టమేమిటంటే ఎమ్.ఎన్.జె. క్యాన్సర్ హాస్పటల్ కోసం ఒక మిషన్ని సంవత్సరం క్రితమే కొనుగోలు చేయడం జరిగినా అనవసరమైన గొడవల వల్ల ఒక సంవత్సరం డిలే అయింది. ఈ మిషనును వినియోగంలోకి తెచ్చి ఉంటే పేషంట్స్‌కు సంవత్సరం క్రితమే ట్రీట్‌మెంట్ అందించే అవకాశం ఉండేది. ఒక విధంగా చెప్పాలంటే, మన పాలిటిక్స్‌లో కన్నా ఎక్కువగా ఈ హాస్పటల్స్ లోని స్టాఫ్ మధ్య రాజకీయాలు నడుస్తున్నాయి, అందుకు నాకు చాలా బాధగా ఉంది. ఎవరు డైరెక్టర్ ఉన్నా, ఎవరు సూపరింటెండెంట్ ఉన్నా కొద్దిగా పడని వాళ్లుంటే గొడవలు మొదలవుతున్నాయి. వాస్తవాలుంటే బయటకు తీసుకువద్దాము. మనందరి ఉద్దేశము

ఒకటే గవర్నమెంట్ హాస్పటల్స్‌ను బలోపేతం చేయాలి. వాటి ద్వారా బీద ప్రజలకు సేవలు అందాలి. అనవసరంగా లేనిపోని కంప్లైంట్స్ ఇవ్వడం, దాన్ని మీకు చూపించడం, మీరు దాన్ని సభలో ప్రశ్నించడం ఇవన్నీ వాస్తవాలకు దూరంగా ఉన్నాయి. 2013లోనే ఈ మిషన్ కొనుగోలుకు ఆర్డర్ ఇవ్వడం జరిగింది. టెండర్ ప్రాసెస్ జరిగింది. టెండర్లలో సింగిల్ టెండర్ రావడం దానితో మళ్లీ కమిటీ వేయడం, ఆ కమిటీ కూడా దీనికి క్లియరెన్స్ ఇవ్వడం జరిగింది. దాని తరువాత మిషన్ను తీసుకొని సప్లై చేయడం జరిగింది. సప్లై అయిన తరువాత కూడా కంప్లైట్స్ రావడం వల్లనే డిలే అవడం ఇవన్నీ జరుగుతూ వచ్చాయి. దీంట్లో ఎలాంటి అవకతవకలు జరుగలేదు. ప్రభుత్వం వచ్చిన తరువాత కంప్లైంట్స్ మీద ఒక హై లెవల్ కమిటీని కూడా వేయడం జరిగింది. దాంట్లో మన రాష్ట్రానికి సంబంధించిన నిపుణులతో పాటు టాటా క్యాన్సర్ హాస్పటల్ డైరెక్టర్, అటామిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు మెంబర్, ఇండో అమెరికన్ డాక్టర్లందరితో కమిటీ వేయడం జరిగింది. ఇవన్నీ పరిశీలించిన తరువాత ఇది చాలా మంచి మిషన్, దీంట్లో ఏమీ అవకతవకలు జరుగలేదు, ఇంత మంచి మిషన్ను ఇన్ని రోజులు వాడకుండా డిలే చేశారు దురదృష్టకరమని వారు ఒక కామెంట్ చేసి వెళ్లారు. ఇదీ మన రాష్ట్రంలో జరుగుతున్న తీరు.

గతంలో కూడా నిమ్స్ హాస్పటల్లో, బీద ప్రజల కోసం తెచ్చిన 50 వెంటిలేటర్లు ఇంటర్నల్ కంప్లైట్స్‌తో ఒక సంవత్సరం డిలే కావడం మేము వచ్చిన తరువాత వాటిని వాడుకలోకి తీసుకురావడం జరిగింది. బీబీ నగర్‌లో ఏర్పాటు చేసే నిమ్స్ హాస్పటల్‌ను తొందరగా పూర్తి చేయాలని మన వాళ్లు అడుగుతున్నారు. అది కూడా ఒక చిన్న డిస్టబెన్స్‌తో 9 సంవత్సరాలు డిలే అయింది. ఇది సబ్జెక్టు కాకపోయినా ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను, గతంలో కూడా ప్రాజెక్టుల విషయంలో ఎవరో ఆంధ్రలో కంప్లైంట్ ఇవ్వడం, అది పేపర్లో పెద్దగా రావడం, ఎంక్వైరీ పేరు మీద సంవత్సరాలు సంవత్సరాలు దాన్ని డిలే చేయడం జరిగింది. ఇప్పుడు కూడా ఇంకా డిపార్ట్‌మెంట్లలో ఇలాంటివి జరుగుతున్నాయి. 2.0 బదులు 2.5 అంటే సాఫ్ట్‌వేర్ గాని, హార్డ్‌వేర్ గాని అప్‌డేటడ్‌గా వచ్చింది. దీంట్లో ఉన్న1.8 తరువాత అప్‌గ్రేడ్ చేసింది 2.0. ఇప్పుడు లేటెస్ట్‌ది 2.5 ఇది మన రాష్ట్రంలో ఎక్కడా ఏ ప్రైవేట్ క్యాన్సర్ హాస్పటల్లో కూడా లేదు. అలాంటి దాన్ని మనం తీసుకు రావడం జరిగింది. మిషన్ సప్లై చేసే సమయానికి అప్‌డేటెడ్ వర్షన్ ఏదుంటే అదే సప్లై చేయాలని పర్చేజ్ ఆర్డర్‌లోనే క్లియర్‌గా చెప్పడం జరిగింది. దాన్ని బట్టి అప్‌డేటెడ్ వర్షన్నే ఆ కంపెనీ వాళ్లు సప్లై చేసారు తప్ప, ఇందులో ఎలాంటి అవకతవకలు జరగలేదని గౌరవ సభ్యులకు నేను మనవి చేస్తున్నాను. ఇప్పటికే పేషంట్లకు టెస్ట్‌లు చేస్తున్నారు. త్వరలోనే పూర్తి స్థాయిలో మిషన్ను వాడుక లోకి తీసుకు రావడం జరుగుతుంది. ప్రస్తుతానికి ట్రీట్‌మెంట్ జరగడం లేదు. టెస్ట్‌లు మాత్రమే జరుగుతున్నాయి. అన్నీ క్లియర్‌గా కాలిక్యులేషన్స్ అయిన తరువాత పూర్తి స్థాయిలో వాడుకలోకి వస్తుంది. ఇప్పటికే ఎమ్.ఎన్.జె. క్యాన్సర్ హాస్పటల్‌ను విస్తృత పరుస్తూ జిల్లా స్థాయిలో కూడా క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగింది. డిస్ట్రిక్ క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్లను కూడా ఏర్పాటు చేస్తున్నాము.

అదేవిధంగా మీరు చెప్పినట్లుగా రూ.120 కోట్లతో వచ్చిన ప్రతిపాదనను అమల్లోకి తీసుకు రావడానికి ప్రక్కనే ఉన్న ఐ.టి.ఐ. ఇన్‌స్టిట్యూట్‌కు సంబంధించిన 4 ఎకరాల ల్యాండ్‌ను కూడా తీసుకోవడం కూడా జరిగింది. కొత్త బిల్డింగ్ కట్టి దాంట్లో అధునాతనంగా ఎక్విప్‌మెంట్లను పెట్టడానికి అరేంజ్‌మెంట్లు చేస్తున్నాము. భవిష్యత్తులో గాని ఎప్పుడైనా సరే మీ సలహాలు, సూచనలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నాము. ముఖ్యమంత్రి గారు కూడా చెప్పారు, సబ్జెక్టు ఏదైనా సరే సూచనలు, సలహాలు ఇవ్వండి. కానీ అనవసరమైన ఇటువంటి రాద్ధాంతాలతో సభా సమయం వృధా కావొద్దు. పేషంట్లకు కూడా డిలే జరగ కూడదని నేను విజ్ఞప్తి చేస్తున్నాను. దీంట్లో ఎలాంటి ఇబ్బందులు లేవు.

**శ్రీ తమ్మన్నగారి రామ్మోహన్ రెడ్డి:–** ఈ కమిటీ రిపోర్ట్‌లో ఏమి వ్రాసారంటే అధ్యక్షా, “The Committee feels that there is gross financial and technical irregularity in change of model to the institute. The Government has ordered AERB type approved two beam machine with built-in 2.5mm HD MLC whereas the present machine is neither approved nor it is anywhere in the Country. The Varun company has cheated the Government/ institute “ అనేది కమిటీ రిపోర్ట్ ఉంది. కచ్చితంగా మీరు ఒక అవకాశం ఇవ్వండి, అధికారులను, మంత్రి గారిని మీ దగ్గరకన్నా పిలిపించండి, నేను మీ దగ్గరకు వచ్చి ఎక్స్‌ప్లైన్ చేస్తాను. సభా సంఘం వేయండి, లేదా ఎ.సి.బి. ద్వారా దర్యాప్తు చేయించండి. పేదవాడి ప్రాణాలను కాపాడే మిషన్లు ఈ విధంగా అవినీతిలో కూరుకుపోతుంటే, అప్రూవల్లో లేనిది, స్పెషిఫికేషన్లో లేనిది వేరే కంపెనీలు పాల్గొనడానికి అవకాశం లేకుండా ఏకైక వరుణ్ కంపెనీకే పాల్గొనే విధంగా అవకాశం కల్పించి, రూపకల్పన చేసి ఈ అధికారులంతా, జూనియర్ అధికారులతో ...

**డా.జి. చిన్నా రెడ్డి: –** అధ్యక్షా, మేము ఎదురుదాడి చెయ్యాల్సింది పోయి గౌరవ మంత్రివర్యులు గారు మా మీద ఎదురు దాడి చేస్తున్నారు. మేము సూటిగా రెండే ప్రశ్నలు అడుగుతాము. అణు ఇంధన నియంత్రణ సంస్థ మీకు 20.7.2015 నాడు అనుమతిని ఇచ్చింది. రూ.14 కోట్ల, 51 లక్షల 19వేల రూపాయలతో కొనుగోలు చేసిన మిషన్ను ఏ తేదీన కొన్నారో ఒకసారి చెప్పాలి. అంటే అనుమతి కన్నా ముందు కొన్నారా, అనుమతి తరువాత కొన్నారా అనే దాంతో క్లియర్ అయిపోతుంది. 2.5 ఎమ్.ఎమ్.డీమ్ ఉంటేనే క్యాన్సర్ ట్యూమర్లను కరిగించడానికి, ఆ సెన్సర్లను చంపడానికి బాగుంటుందని మన నిపుణుల రిపోర్ట్. 5 ఎమ్.ఎమ్. డీమ్ ఉంటే చుట్టుప్రక్కల ఉన్న కణాలు కూడా నష్టపోతాయనేది ఈరోజు ఉన్న రిపోర్ట్. వీటికి సమాధానం చెప్పకుండా దాట వేస్తున్నారు. అవినీతి జరిగిందని మేము అనడం లేదు. కొనుగోలు చేసిన మిషన్ స్పెసిఫికేషన్ల ప్రకారం లేదు. కొన్న తరువాత దాన్ని వాడకుండా నిరుపయోగంగా ఉంచారని అన్నామే తప్ప వేరే అనలేదు. మా పైన దాడి చేయడం బాగోలేదు. రెండింటికి మంత్రి గారిని సూటిగా సమాధానం చెప్పమనండి.

**డా. సి.లక్ష్మా రెడ్డి: –** వారు మాట్లాడేదంతా కూడా తప్పులు కాబట్టి ఖచ్చితంగా దాడి చేస్తాము. రామ్మోహన్ రెడ్డి గారు చెప్పిన కమిటీ టెక్నికల్ కమిటీ కాదు. వారు పేపర్లు పట్టుకొని దేశమంతా తిరుగుతున్నారు. ఇది వారు ఇచ్చిన రిపోర్ట్ తప్ప టెక్నికల్‌గా ఇచ్చిన రిపోర్ట్ కాదు. ఇందులో మిషన్ కొనుగోలు చేసింది రూ.22 కోట్లుగా చూపించారు. అది రూ.22 కోట్లు కాదు అధ్యక్షా, రూ.22 లక్షల డాలర్లు దాన్ని కన్వర్ట్ చేస్తే రూ.14 కోట్లు అవుతుంది. దాన్ని వీరు రూ.22 కోట్లుగా చిత్రీకరించారు. మీరు అవినీతి జరిగిందని అంటే, చిన్నారెడ్డి గారు జరగలేదని అంటున్నారు. ఒకవేళ అవినీతి జరిగినా మీ ప్రభుత్వ హయాంలో జరిగి ఉంటుంది. 2013లోనే మిషన్ ఆర్డర్లన్నీ అయ్యాయి, మా హయాంలో దీనికి సంబంధించి ఏమీ జరగలేదు. అవినీతి కూడా జరగలేదు. మీ ప్రభుత్వం దాటేసింది మంచి పని అయింది. ఎవరో కామెంట్ చేసిన దాన్ని, ఎవరో మీకిచ్చిన సబ్జెక్టు తీసుకొని సభలో ఈ విధంగా మాట్లాడొద్దు. మీరిచ్చే టెక్నికల్ కమిటీ ఒరిజినల్ కమిటీ కాదు. ఆ కమిటీని ఎవరు చేశారు. అనవసరంగా తెలియని దాని గురించి మాట్లాడొద్దు. ఈ లేటెస్ట్ వర్షన్ ఏదైతే ఉందో ఇది రాష్ట్రంలోనే మొట్టమొదటి అప్‌గ్రేడెడ్ వర్షన్. 2.5 వర్షన్ దీని ద్వారా బ్రెయిన్‌లో ఎక్కడున్నా ట్యూమర్లు వస్తే ఆ చిన్న స్పాట్‌లోనే రేడియేషన్ అందుతుంది. ఫోర్ సిట్టింగ్‌లతోనే దీని ద్వారా ట్రీట్‌మెంట్ అవడానికి అవకాశం ఉంది. గతంలో ఉన్న అప్‌డేషన్ వల్ల ఎక్కువ రేడియేషన్‌తో ప్రక్కనున్న కణాలు కూడా దెబ్బతినే ప్రమాదం ఉండేది. కానీ ప్రస్తుతమున్న అప్‌డేషన్ వల్ల క్యాన్సర్ కణాలు ఎక్కడున్నాయో అక్కడ మాత్రమే ట్రీట్‌మెంట్ చేసే అవకాశం ఉంటుంది.

**మిస్టర్ స్పీకర్: –** మీరు అడిగిన దాంట్లో ఒకటి రిపోర్ట్ విషయం ఉంది. రెండవది ప్రక్క కణజాలానికి సంబంధించి ఎఫెక్ట్ పడుతుందా, మిషన్ కొనుగోలుకు సంబంధించి డేట్ అడిగారు మూడింటికి మంత్రి గారు క్లారిఫికేషన్ చేసిన తరువాత మళ్లీ మీరు అడగడం బాగోలేదు.

10.20 ఉ. **డా. సి. లక్ష్మారెడ్డి : –** వాళ్లిద్దరూ అడిగిన దానికి సమాధానం చెబుతాను. పర్చేస్ ఆర్డర్ ఇచ్చిన తరువాత అనుమతి నిమిత్తం అణు ఇంధన నియంత్రణ సంస్థకి అప్లై చేస్తాము. అనుమతి వచ్చింది. 2.5 వర్షన్‌ని ఆ కంపెనీ సప్లై చేసింది. గతంలో ఆ కంపెనీ 1.5 వర్షన్‌ను సప్లై చేసింది, తరువాత 2.0 వర్షన్ వచ్చింది. ఇప్పుడు లేటెస్ట్‌గా వర్షన్ 2.5 వచ్చింది. ఒకసారి పర్చేస్ ఆర్డర్ చూడండి. పర్చేస్ ఆర్డర్‌లోనే క్లియర్‌గా ఉంది.

## భద్రాచలం దేవాలయం అభివృద్ధి

* ప్రశ్న నెం. 118 (161-c) శ్రీ జలగం వెంకట్రావు : – గృహ నిర్మాణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా :

(అ) భద్రాచలం దేవాలయాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ఉద్దేశిస్తున్నదా;

(ఆ) అయితే, అన్ని పండుగ సందర్భాలలో యాత్రికులకు సురక్షిత, సౌకర్యవంతమైన దర్శనాలను కల్పించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూర్చడానికి చేపట్టాల్సిన పనుల వివరాలేమిటి?

గృహ నిర్మాణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి (శ్రీ ఏ. ఇంద్రకరణ్ రెడ్డి ): (అ) అవునండీ.

(ఆ) ఈ విషయంలో ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయి.

శ్రీ జలగం వెంకట్రావు: –అధ్యక్షా, భారతదేశంలో తెలంగాణ రాష్ట్రంలోని పవిత్ర గోదావరి తీరాన శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం మా భద్రాచలంలో ఉంది. భద్రాచలం దేవాలయాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వ ఆలోచన ఏమిటి? గతంలో శ్రీరామనవమికి ముఖ్యమంత్రి గారు వచ్చినప్పుడు ఆ దేవాలయం అభివృద్ధికి రూ. 100 కోట్లు కేటాయించి, కార్యక్రమాలు

చేపడతామని చెప్పారు. ఇంజనీరింగ్ అధికారులు, ఎండోమెంట్స్ డిపార్ట్‌మెంట్ అధికారులు, సీఈ గారు, స్థపతి గారు కూడా అక్కడికి వచ్చి దేవస్థానం ప్రాంగణం చూసి ఏ విధంగా అభివృద్ధి చెయ్యాలని ఆలోచించారు. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో భద్రాచలం ఒక భాగం కాబట్టి దానిని ఏ విధంగా అభివృద్ధి చేయదలచుకున్నారు? కొత్తగా జిల్లా ఏర్పాటు అయ్యాయని అనౌన్స్‌మెంట్ వచ్చిన తరువాత మా సహచర శాసనసభ్యులు, మేము, స్థానిక ఎంపీ కొత్తగూడెం నుండి భద్రాచలం వరకూ పాదయాత్ర చేసి భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాను ఇచ్చినందుకు శ్రీ రామచంద్రస్వామికి ధన్యవాదాలు తెలుపుకున్నాము. జిల్లా సుభిక్షంగా ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, దేవాలయం అభివృద్ధి జరగాలని అక్కడికి వెళ్లడం జరిగింది. కొత్త జిల్లా ఏర్పడింది, జిల్లాలో ఉన్న దేవాలయం ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని దాని అభివృద్ధికి పాటుపడాలని అక్కడికి వెళ్లినప్పుడు అర్చకులు మాతో చెప్పారు. ఆ బాధ్యతను గుర్తిస్తూ నేను ఈ ప్రశ్నను వేయడం జరిగింది. ఈ ప్రాంత అభివృద్ధి కోసం, దేవస్థానం అభివృద్ధి కోసం 2009 లో రాజశేఖర రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు థీమ్ పార్క్‌ను శాంక్షన్ చెయ్యడం జరిగింది. థీమ్‌పార్క్‌కి సంబంధించి కొన్ని పనులు చేపట్టడం జరిగింది. దానికి సంబంధించిన భూమి ఆంధ్రా ప్రాంతంలో ఉండడం ద్వారా ఆ పనులు ఆగిపోయాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి గారిని నేను కోరిన పిదప మణుగూరు నుండి పర్ణశాల వరకూ కొత్తగా బ్రిడ్జి నిర్మాణానికి ఏర్పాట్లు చేశారు. యాత్రికులకు అది ఉపయోగంగా ఉంటుంది. ఆ ప్రాంతంలో కొత్త థీమ్ పార్క్‌ను నిర్మాణం చెయ్యాలని, దానికి కావలసిన భూములు అక్కడే ఉన్నాయని, వాటిని వినియోగించుకోవాలని కోరుతున్నాను.

అధ్యక్షా, ప్రతి సంవత్సరం శ్రీరామనవమి రోజున టెంపరరీ అకామొడేషన్‌ని ఏర్పాటు చేస్తున్నారు. ఆ సిస్టమ్ కొంచెం ఇబ్బందికరంగా ఉంది. తాటాకులు, రేకులతో అకామొడేషన్‌ని ఏర్పాటు చేస్తున్నారు. ఫైర్ యాక్సిడెంట్స్ జరిగితే ఇబ్బంది అవుతుంది అధ్యక్షా. పర్మినెంట్ ఉత్సవ విగ్రహాలతో, కళ్యాణాలు నిర్వహించే విధంగా కళ్యాణ మండపాన్ని పర్మినెంట్‌గా నిర్మించాలని కోరుతున్నాను. అందుకు కావలసిన ఫెసిలిటీస్ కల్పించాలని కోరుతున్నాను. కళ్యాణం చూడడానికి వచ్చినవారు భగవంతుని దర్శనం చేసుకోడానికి ఇబ్బందిపడుతున్నారు. అందువల్ల మంచి సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకోవాలి. త్వరలోనే శ్రీరామనవమి వస్తుంది. ఇప్పుడు సమయం లేదు కాబట్టి 2018 లో వచ్చే శ్రీరామనవమికి ఆ కార్యక్రమాన్ని పూర్తి చేసి ఆ ప్రాంత అభివృద్ధి కోసం, దేవస్థానం అభివృద్ధి కోసం కృషి చెయ్యాలి. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత ముఖ్యమంత్రి గారి ఆలోచన మేరకు కొత్తగూడెంలో ఎయిర్‌పోర్ట్ వస్తోంది. అందువల్ల యాత్రికులు పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కావలసిన ఫెసిలిటీస్‌ను మెరుగుపరచాలని మంత్రి గారిని కోరుతున్నాను. అదే విధంగా దేవాలయానికి సంబంధించి చాలా భూములున్నాయి. కొన్ని భూములు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లాయి. ఆ భూముల నుండి ఆదాయం మనకు రావడం లేదు. ఆ విషయమై ప్రభుత్వం ఏమి చేయదలచుకుంది? దేవాలయం నిర్వహణ కోసం, వచ్చే యాత్రికుల కోసం ఏ విధమైన సౌకర్యాలు కల్పించబోతున్నారు? గతంలో జీఓ 120 ని జారీ చేశారు. అంబసత్రం భూములను శంకరమఠానికి అప్పగించడం జరిగింది. ఆ జీఓను క్యాన్సిల్ చెయ్యమని ఉత్తరాలు రాసి రెండు సంవత్సరాలవుతుంది. ఎండోమెంట్స్ శాఖ సెక్రటరీగారు కాన్సిల్ చేస్తామని అన్నారు. శంకరమఠం వాళ్లు కూడా భూములను తిరిగి తీసుకోమని చెబుతున్నారు. దయచేసి ఆ భూములను వాపసు తీసుకోవాలి. గతంలో దాతలు ఆ భూములను దేవాలయానికి అప్పగించారు. ఆ భూములతో వచ్చిన ఆదాయంతో అన్నదానం నిర్వహించాలని వారు ఆ భూములను దేవాలయానికి అప్పగించారు. కాని ఆ విధంగా జరగడం లేదు. స్వామివారికి చెందవలసిన భూమి గురించి పట్టించుకోవాలి. ముక్కోటి ఏకాదశి 7,8 తేదీలలో అసెంబ్లీని నిర్వహించడం లేదు. భద్రాచలంలో 9 వ తేదీన ముక్కోటి ఏకాదశి అధ్యక్షా. ఆ రోజు దానిని పాటిస్తున్నాము. అందుకని, మిమ్మల్ని, లెజిస్లేటివ్ అఫైర్స్ మినిస్టర్ గారిని, ముఖ్యమంత్రి గారిని కోరేది ఏమిటంటే, తమరు కూడా అక్కడికి వస్తారు కాబట్టి, మంత్రి గారు కూడా ఇక్కడే ఉన్నారు కాబట్టి 9వ తేదీన అసెంబ్లీ సమావేశాలకు సెలవు ప్రకటించాలని కోరుతున్నాను.

శ్రీ ఏ. ఇంద్రకరణ్ రెడ్డి : – అధ్యక్షా, భద్రాచలం సీతారామ చంద్రస్వామి దేవస్థానం యొక్క పవిత్ర గురించి ప్రతి ఒక్కరికీ తెలుసు. ప్రభుత్వం తరపున ప్రతిసంవత్సరం గౌరవ ముఖ్యమంత్రి గారు స్వయంగా తలంబ్రాలు తీసుకొచ్చి అక్కడ కళ్యాణంలో పాల్గొనే ప్రక్రియ ఆనవాయితీగా అందరూ పాటించడం జరుగుతోంది. ఆ దేవాలయం గురించి ప్రతి ఒక్కరికీ తెలుసు. ఈ దేవాలయం 16 వ శతాబ్దానికి చెందినది. కొత్తగూడెం, భద్రాచలం మరియు ఖమ్మం జిల్లాలకు సంబంధించి దేవాలయానికి 299 ఎకరాల మాన్యాలున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా, గుంటూరు, ప్రకాశం, కర్నూలు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరిలో 1048 ఎకరాల

మాన్యాలు ఉన్నాయని రికార్డ్‌లో ఉంది. ఆ భూముల ఆక్షన్ ద్వారా వచ్చిన డబ్బును ఫిక్స్‌డ్ డిపాజిట్ చెయ్యాలా లేక ఆ డబ్బుతో ఆల్టర్నేట్ భూములు కొనాలా అని పరిశీలన చేస్తున్నాము. ప్రతి సంవత్సరం శ్రీరామ నవమి రోజున కళ్యాణానికి అక్కడ కళ్యాణ మండపంలో ఏర్పాట్లు చేస్తున్నాము. తాటాకులతో కళ్యాణ మండపాన్ని ఏర్పాటు చెయ్యడం మంచిదని పర్మినెంట్ కళ్యాణ మండపం కట్టడం లేదు. స్థపతి గారితో, అక్కడున్న అధికారులతో మాట్లాడి ఈ విషయంలో ఏం చెయ్యాలి అని పరిశీలించడం జరుగుతోంది. కళ్యాణానికి వెళ్లినప్పుడు, అర్చకులు, ఆ ప్రాంతం వారు దేవాలయాన్ని అభివృద్ధి చెయ్యాలని స్థానిక నాయకులను అడిగారు. ఏడు మండలాలు ఆంధ్రాప్రాంతానికి వెళ్లాయి. భద్రాచలం గుడి పక్కనున్న ప్రాంతం కూడా ఆంధ్రా ప్రాంతానికి వెళ్లింది. రూ. 100 కోట్లు దేవాలయం అభివృద్ధికి ఇస్తామని ముఖ్యమంత్రి గారు అనౌన్స్ చెయ్యడం జరిగింది. అందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. శ్రీరామనవమికి పూర్తి అవగాహనతో, స్థపతిగారి ఆలోచనతో, ఇంజనీర్లతో మాట్లాడి, ముఖ్యమంత్రి గారితో మాట్లాడి ఏ విధంగా చేస్తే బాగుంటుందో ఆ విధంగా చేస్తాము. తప్పకుండా అభివృద్ధి జరుగుతుంది. టూరిజం డిపార్ట్‌మెంట్‌వాళ్లు థీమ్ పార్క్ గురించి భూమిని అలాట్‌మెంట్ చెయ్యడం జరిగింది.

**10.30 ఉ.** ఆ ల్యాండు ఇప్పుడు ఆంధ్ర ప్రాంత పరిధిలోకి పోయింది. కాబట్టి ప్రత్యామ్నాయ భూమి కోసం ప్రయత్నం చేస్తున్నాము. ఆ భూమిని తీసుకొని ఆల్టర్నేటివ్ గ్రీన్ పార్క్ ఏర్పాటు కోసం టూరిజం శాఖ ఆధ్వర్యంలో ప్రయత్నం జరుగుతున్నది. ముఖ్యమంత్రిగారు భద్రాచలాన్ని ఎప్పటికీ జ్ఞాపకం ఉంచుకునే విధంగా భద్రాద్రి జిల్లా పేరు పెట్టడం మంచి శుభ పరిణామమని తెలియజేస్తున్నాను. అంబా సత్రం మెయింటెనెన్స్ గురించి ఫైల్ సర్క్యులేషన్‌లో ఉంది. శృంగేరి పీఠం వారు మెయింటెనెన్స్ చెయ్యమని అంటున్నారు. వారితో మరోసారి చర్చించి దానిని క్యాన్సిల్ చేయడానికి కూడా మేం ప్రయత్నం చేస్తామని ఈ సందర్భంగా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

**శ్రీ జలగం వెంకట్రావు(కొత్తగూడెం):–** అధ్యక్షా, మంత్రిగారు చెప్పిన దాంట్లో రామాయణం థీం పార్క్, పురుషోత్తపట్టణంలో పెట్టాలనే ఆలోచనతో అక్కడ 11 ఎకరాల పైచిలుకు భూమిని తీసుకొని అక్కడ ఆ కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. ప్రస్తుతం ఆ ప్రాంతం ఆంధ్ర రాష్ట్రంలోకి పోయింది. పర్ణశాల దగ్గర దేవుడి భూమి సుమారు 15ఎకరాలు సిద్ధంగా ఉంది. కాబట్టి అక్కడ నిర్మాణం చేయమని కోరుతున్నాము. అంబా సత్రం గురించి కూడా ఒక టైంబౌండ్ మ్యానర్ కింద తీసుకోవాలి. ఎందుకంటే ఇప్పటికే రెండు సంవత్సరాల నుంచి అంబా సత్రం భూములు వాపస్ తీసుకోలేదు. ఒక టైంబౌండ్ కింద వాపస్ తీసుకోవడమంటే జి.ఓ.నెం.129ని క్యాన్సిల్ చేయాలి. దీనికి సంబంధించిన ఉత్తర్వులు ఎప్పటిలోగా విడుదల చేస్తారు? ఇవే కాకుండా ఇంకా అదనపు వసతులు యాత్రికులకు కల్పించడానికి ప్రభుత్వం ఏం క్రియేట్ చేయబోతున్నది? మనం కేవలం టెంపుల్ డెవలప్‌మెంట్ గురించి మాట్లాడుతున్నాము. యాత్రికుల గురించి అడీషనల్ కాటేజీలు నిర్మాణం చేస్తారని చాలామంది దాతలు అడుగుతున్నారు. ఆ స్కీమును ప్రకటించండి. టెంపుల్‌కి కూడా ఆదాయాన్ని పెంచే ప్రయత్నం చేయండి. చాలా మంది దాతలు కాటేజీలు కట్టించడానికి ముందుకొస్తున్నారు. మా నాన్నగారి పేరుమీద కూడా మా సోదరుడు కాటేజీ కట్టించాడు. ఈ రకంగా కట్టించిన కాటేజీల మెయింటెనెన్స్ చెల్లించడానికి ఇబ్బంది పడుతున్నారు. కాబట్టి వీటి మెయింటెనెన్స్ కోసం ఏం చర్యలు చేపట్టబోతున్నారు? ఎందుకంటే మిగతా దేవస్థానాలలో మెయింటెనెన్స్ గురించి చాలా ఫోకస్ పెట్టి చేస్తున్నారు. భద్రాచలంలో చాలామంది కాటేజీలు నిర్మాణం చేయడానికి దాతలు ముందుకొస్తున్నారు. కాబట్టి ఈ విషయాన్ని గురించి మంత్రిగారు కొంచెం ఆలోచన చేయాలని కోరుతున్నాను.

**శ్రీ జి. కిషన్ రెడ్డి:–** అధ్యక్షా, ఇప్పటికే అక్కడికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ గారు స్వయంగా వచ్చి నేషనల్ హైవేకి ఫౌండేషన్ వేయడంతోబాటు సదరు హైవేకి కనెక్టివిటీ ఇవ్వడం జరిగింది. కొత్తగూడెం, భద్రాచలం మధ్యలో ఎయిర్‌పోర్టు కూడా పెట్టాలి. ఎందుకంటే అయోధ్య తరువాత మనదేశంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన దేవాలయం భద్రాద్రి దేవాలయం. ఈ దేవాలయానికి మన రాష్ట్రం నుంచే కాకుండా బయటి రాష్ట్రాల నుంచి కూడా భక్తులు రావడానికి భక్తి, శ్రద్ధలతో ప్రయత్నం చేస్తుంటారు. కాబట్టి విమాన సౌకర్యం కల్పించినట్లైతే చాలామంది భక్తులు రావడానికి అవకాశముంటుంది. మన తెలంగాణ రాష్ట్రంలో కేవలం ఒకటే ఎయిర్‌పోర్టు ఉన్నది. ఆంధ్రప్రదేశ్‌లో అయిదారు ఎయిర్‌పోర్టులున్నాయి. కాబట్టి మన తెలంగాణ రాష్ట్రంలో కూడా కొత్తగా ఎయిర్‌పోర్టులను ఏర్పాటు చేయాలి. అందులో ముఖ్యంగా కొత్తగూడెం, భద్రాచలం మధ్యలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేసినట్లైతే చాలా బాగుంటుంది. ఆ విషయం ఆలోచన చేయాల్సిన అవసరమున్నదని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. భద్రాచలం రాములవారి భూములు ఆంధ్రప్రాంత పరిధిలోకి పోయిన

సందర్భంగా ఆ భూములను ఖచ్చితంగా తగు జాగ్రత్తలు వహించి, అక్కడి ప్రభుత్వంతో చర్చించి, ఆ భూములను భద్రాచలం దేవాలయానికి చెందేలా చర్యలు తీసుకోవాలి. ఎందుకంటే టి.టి.డి భూములు తెలంగాణ రాష్ట్ర పరిధిలో ఉన్నందున మనం భయపడాల్సిన అవసరం లేదు. ఇరు రాష్ట్రాలు ఎండోమెంట్స్ భూముల మీద ఒక అంగీకారానికొచ్చి ఆ భూముల పరిరక్షణ కోసం చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నాను.

**శ్రీ ఏ. రేవంత్ రెడ్డి (కొడంగల్)ః –** అధ్యక్షా, ఆగస్టు, 13 నుంచి 18వరకు రామాలయంలో పవిత్రోత్సవాలు జరిగాయి. అప్పుడు నిత్య కళ్యాణం పక్కన పెట్టడం వలన కొన్ని ఆభరణాలు ప్రధానంగా సీతమ్మవారి పుస్తె, లక్ష్మణుడిగారి లాకెట్ రెండూ పోయాయని అర్చకులు ఇ.ఓకి ఫిర్యాదు చేయడం జరిగింది. దాని మీద పోలీసులకు కూడా ఫిర్యాదు చేయడానికి ఇ.ఓగారు ముందుకొచ్చారు. అయితే పోయిన నగల గురించి రెండు రోజుల సమయమిస్తే వెతుకుతామని అర్చకులు చెప్పి చివరికి పోయిన రెండు నగలూ లాకర్లోనే దొరికాయని చెప్పారు. ముందేమో ఇదే అర్చకులు లాకర్లతో సహా మొత్తం వెతికాం, ఎక్కడా ఆ రెండు ఆభరణాలు లేవు, పోయాయని ఇ.ఓ గారికి రాతపూర్వకంగా ఫిర్యాదు ఇచ్చారు. కానీ ఇ.ఓ గారు పోలీసులకు ఫిర్యాదు చేస్తానని ముందుకొచ్చిన తరువాత రెండు రోజుల సమయం తీసుకొని సీతమ్మవారి పుస్తె, లక్ష్మణుడిగారి లాకెట్ దొరికాయని చెప్పారు. భద్రాద్రి రాముడి గుడిలోనే నగలు మాయమైపోయి పోలీసుల విచారణకు ఆదేశించే సమయంలో, ప్రభుత్వం జరిగిన సంఘటన గురించి విచారణకు ఆదేశించింది. విచారణ నిమిత్తం అక్కడ పనిచేస్తున్న అధికారిని నియమించడంలో మాకు కొన్ని అనుమానాలున్నాయి. అసలు నగలు ఎలా మాయమయ్యాయి? మాయమైన నగలు మళ్లీ ఎలా దొరికాయి? సదరు విషయంలో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఆ రిపోర్టు వివరాలేమిటి? ఆ రిపోర్టు ప్రకారం ఎవరి మీద చర్యలు తీసుకున్నారనేది సభకు చెప్పాల్సిన అవసరమున్నది.

భద్రాద్రి టెంపుల్‌గానీ, భద్రాద్రి పట్టణం గానీ 1/70 చట్టం క్రింద వస్తాయి. అక్కడ వసతులు ఏర్పాటు చేయాలన్నా, అభివృద్ధి చేయాలన్నా కూడా 1/70 యొక్క అడ్డం వస్తుంది కాబట్టి రాష్ట్ర ప్రభుత్వమేమైనా మినహాయింపుల కోసం గవర్నర్ గారిచేత మినహాయింపులు తీసుకొని అక్కడికొచ్చే భక్తులందరికీ వసతులు ఏర్పాటు చేయడానికి ప్రత్యేకంగా ఏమైనా చర్యలు తీసుకున్నారా అనేది చెప్పాలి.

మూడవది అక్కడ దేవాలయ కమిటీ లేక మూడు సంవత్సరాలైంది. కాబట్టి ప్రభుత్వం ఎప్పటిలోగా దేవాలయ కమిటీని వేసి అక్కడ వసతులను ఏర్పాటు చేయడానికి కమిటీని ఎప్పటిలోగా నియమిస్తారనేది చెప్పాలని తమరి ద్వారా కోరుతున్నాను.

**శ్రీ సున్నం రాజయ్య (భద్రాచలం)ః–** అధ్యక్షా, భద్రాచలం పుణ్యక్షేత్రం నా నియోజకవర్గంలో ఉన్నది. ఎందుకంటే భారతదేశంలోనే అయోధ్య తరువాత ప్రముఖమైన దేవస్థానం. అన్ని రాష్ట్రాల నుంచి ప్రతిరోజూ వేలాది మంది వస్తుంటారు. ఈ దేవాలయ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి గారు 2015-16లో ఇచ్చిన హామీ ప్రకారం రూ.100 కోట్లు ప్రకటించారు. వాటికి కావలసిన ప్రణాళికలను కూడా సిద్ధం చేసి నేను స్వయంగా ముఖ్యమంత్రి గారికి ఇవ్వడం జరిగింది. కాబట్టి రూ.100 కోట్ల నిధులు తక్షణమే విడుదల చేయాలి. ప్రధానంగా భద్రాచలం దేవస్థానం భూములు పురుషోత్పట్నం గ్రామపంచాయతీలో ఉన్నాయి. ఎందుకంటే ఈ గ్రామం భద్రాచలానికి ఆనుకొని ఉన్నది. ఆ గ్రామానికి 997 ఎకరాలు మన భద్రాచలం దేవాలయం భూములున్నందున ఆ గ్రామ పంచాయతీని, అదే పక్కన ఉన్న కన్నాయిగూడెం, ఎటపాక, గుండాలు, పిచ్చుకలపాడు గ్రామపంచాయతీలను కలుపుకొంటేనే సౌలభ్యంగా ఉంటుంది. అట్లాగే భక్తులకు కావలసిన సౌకర్యాలు మెరుగుపర్చాలన్నా ఆ పట్టణం, మాడ వీధులు అభివృద్ధి కావాలంటే తక్షణం రూ.100 కోట్లు ప్రభుత్వం విడుదల చేయాలి.

(ఈ దశలో మైక్ కట్‌చేయబడింది)

**శ్రీ ఎస్.ఏ.సంపత్ కుమార్ (అలంపూర్)ః –** అధ్యక్షా, దైవ చింతన ఎక్కువగా ఉండి ప్రభుత్వం ఆధ్యాత్మిక మార్గంలో పోతున్న సందర్భంలో కొన్ని దేవాలయాలు యాదాద్రి, భద్రాద్రి, రాజరాజేశ్వర దేవాలయాల మీద ప్రత్యేక శ్రద్ధ వహించి కోట్ల రూపాయలను వెచ్చించి అభివృద్ధి చేస్తున్నందుకు సంబంధిత మంత్రి గారిని, ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాను. ఈ దేవాలయాలతోబాటు అత్యంత ప్రాశస్త్యమైనది అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటైన మాతల్లి జోగులాంబ ఆలయాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచన కూడా ప్రభుత్వానికి ఉండటం, గౌరవ ముఖ్యమంత్రి గారు కూడా ఈ మధ్య పుష్కర స్నానానికి అక్కడికి రావడం, సభాపతి గారు కూడా రెండుసార్లు అమ్మవారి ఆశీర్వాదం తీసుకొని ఆ ప్రాశస్త్యాన్ని యావత్

ప్రపంచానికి తెలియజేయడానికి ప్రయత్నం చేస్తామని చెప్పారు. మొన్నటి పుష్కరాల సందర్భంగా గౌరవ ముఖ్యమంత్రి గారు అక్కడికి వచ్చినప్పుడు కూడా చాలా విపులంగా ఆలయ అభివృద్ధి గురించి చర్చించడం జరిగింది.

సంబంధిత అధికారులతో గౌరవ ముఖ్యమంత్రి గారు విశ్లేషించారు. గౌరవ దేవాదాయ శాఖ మంత్రి గారి సమక్షంలోనే ఈ సమావేశం జరిగింది. వీలైనంత తొందరగా కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తామని పాత్రికేయ సమావేశంలో ముఖ్యమంత్రి గారు చెప్పడం జరిగింది. దేవాలయాల అభివృద్ధిలో 1/70 యాక్టు, ఆర్కియాలజికల్ సమస్యలు ఉంటాయి. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వ పరంగా కానీ, ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ పరంగా కానీ, కేంద్రంలోని మినిస్ట్రీ ఆఫ్ కల్చర్‌తో ఎన్.ఓ.సి. తీసుకోవాల్సిన అవసరం ఉంటుంది. మా దగ్గర జోగులాంబ అమ్మవారు, బాల పరమేశ్వరి అమ్మవారి టెంపుల్స్ రెండు కలిసి ఉంటాయి. అమ్మవారి ఆలయ విస్తరణలో ఆర్కియాలజికల్ డిపార్టుమెంటు ద్వారా మినిస్ట్రీ ఆఫ్ కల్చర్‌తో ఎన్ఓసి తీసుకోవడం జరిగింది. ఈ బాల పరమేశ్వరి అమ్మవారి ఆలయ విస్తరణలో కూడా అలాంటి పని జరగాల్సి ఉన్నది. ముఖ్యమంత్రి గారు ఆలయాన్ని సందర్శించి కూడా ఏడెనిమిది నెలలౌతున్నప్పటికి కరస్పాండింగ్ ప్రయత్నం కూడా జరగలేనందున ఆ విషయమై దృష్టి పెట్టాలని కోరుతున్నాను. మనుషులకు డబ్బులు కేటాయించకపోయిన దేవుళ్లకు బాగా కేటాయిస్తున్నారు. ..

( మైక్ కట్ చేయడం జరిగింది)

10.40 ఉ. **శ్రీ ఎమ్. సుధీర్ రెడ్డి (మేడ్చల్):** – అధ్యక్షా నా నియోజకవర్గంలోని వెంకటాపురంలోని బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ఉంది. ఆ దేవాలయానికి సంపూర్ణంగా భూములు ఉన్నాయి. ఘటకేసర్ మండలంలోని కొన్ని గ్రామాల్లోని దేవుడి భూముల్లో 200 ఎకరాల వరకు అన్యాక్రాంతమై ఆ భూముల్లో ఇండ్లు కూడా కట్టుకున్నారు. కావున వీటన్నింటిని జీ.ఓ.నెం .58 లేదా జీ.ఓ.నెం.59 కింద రెగ్యులరైజ్ చేసి దేవాలయానికి ఆదాయం సమకూరే విధంగా చేయాలని కోరుతున్నాను. తిరుపతిలో శ్రీనివాసుడి కళ్యాణం జరిగే సమయంలో ఈ దేవాలయానికి పట్టువస్త్రాలు పంపించే ఆచారం సనాతనంగా వస్తోంది. కావున ఈవిషయాన్ని కూడా పరిశీలించాలని కోరుకుంటున్నాను. వివిధ గ్రామాల్లో దేవుడి భూములున్నప్పటికీ ఎటువంటి ఆదాయం రావడం లేదు. కావున వివిధ గ్రామాల్లోని దేవుని భూములను ఆక్షన్ పెట్టి వచ్చిన డబ్బును ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తే ఆ వచ్చే డబ్బుతోనైనా నిత్య పూజలు జరిగే ఆస్కారం ఉంటుంది. దేవుడి భూములను అన్యాక్రాంతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాను. కీసర గుట్ట పుణ్యక్షేత్రానికి ఒకటే రోడ్డు ఉన్నందున, మరో రోడ్డును కూడా ఏర్పాటు చేసే విషయమై సత్వరమే చర్యలు తీసుకోవాలని మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ ఎ.ఇంద్రకరణ్ రెడ్డి:** – అధ్యక్షా, భద్రాచలం శ్రీ సీతారామ స్వామి దేవాలయం గురించి గౌరవ సభ్యులు వెంకట్ రావు గారు, కిషన్ రెడ్డి గారు, రేవంత్ రెడ్డి గారు, సుధీర్ రెడ్డి గారు, సున్నం రాజయ్య గారు, సంపత్ కుమార్ గారు మాట్లాడారు. పర్ణశాలలో థీమ్ పార్కు ఏర్పాటు గురించి వెంకట్ రావు గారడగిన విషయంలో ఆ భూమి ఆంధ్ర ప్రాంతంలోకి వెళ్లినందున, పర్ణశాల పరిసరాల్లో థీమ్ పార్కును ఏర్పాటు చేయడానికి అతి త్వరలోనే ఆదేశాలివ్వడం జరుగుతుందని తెలియజేస్తున్నాను. అంబ సత్రం విషయంలో జీ.ఓ.నెం.129 ఫైల్ సర్క్యులేషన్‌లో ఉంది. శృంగేరి పీఠం వారితో మాట్లాడి ఈ విషయమై అతి త్వరలోనే నిర్ణయం చేయడం జరుగుతుంది. సత్రాన్ని వారు నిర్వహించలేమని చెప్పినప్పుడు ప్రభుత్వమే దానిని తీసుకొని మెయిన్‌టైన్ చేసే ప్రయత్నం చేస్తుంది.

గౌరవ సభ్యులు కిషన్ రెడ్డి గారు చెప్పినట్లుగా అయోధ్య తరువాత భద్రాచలం శ్రీ సీతారామ స్వామి దేవాలయానికి అంతటి ప్రాముఖ్యత ఉన్నది. భద్రాద్రి శ్రీసీతారామస్వామి దేవాలయానికి ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వస్తున్నందున శ్రీరామనవమి సందర్భంగా దేవుడిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలను మెరుగుపరుస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కాటేజీలను, టెంపరరీ టాయిలెట్స్‌ను మరియు అన్ని సదుపాయాలను చేపట్టడం జరుగుతోంది. భద్రాద్రి దేవాలయంలో అమ్మవారి మంగళసూత్రాలు మరియు ఇతర ఆభరణాలు పోయాయని గౌరవ సభ్యులు రేవంత్ రెడ్డి గారు చెప్పిన విషయంలో, మంగళసూత్రం పోలేదని ఇతర చిన్న చిన్న ఆభరణాలు మాత్రమే పోయాయని తెలియజేస్తున్నాను. ఆ సందర్భంలో పోలీసు కంప్లైంట్ ఇచ్చి వెతికించగా 10 రోజుల తరువాత అక్కడే ఆ ఆభరణాలు దొరకడం జరిగింది. ఈ విషయంలో పోలీసులు ఎంక్వైరీ కూడా చేశారు. దీంట్లో ఎవరిని తప్పు పట్టే ఆస్కారం మాకు కనబడలేదు. లాకర్‌లో కాకుండా మందిరంలోనే ఆభరణాలు దొరకడం జరిగింది. అక్కడ పని చేసే అర్చకులను విచారణ చేయడం జరిగింది. అనుమానం కలిగిన వారిపై చర్యలు తీసుకోవాలని ఈ.ఓ. కు ఉత్తరం కూడా వ్రాయడం జరిగింది. వివిధ వసతులకై ముఖ్యమంత్రి గారు

కేటాయించిన రూ.100 కోట్ల కంటే ఎక్కువ నిధులనే ప్రణాళిక బద్ధంగా తీసుకునే ఆస్కారం ఉంటుంది.

ఆలంపూర్ జోగులాంబ అమ్మవారి ఆలయంలోని బాలపరమేశ్వరి అమ్మవారి ఆలయానికి సంబంధించిన విషయం ఆర్కియాలజి డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో ఉంది. ఈ విషయమై ముఖ్యమంత్రి గారు పార్లమెంట్ సభ్యులను సంప్రదించి మంజూరికై కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కేంద్రం నుంచి మంజూరు వచ్చినట్లైతే అభివృద్ధి చేయడానికి వీలౌతుంది. గౌరవసభ్యుడు సుధీర్ రెడ్డి గారు చెప్పినట్లు ఆంధ్ర పాలకుల ప్రభుత్వాల్లో తెలంగాణలోని ఏ దేవాలయానికి అదరణ లభించలేదు. ప్రస్తుతం ప్రతి ఒక్కరు దేవాలయాలు అభివృద్ధి కావాలని కోరుకుంటున్నాము. సమైఖ్య రాష్ట్రంలో తిరుపతి తరువాత సింహాచలం, అన్నవరం, శ్రీకాళహస్తి, శ్రీశైలం, కనకదుర్గ దేవాలయం మొదలైన పేర్లను మాత్రమే చెప్పేవారు. తెలంగాణలోని ఏ దేవాలయం పేరును కూడా చెప్పకపోయేవారు. గౌరవ ముఖ్యమంత్రి గారు దేవాలయాల ప్రతిష్టను పెంచాలని, తెలంగాణ తిరుపతిగా యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మినరసింహస్వామి దేవాలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి, తెలంగాణ ప్రజలకు,....

(అంతరాయం)

**మిస్టర్ స్పీకర్ : –** ప్లీజ్ సైలెన్స్. రన్నింగ్ కామెంట్రీ చేయవద్దు.

**శ్రీ ఎ.ఇంద్రకరణ్ రెడ్డి: –** అధ్యక్షా, కాళేశ్వరం, భద్రాచలం, వేముల వాడ రాజరాజేశ్వర స్వామి ఆలయాల అభివృద్ధికి డబ్బులు కేటాయించడం జరిగింది. ఈ బడ్జెట్‌లో వేములవాడ క్షేత్రానికి రూ.100 కోట్లను కేటాయించడం జరిగింది. ధర్మపురి క్షేత్రాన్ని, బాసర సరస్వతి మాత ఆలయాన్ని, కొండగట్టు అంజన్న దేవాలయాన్ని, ఆలంపూర్ జోగులాంబ ఆలయాన్ని మరియు ఇతర అన్ని ఆలయాలను అభివృద్ధి చేయడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అంచలంచెలుగా వీటన్నింటిని అభివృద్ధి చేయడం జరుగుతుంది.

## యాద్రాద్రి జిల్లాలో నీటిపారుదల కాలువల ఆధునికీకరణ

*ప్రశ్న నెం.104(2184) శ్రీమతి గొంగడి సునీత (ఆలేరు), సర్వశ్రీ వేముల వీరేశం (నక్రేకల్), కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి (మునుగోడు), గాదరి కిషోర్ కుమార్ (తుంగతుర్తి), పైళ్లశేఖర్ రెడ్డి (భువనగిరి) :– సాగునీటి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) యాద్రాద్రి జిల్లాలోని బునియాదిగానికాలువ, పిల్లాయిపల్లి కాలువ, ధర్మారెడ్డి కాలువలను ఆధునికీకరించడానికి ప్రభుత్వం నిర్ణయించిన విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, సదరు ప్రయోజనం కోసం మంజూరు చేసిన నిధుల పరిమాణం ఎంత;

ఇ) ఎప్పటిలోగా సదరు కాలువల ఆధునీకరణ పనులు పూర్తి చేయడమౌతుంది ?

**సాగునీటి శాఖ మంత్రి ( శ్రీ టి. హరీశ్‌రావు ):** అ) అవునండీ.

ఆ) యాదాద్రి జిల్లాలో బునియాదిగాని కాలువ, పిల్లాయిపల్లి కాలువ, ధర్మారెడ్డి కాలువల పునరుద్ధరణ కోసం ప్రభుత్వం రూ.284.85 కోట్ల మొత్తాన్ని మంజూరు చేసింది.

ఇ) సాంకేతిక మంజూరు, టెండర్ల ఆహ్వానాలు ప్రాసెస్‌లో వున్నాయి. ఒప్పంద షరతుల ప్రకారం ఒప్పందం కుదుర్చుకున్న తేదీనుండి 18 నెలలలోపుల పనిని పూర్తి చేయడమవుతుంది.

**శ్రీ వేముల వీరేశం:–** అధ్యక్షా, బునియాదిగాని కాలువ, పిల్లాయిపల్లి కాలువ, ధర్మారెడ్డి కాలువలు నకిరేకల్, భువనగిరి, మునుగోడు నియోజకవర్గానికి సంబంధించినవి. చాలా సంవత్సరాలుగా ఈ ప్రాంత ప్రజలు తీవ్రంగా నీటికి ఇబ్బందిపడుతున్నారు. ఈ కాలువలు పూర్తైతే ఇక్కడి ప్రజలందరూ సంతోషంగా ఉంటామనే ఆలోచనతో ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన తరువాత మంత్రి గారు ఈ కాలువలను క్షుణ్ణంగా పరిశీలన చేయడం జరిగింది. గతంలో ఈ కాలువల ద్వారా ఎన్ని చెరువులను నింపారు, ప్రస్తుతం ఎన్ని చెరువులను నింపుతున్నారనే పూర్తి వివరాలను తెలియజేయాలని మంత్రి గారిని కోరుతున్నాను.

**10.50 ఉ.** ఈ కాలువలకు సంబంధించి వైడనింగ్ అవసరముందా, ఉంటే దానిని ఏ విధంగా ఎప్పటి లోగా పూర్తి చేస్తున్నారు, పూర్తి వివరాలు తెలపాలి. గతంలో కాలువలకు సంబంధించిన నిధులు కేటాయించినప్పటికీ చివరి చెరువుల వరకు నీళ్లు రాలేదనే తీవ్రమైన ఆవేదనతో రైతాంగం ఉంది. అందులో ఉన్న లోపాలేమిటి, ఎందుకు నీరు చివరి చెరువు వరకు రాలేదు, ఇప్పుడు దానిని ఏ విధంగా సరి చేస్తారు, ఎప్పటిలోగా ఈ పనులన్నీ పూర్తి చేస్తారు, ఎప్పటిలోగా రైతాంగానికి నీరు అందిస్తారో తెలపాలని మంత్రి గారిని అడుగుతున్నాను.

**శ్రీ కె. ప్రభాకర్ రెడ్డి :–** అధ్యక్షా, బునియాదిగాని కాలువ, పిల్లాయిపల్లి కాలువ, ధర్మా రెడ్డి కాలువలను 2006 సంవత్సరంలో శాంక్షన్ చేసినట్టు గత ప్రభుత్వం చెప్పింది. 100 క్యూసెక్కులతో

గత ప్రభుత్వ కాలంలో ఆ పాలకుల పుణ్యమా అని ఈ రోజు వరకు కాలువలు పూర్తి కాలేదు. అప్పుడు రూ.24కోట్లు, రూ.14 కోట్లు చిన్న అంచనాలతో శాంక్షన్ చేసినప్పటికీ ఈరోజు వరకు పూర్తి కాలేదు. గత ప్రభుత్వ కాలంలో భూసేకరణ కూడా పూర్తి కాక వారికి డబ్బులు కూడా ఇవ్వలేదు. కాని మన ప్రభుత్వం రాగానే మా విన్నపాన్ని తెలియజేయగానే హరీషన్న గారు ఆ కాలువలు మొత్తం ఒక రోజంతా తిరిగి తక్కువ నీళ్లతో చివరి బోర్ల వరకు పోవని 100 కూసెక్కులున్నవి 500 క్యూసెక్కులు చేసుకోవాలి. 50 క్యూసెక్కులు ఉన్నవి 300 క్యూసెక్కులు చేసుకోవాలి. ఈ కాలువలకు నీళ్లు ఎక్కువ ఇచ్చుకోగలిగితే ఎక్కువ భూములను సాగు చేసుకోవచ్చని చెప్పారు. అటు కృష్ణ, గోదావరి రెండు నదులు ఎండిపోయినా గాని ఈ మూసి కాలువ మాత్రం ఎన్నడూ ఎండిపోదు. ఈ నీళ్లను మనం ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో హరీష్‌రావు గారికి విజ్ఞప్తి చేస్తే వారు ముఖ్యమంత్రి గారికి విన్నవించి, ముఖ్యమంత్రి గారు నల్గొండ జిల్లాకు వచ్చినప్పుడు ఈ కాలువ గురించి మాట్లాడినప్పుడు ఒక్క నిమిషంలోనే 350 కోట్ల రూపాయలు కాలువల ఆధునికీకరణ కోసం శాంక్షన్ చేస్తున్నామని ప్రకటించడం జరిగింది. పోచంపల్లి, చౌటుప్పల్ మండలం, మునుగోడు మండలం మూడు నియోజక వర్గాల్లో నీరు పారుతాయి. ఈ పనులను వేగవంతం చేసుకోడానికి టెండర్లు పిలిచి, 500 క్యూసెక్కులు పోయే పిల్లాయిపల్లి కాలువ, పోచంపల్లి, మునుగోడు, చిట్యాల, చౌటుప్పల్ వస్తాయి. నీళ్లు 500 క్యూసెక్కులు చేసుకుంటున్నాము కాబట్టి, పోచంపల్లి వద్ద మైసమ్మ గడ్డ ఉంది. అక్కడి నుండి మన ప్రభుత్వం కోటి ఎకరాలకు నీళ్లు ఇవ్వాలనే తపనతో ఉన్నది కాబట్టి, ఎత్తులో ఉన్నందువల్ల కృష్ణా నీళ్లు అయినా, గోదావరి నీళ్లు అయినా పోచంపల్లి వద్ద 5 గ్రామాలు, చౌటుప్పల్ వద్ద 5 గ్రామాలు మొత్తం 10 గ్రామాలకు ఎక్కడి నుండి నీళ్లు వచ్చే అవకాశం లేదు. మైసమ్మ కత్వ నుండి లిఫ్ట్‌ను శాంక్షన్ చేస్తే ఈ 10 గ్రామాల్లోని చెరువులను నింపుకుంటే దాదాపు 15వేల ఎకరాలు పండుతాయి. ఇది కూడా కోటి ఎకరాల్లో భాగంగా ఉంటుంది కాబట్టి, దీనిని శాంక్షన్ చేసి మా ప్రజలను ఆదుకోవాలని కోరుతూ, 6నెలల్లో పూర్తి చేస్తే బాగుంటుందని మంత్రి హరీష్‌రావు గారిని కోరుతున్నాను.

**శ్రీ పి. శేఖర్ రెడ్డి ః–** అధ్యక్షా, బునియాదిగాని కాలువ, పిల్లాయిపల్లి కాలువ, ధర్మా రెడ్డి కాలువలు భువనగిరి నియోజక వర్గానికి చెందినవి. మన ప్రభుత్వం రాగానే ఇరిగేషన్ శాఖా మంత్రి హరీష్ రావు గారే స్వయంగా ఆ కాలువలను పరిశీలించి సదరు కాంట్రాక్టరు పనులను చేయకపోతే రీడిజైన్ ఎస్టిమేషన్ కూడా వేసి కాలువ పనులు చేపట్టడం జరిగింది. గత ప్రభుత్వాలు కాలువలను పటిష్టం చేసి ఉంటే కాలువల ద్వారా మా నియోజక వర్గంలో మొత్తం చెరువులు నిండి ఉండేవి. ఈ విషయాన్ని గుర్తించిన మంత్రి హరీష్ రావు గారు మరియు ముఖ్యమంత్రి గారు ఈ కాలువలకై రూ.351కోట్లు పెట్టడం చాలా సంతోషంగా ఉంది. ఈ పనులన్నీ పూర్తి అవడానికి 18నెలల సమయం పడుతుందని మంత్రి గారు చెబుతున్నారు. ఈ పనులను ఫేజ్‌ల వారీగా పూర్తి చేయాలని కోరుతున్నాను. మక్తల్ నుండి ఎర్ర కుంట వరకు గుర్రపు డెక్క అడ్డు పడడం, సిల్ట్ ఫాం అవడం, డిస్ట్రిబ్యూషన్ కెనాల్స్ లేవు, గేట్లు లేకపోవడం, సిస్టమేటిక్‌గా లేకపోవడం వలన కాలువల్లోకి నీళ్లు రావడం లేదు. మా నియోజక వర్గంలోని రైతులందరూ బాగుపడాలనే ఉద్దేశంతో బసవాపురం నుండి వడపర్తి కత్వకు వాటర్ పోవడం వలన భువనగిరికి చెరువు, బీబీ నగర్ చెరువు నిండుకుంటూ మూసీకి వస్తుంది. తద్వారా వాటర్ లెవెల్స్ పెరిగి ప్రతి గ్రామానికి మంచి నీరు వస్తుంది. వడపర్తి కత్వకు సపరేట్ కాలువ ఇస్తే తద్వారా భువనగిరి కాలువ బాగుంటుందని కోరుతున్నాను.

**11.00 ఉ.**

**శ్రీ టి.హరీష్‌రావుః–** అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు జూలై 8, 2016నాడు, నల్గొండ జిల్లాలోని నేషనల్ హైవేపై హరితహారం కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంలో అక్కడికి వచ్చినప్పుడు, మూసి నది నీరు ఉన్నప్పటికీ నల్గొండ జిల్లాకు ఉపయోగపడనందున కాలువలను స్ట్రెంతెన్ చేసి, లైనింగ్ చేయడం ద్వారా ఎక్కువ ఆయకట్టుకి నీళ్లు అందించే అవకాశాల గురించి గౌరవ పార్లమెంట్, శాసన సభ్యులు వీరి దృష్టికి తీసుకురావడం వల్ల, మూడు కాలువలను ఆధునీకరించడానికి, డబ్బులు మంజూరు చేయాలని అక్కడ నుంచి ప్రకటన చేసి, ప్రభుత్వానికి ఆదేశాలిచ్చినందున, జూలై 11,2016నాడు జీ.ఓ. నెం.633 ద్వారా ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందని తెలియజేస్తున్నాను. ఈ పనులను తొందరగా పూర్తి చేసి గ్రామాలకు నీళ్లు అందించాలని, గౌరవ సభ్యులు శేఖర్‌రెడ్డిగారు, వీరేశం గారు, ప్రభాకర్ రెడ్డి గార్లు మనవి చేశారు. గత ప్రభుత్వం హయాంలో 2006వ సంవత్సరంలో కొన్ని నిధులు మంజూరు చేశారు. పిల్లాయిపల్లికి రూ.23కోట్లు, బునియాదిగాని కాలువకు రూ.5కోట్ల,23లక్షలు, ధర్మారెడ్డి కాలువకు రూ.3కోట్లు మంజూరు చేశారు. 2005-06 లో నిధులు మంజూరైనా 2014 వరకు కూడా పనులు పూర్తి కాలేదని తెలియజేస్తున్నాను. కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులు మరియు ఇంజనీర్లు, కాలువలపైన ఉండి, రైతులు భూసేకరణలో ఎవరైనా ఇబ్బందులు పెడితే వారితో మాట్లాడుతూ, క్రాప్ హాలిడేను తీసుకుని

2006లో ప్రారంభమైన పనులను 2014-15లో పూర్తి స్థాయిలో పనులన్నీ పూర్తి చేసి, కొంతమేర వరకు ఆయకట్టుకి నీళ్లు అందించగలిగాము. గౌరవ ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు ఇప్పుడు ఈ మూడు కాలువలన్నీ ఆధునీకరించడానికి రూ.284కోట్ల, 85లక్షలు ఇచ్చారు. ముఖ్యంగా ధర్మారెడ్డి కాలువ వల్ల దాదాపు 40 గ్రామాలకు నీరు అందించడంలో సహాయం చేస్తుంది. వలిగొండ, రామన్నపేట, చిట్యాల, నక్రేకల్, నార్కెట్ పల్లిలకు సంబంధించిన రైతులకు 5,126 ఎకరాలు, 36 చెరువులను స్టెబిలైజేషన్ చేసే విధంగా 17,787 ఎకరాలు కొత్త ఆయకట్టుకి దీని ద్వారా నీళ్లు ఇస్తామని తెలియజేస్తున్నాను. భూసేకరణకు డబ్బులు పెట్టారా, లేక ఉన్న కాలువలను స్ట్రెంతెన్ చేస్తారా అని వీరేశం గారు అడిగారు. కాని ఉన్న కాలువలకు అంత సామర్థ్యం లేనందున, ప్రతి కెనాల్‌కు భూసేకరణ కోసం డబ్బులు పెట్టామని తెలియజేస్తున్నాను. ధర్మారెడ్డి కాలువ పనుల కోసం రూ.53కోట్ల, 18లక్షలు శాంక్షన్ చేస్తే, ల్యాండ్ అక్విజిషన్ కోసం రూ.12కోట్ల 72లక్షలు ఇచ్చాము. పిల్లాయిపల్లిలో పనుల కోసం రూ.106కోట్లు ఇస్తే, ల్యాండ్ అక్విజిషన్ కోసం రూ.26కోట్లు ఇచ్చాము. బునియాదిగాని కాలువకు రూ.72కోట్లు పనుల కోసం ఇస్తే, రూ.13కోట్లు ల్యాండ్ అక్విజిషన్ కోసం ఇచ్చాము. కాని గౌరవ సభ్యులు పనులను తొందరగా పూర్తి చేయాలని కోరుతున్నారు. గతంలో రైతులు, మరియు గౌరవ సభ్యులు ఏ విధంగా సహకరించి పంటకు క్రాప్ హాలిడే ప్రకటించారో, అదే విధంగా ల్యాండ్ అక్విజిషన్‌లో రైతులను కన్విన్స్ చేస్తే, తప్పకుండా ఆరు నుంచి ఏడు నెలల్లో పనులను పూర్తి చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలియజేస్తున్నాను. గౌరవ సభ్యులు భూసేకరణ విషయంలో మీ సహకారాన్ని అందిచమని కోరుతున్నాను. వీరేశం గారు ఎన్ని చెరువుల్ని నింపుతారని ప్రశ్న అడిగారు. గతంలో పిల్లాయిపల్లి కాలువలో 30చెరువుల్ని నింపితే, ఇప్పుడు 80చెరువులను నింపడానికి అవకాశం ఉంది. గతంలో 7వేల ఆయకట్టు వస్తే ఇప్పడు 22,500ఎకరాల ఆయకట్టుకు పిలాయిపల్లి కాలువ కింద వస్తుంది. గతంలో బునియాదిగాని కాలువలో 57 చెరువులను నింపగలిగితే, ఇప్పుడు 96చెరువులను నింపే అవకాశం ఉంది. గతంలో 7,500ఎకరాల ఆయకట్టు వస్తే ఇప్పుడు పిల్లాయిపల్లి కాలువ కింద 20,725ఎకరాల ఆయకట్టు వస్తుంది. గతంలో ధర్మారెడ్డి కాలువ కింద 15 చెరువులు నింపితే, ఇప్పుడు 36చెరువులు నింపే అవకాశం ఉంది. గతంలో ఆయకట్టు 2,360 ఎకరాలు ఉంటే, ఇప్పుడు 17,887 ఆయకట్టు ఇచ్చే అవకాశం ఉంటుంది. వడపర్తి కత్వను చేపట్టినట్లైతే భువనగిరి చెరువు, బీబీ నగర్ చెరువు నింపితే, భూగర్భ జలాలు పెరుగుతాయని రైతాంగానికి లాభం వస్తుందని ఆలోచించాలని సభ్యులు శేఖర్‌రెడ్డి తెలిపారు. తప్పకుండా ఈ విషయంపై ఇంజనీర్లను ఆదేశించి సాధ్యాసాధ్యాలను పరిశీలించి ఏ మాత్రం అవకాశం ఉన్నా వడపర్తి కత్వకు మరిన్ని నిధులు కేటాయింపచేసి, పనులు పూర్తి చేస్తామని తెలియజేస్తున్నాను. ప్రభాకర్‌రెడ్డి గారు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ గురించి చాలా ప్రత్యేకంగా పదేపదే చెప్పారు. గోదావరి జలాలను హైదరాబాద్‌కు తెచ్చిన తరువాత మూసి ప్రవాహం పెరిగింది, నీటి లభ్యత కూడా పెరిగింది. కనుక లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ను ఐడిసి ద్వారా పరిశీలించి ఏ మాత్రం ఫీజిబిలిటీ ఉన్నా వారు కోరిన విధంగా లిఫ్ట్ ఇరిగేషన్‌ను శాంక్షన్ చేసేందుకు ప్రయత్నిస్తామని తెలియజేస్తున్నాను. కనుక ల్యాండ్ ప్రొక్యూర్‌మెంట్‌కి సంబంధించి యాదాద్రి కలెక్టర్‌గారికి ఆదేశాలు ఇస్తాము. దీని నిమిత్తమై కొత్త చట్టాన్ని కూడా తెచ్చుకున్నామని తెలియజేస్తున్నాను. వేగంగా ప్రాజెక్టులను పూర్తి చేసుకుని, రైతులకు నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలియజేస్తున్నాను. వీటిని పూర్తి చేసుకుంటే, 61వేల 12ఎకరాలకు నీళ్లు అందించే అవకాశం ఉంటుంది. రైతుల వద్ద భూసేకరణ పనులే ఆలస్యం అవుతున్నాయి. కనుక ఈ విషయంలో ఇంజనీర్లు, మరియు శాసన సభ్యులు భూసేకరణలో మీ అందరి సహకారాన్ని అందించండి. రైతులను కన్విన్స్ చేస్తే ఏడు నుంచి ఎనిమిది నెలల్లో పూర్తి చేసి ముందుకు తీసుకువెళ్లడానికి ప్రయత్నిస్తామని తెలియజేస్తున్నాను.

## అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు

* ప్రశ్న నెం. 106 (157-సి) సర్వశ్రీ ఆశన్నగారి జీవన్ రెడ్డి, (ఆర్మూర్), కోనేరు కోనప్ప (సిర్పూర్ ) : – వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులు అవయవ మార్పిడి సర్జరీలను విజయవంతంగా నిర్వహిస్తున్న విషయం వాస్తవమేనా;

ఆ) అవయవ మార్పిడి సర్జరీలు చేయించుకున్న ఈ రోగులకు ప్రభుత్వం జీవితకాలానికి ఉచితంగా ఔషధాలను సరఫరా చేస్తున్న విషయం వాస్తవమేనా;

ఇ) అయితే, ఆ వివరాలు ఏమిటి?

**వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి (డా. సి.లక్ష్మారెడ్డి):** అ) అవునండీ.

హైదరాబాదులోని ఉస్మానియా జనరల్ ఆసుపత్రి, నిమ్స్ ఆసుపత్రి, సికింద్రాబాదులోని గాంధీ ఆసుపత్రులు అవయవ మార్పిడి సర్జరీలను విజయవంతంగా నిర్వహిస్తున్నాయి.

ఆ) అవునండీ. ప్రభుత్వం అవయవ మార్పిడి రోగులకు ఔషధాలను సమకూరుస్తూ, 2015-16 సంవత్సరానికి రోగులకు అత్యవసర ప్రాణ రక్షక ఔషధాల వ్యయాన్ని భరించడానికి రూ.10.00కోట్లకు గాను రూ.5.00కోట్ల బడ్జెట్‌ను విడుదల చేసింది.

(సి) 2016-17 ఆర్థిక సంవత్సరానికి ఖాతాపద్దు 2210-01-110 ఉపపద్దు (38) - ప్రాణ రక్షక ఔషధాలు, డిస్పోజబుల్స్ క్రింద రాష్ట్రంలోని వివిధ ఆసుపత్రులకు విడుదల చేసిన మొత్తాలు :

| | |
|---|---|
| వైద్య విద్య డైరెక్టరు | 1,00,00,000 |
| ఉస్మానియా జనరల్ ఆసుపత్రి, హైదరాబాదు | 1,00,00,000 |
| గాంధీ ఆసుపత్రి, సికింద్రాబాదు | 1,00,00,000 |
| ఎం.జి.ఎం. ఆసుపత్రి, వరంగల్ | 1,00,00,000 |
| ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, నిజామాబాదు | 50,00,000 |
| డైరెక్టరు, రిమ్స్ జనరల్ ఆసుపత్రి, అదిలాబాదు | 50,00,000 |
| మొత్తం : | 5,00,00,000 |

**శ్రీ ఎ.జీవన్ రెడ్డి:–** అధ్యక్షా, గతంలో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలంటే ఇటువంటి పాటను పాడేవారు. "నేను రాను బిడ్డో సర్కారు దవఖాన"కు అని పాడేవారు. కాని ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత గౌరవ ముఖ్యమంత్రి గారు, మంత్రివర్యులు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో చాలా సీరియస్ రోగాలైన లివర్ మార్పిడి, గుండె మార్పిడి, కిడ్నీ మార్పిడులను పేద, బలహీన వర్గాల వారు చేయించుకోవాలంటే ఆపరేషన్‌కు రూ.30లక్షలు కావాలంటే, ఆ ఆపరేషన్లను చేసుకోలేమని, కాటికి రోజులు లెక్కపెట్టేవారని తెలియజేస్తున్నాను. కాని ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత కిడ్నీ మార్పిడి, గుండె మార్పిడి, లివర్ మార్పిడులు జరుగుతున్నాయని పత్రికల్లో చూస్తున్నాము. వింటున్నాము. కనుక ఇప్పటి వరకు ఎన్ని అవయవ మార్పిడులు జరిగాయి? జీవన్‌దాన్ కార్యక్రమం క్రింద ఎన్ని ఆపరేషన్లు జరిగాయి? ఎన్ని అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయి? అదే విధంగా ట్రాన్స్‌ప్లాంటేషన్ వార్డ్‌ల గురించి ప్రత్యేకమైన వార్డులను ఏర్పాటు చేస్తున్నారా? ప్రత్యేక ఆపరేషన్ థియేటర్లతోపాటు, అవయవ మార్పిడి ఆపరేషన్ల కోసం నూతన పరికరాలు ఏవైనా కొనుగోలు చేశారా? దేశంలో ఎక్కడా లేని విధంగా ఇతర రాష్ట్రాల నుంచి ఆపరేషన్లు చేసే కార్యక్రమం ప్రభుత్వం తీసుకున్నందుకు తమరి ద్వారా ముఖ్య మంత్రిగారికి, మంత్రి గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. గౌరవ ముఖ్యమంత్రి గారి పరిపాలన వచ్చిన తరువాత "నేను వస్త బిడ్డ సర్కారు దవఖాన"కు అని పాడుతున్నారు. ఆర్మూర్‌కి వంద పడకల ఆసుపత్రిని ప్రారంభించిన తరువాత నెలకి 150 ఆపరేషన్లు తెలంగాణలోనే అత్యధికంగా మా నియోజక వర్గంలో జరుగుతున్నాయి.

**శ్రీ కోనేరు కోనప్ప:–** అధ్యక్షా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి గారు, గౌరవ వైద్య శాఖ మంత్రి గారి చొరవ వలన అన్ని విషయాల్లో మంచి ఫలితాలు అందుతున్నాయి. మా నియోజక వర్గంలో రెండు కేసులను చూశాము. మారుమూల ప్రాంతమైన పాత అదిలాబాద్ జిల్లా రిమ్స్ ఆసుపత్రికి నిపుణులైన డాక్టర్లను నియమించే విధంగా చేయాలని మీ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను.

**11.10 ఉ.** మహిళల ప్రసూతి ప్రభుత్వ ఆసుపత్రులలోనే జరగాలనే విషయమై ఇటీవలనే గౌరవ ముఖ్యమంత్రిగారు సమీక్ష చేశారు. ఈ విషయంలో ముఖ్యమంత్రిగారికి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. కళ్యాణ లక్ష్మి ద్వారా రూ.51,000ల రూపాయలు పేద ఇంటి మహిళకు అందిస్తున్నారు. (మైక్ కట్ చేయడం జరిగింది.)

**డా.సి.లక్ష్మారెడ్డి:–** అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పినట్లుగా అవయమార్పిడి శస్త్రచికిత్సలు గతంలో ధనవంతులు మాత్రమే మార్పిడి చేయించుకునేవారు. ప్రైవేటు ఆసుపత్రులలో ఈ సర్జరీ చేసుకోవాలంటే సుమారు రూ.40లక్షలు ఖర్చవుతుంది. అటువంటి పరిస్థితుల్లో బీద ప్రజలకు ఇటువంటి జబ్బులు వచ్చినప్పుడు ఈ అవయమార్పిడి సర్జరీ చేసుకోలేక ఇబ్బందిపడుతుండేవారు. జీవన్ రెడ్డిగారు చెప్పినట్లుగా చావే శరణం అనే పరిస్థితి గతంలో ఉండేది. దానిని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత మొట్టమొదటిసారి ఉస్మానియా, నిమ్స్,గాంధీ అసుపత్రులలో ఈ అవయమార్పిడి సర్జరీల విషయంలో ఉన్న డాక్టర్లనే ప్రోత్సహించి ఈ సర్జరీలను మొదలు పెట్టడం జరిగింది. అన్ని ఆసుపత్రులలో ఉన్న ఆపరేషన్ థియోటర్లను మాడిఫై చేయడం జరిగింది. ఉస్మానియా ఆసుపత్రిలో మొట్టమొదటిసారి కెడావర్ లివర్ మార్పిడి, కెడావర్ కిడ్ని మార్పిడి తరువాత కంబైండ్ కిడ్ని అండ్ ప్యాంక్‌రా సర్జరీ చేయడం జరిగింది. భారతదేశంలోనే

మొట్టమొదటిసారి ప్రభుత్వ సెక్టారులో ఆటోలాగస్ లివర్ సర్జరీ అనేది ఒక రేర్ సర్జరీని కూడా ఉస్మానియా డాక్టర్లు చేయడం జరిగింది. అలాగే ప్రభుత్వ సెక్టారులో గుండె మార్పిడి అనేది గతంలో ఎప్పుడూ జరగలేదు. ఆ సర్జరీని కూడా నిమ్స్ ఆసుపత్రిలో చేయడం జరిగింది. గాంధీ ఆసుపత్రిలో కూడా ఈ సర్జరీని మొదలు పెట్టడం జరిగింది. నిమ్స్ ఆసుపత్రిలో స్పెషల్‌గా నెఫ్రాలజీ టవర్‌ను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు తయారయ్యాయి. త్వరలోనే మొదలుపెట్టి పూర్తిగా కిడ్నీ రోగంతో బాధపడుతున్న వారు ఎవరైతే ఉన్నారో వారికి సంబంధించి ఒక టవర్‌ను ఏర్పాటు చేయాలనుకుంటున్నాము. ఈ మధ్య గ్యాస్ట్రిక్ సర్జరీలు ఎక్కువయ్యాయి. లివర్‌కు సంబంధించిన రోగాలు ఎక్కువగా వస్తున్నాయి కాబట్టి స్పెషల్‌గా ఒక లివర్ సెంటరును ఏర్పాటు చేయడానికి పరిశీలన చేస్తున్నాము. కింగ్‌కోఠీ ఆసుపత్రిలో లివర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలనే ప్రయత్నం చేస్తున్నాము. ఈ సర్జరీలే కాకుండా సర్జరీల తర్వాత వాళ్లకు ఔషధాలు అవసరం అవుతాయి. అవి బయట వాళ్లు కొనాలంటే ఎంతో ఖర్చుతో కూడుకొని ఉన్నవని కాబట్టి వాటిని కూడా ఫ్రీగా ప్రభుత్వం రోగులకు ఇవ్వడం జరుగుతుంది. వీటిని ప్రాణ రక్షక ఔషధాలు అంటారు. గౌరవ సభ్యులు కోనప్పగారు అడిగినట్లుగా మారుమూల ప్రాంతాలలో కూడా ఇటువంటి సర్జరీలు చేయడానికి ప్రయత్నం చేయమని కోరడం జరిగింది. తప్పకుండా ఆ దిశగా ఆలోచన చేసే ప్రయత్నం చేస్తాము.

جناب جعفر حسین (Janab Jaffar Hussain): محترم اسپیکر صاحب! بہت بہت شکریہ۔ آج کا یہ جو Organ Transplant Surgeries کا question ہے، یہ بہت اہم question ہے۔ میں تلنگانہ حکومت کو مبارکباد دیتا ہوں کہ تلنگانہ حکومت نے organ transplant کے لئے جیون دان جو چل رہا ہے، اس کو زیادہ improve کیا جس کے اندر جس کی brain death ہوتی ہے، اس کے lever, kidney and heart کو donate کیا جاتا ہے۔ ہندوستان میں سب سے بڑا اعزاز حیدرآباد کو ہے کہ heart transplant یہیں سے شروع ہوا۔ میں مبارکباد دیتا ہوں۔ مگر میں آپ سے ایک سوال یہ پوچھنا چاہتا ہوں کہ اس میں لکھا ہوا ہے کہ گاندھی، عثمانیہ اور نمس دواخانوں میں یہ surgeries ہو رہی ہیں، بے شک ان میں تو organ transplant surgeries ہو رہی ہیں۔ اس کے ساتھ ساتھ خانگی دواخانوں میں جو یہ کام ہو رہا ہے، اس کے اندر حکومت کیا facilities فراہم کر رہی ہے؟ اگر سارے کے سارے لوگ ان surgeries کے لئے سرکاری دواخانوں میں جائیں تو وہ service برابر نہیں رہتی۔ تو میں آپ کے ذریعہ حکومت سے یہ پوچھنا چاہتا ہوں کہ اگر خانگی دواخانوں میں جیسا کہ منسٹر صاحب نے کہا کہ تیس تیس لاکھ کا خرچ ہے تو کیا یہ خرچ حکومت فراہم کرنے والی ہے؟ ہم کو جتنا علم ہے کہ سی ایم ریلیف فنڈ میں صرف ایک لاکھ روپے دیے جا رہے ہیں۔ تو یہ ایک لاکھ روپے کافی نہیں ہوتے۔ آج غریب آدمی dialysis میں پریشان ہے۔ آپ دیکھیں گے تو تقریباً لوگ kidney patients ہیں۔ ایک اور چیز، اس کے اندر Question (b) میں لکھا ہوا ہے کہ life time medicines حکومت فراہم کرے گی۔ تو میں یہ پوچھنا چاہتا ہوں کہ آپ نے جو پانچ کروڑ بجٹ کہا، ایک transplant کے بعد post transplant کے لئے کم سے کم 60,000-70,000 per month کے medicines ہوتے ہیں جس کے اندر اگر kidney transplant ہوتا ہے، تو ویگراف، رینوڈاف اور سائکلوسپرنگ، ایسے کئی قیمتی medicines ہوتے ہیں جس میں بہت خرچ ہوتا ہے۔ تو میں آپ کے ذریعہ حکومت سے یہ کہنا چاہتا ہوں کہ آج انسان کی زندگی بچانا بہت ضروری ہے اور ہماری ذمہ داری بھی ہے۔ آج ہندوستان میں دیکھیں تو حیدرآباد transplants میں نمبر ون ہے۔ بیرونی ممالک سے بھی لوگ یہاں پر آ کر transplant کروا رہے ہیں۔ اس پر ہیلتھ منسٹر صاحب زیادہ توجہ دے کر جیون دان کو اور strengthen کریں۔ اس کو اگر آپ کریں گے اور اچھے سے کونسلنگ ہوگی تو لوگ اپنی تمام چیزیں donate کرنے کے لئے تیار ہیں۔ مجھے یہ موقع دیے جانے پر میں آپ کا شکریہ ادا کرتا ہوں اور امید کرتا ہوں کہ حکومت اس پر اچھے سے توجہ دے گی۔

**శ్రీ ఆర్. కృష్ణయ్య (ఎల్.బి.నగర్):–** అధ్యక్షా, వైద్యానికి సంబంధించి హైదరాబాద్ ఈ రోజు అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా ఎదుగుతున్నది. ప్రభుత్వం కూడా ఉస్మానియా, నిమ్స్, గాంధీ ఆసుపత్రులను సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఉన్నది. అందుకు ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాను. కొన్ని సూచనలు ప్రభుత్వానికి నేను ఇవ్వదలచాను. సూపర్‌స్పెషాలిటీ డాక్టర్లను ఈ ప్రభుత్వ ఆసుపత్రులల్లో నియమించవలసిన అవసరం ఉన్నది. వాళ్లకు జీతాలు ఎక్కువగా ఇవ్వకపోతే వారు మన దగ్గరకు రారు. యశోద, కేర్, అనేక ప్రైవేటు ఆసుపత్రుల్లో వాళ్లు ఇచ్చే జీతాలను ఆకర్షించి అక్కడనే వెళ్లిపోతున్నారు తప్ప ప్రభుత్వ ఆసుపత్రులకు రావడం లేదు. సూపర్‌స్పెషాలిటీ డాక్టర్లు లేనిది మనం ఎంత ఖర్చు పెట్టినా వృధానే అవుతుంది. ప్రభుత్వం ఇచ్చే స్కేలుకు ఎవ్వరు ముందుకు రావడం లేదు. ప్రభుత్వం ఈ అంశం మీద పునరాలోచన చేసి సూపర్‌స్పెషాలిటీ డాక్టర్లను ఆకర్షించే విధంగా జీతాలను పెంచితే బాగుంటుంది. యంత్ర పరికరాలకు గ్లోబల్ టెండర్లు వేస్తూ ప్రైవేటు డయాగ్నస్టిక్‌లో ఉన్నటువంటి యంత్రాలను మనం తెచ్చుకోవాలి. ఇప్పటికి గాంధీ ఆసుపత్రిలో జాయిన్ అయిన రోగులను విజయా డయాగ్నస్టిక్ సెంటర్‌కు పంపుతున్నారు. ఆ విధంగా కాకుండా ప్రభుత్వ ఆసుపత్రిలోనే మంచి డయాగ్నస్టిక్ పరికరాలు ఉండే విధంగా ప్రభుత్వం ఆలోచన చేయాలి.

**డా.సి.లక్ష్మా రెడ్డి:–** అధ్యక్షా, గౌరవ సభ్యులు చాలా ముఖ్యమైన సూచనలు ఇవ్వడం జరిగింది. జాఫర్ హుస్సేన్‌గారు మాట్లాడుతూ, ఈ అవయవదానాన్ని ఎంకరేజ్ చేయాలని చెప్పారు.

ఈ అవయదానం అనేది చాలా ముఖ్యమైనది. ఏ రోగి అయినా యాక్సిడెంట్‌లో అయినా, రోగం వలన అయిన బ్రెయిన్‌డెత్‌కు గురయితే పూర్తిగా వాళ్ల అవయవాలన్నీ దానం చేయడానికి అవకాశం ఉంటుంది. ఆ రోగికి సంబంధించిన కుటుంబసభ్యులకు కౌన్సిలింగ్ చేసి నచ్చజెపితే వాళ్లు అవయదానం చేయడానికి ఒప్పుకుంటున్నారు. ఉదాహరణకు మా నియోజకవర్గం గంగాపూర్ అనే గ్రామంలో ఒక వ్యక్తి చనిపోయినప్పుడు వాళ్ల భార్యకు, పిల్లలకు కౌన్సిలింగ్ ఇచ్చిన తర్వాత వాళ్లు దానం చేయడానికి ముందుకు వచ్చారు. ఆ వ్యక్తి వలన 6మందికి ప్రాణదానం చేయడం జరిగింది. ఈ అవయవదానాన్ని అందరూ ప్రోత్సహించాలి. గౌరవసభ్యులంతా ఈ విషయంలో సహకరించవలసినదిగా కోరుతున్నాను. గతానికి ఇప్పటికి పోలిస్తే ప్రతి సంవత్సరం ఈ అవయవ దానాలు పెరుగుతున్నాయి. ముందుముందు ఇంకాపెరగవలసిన అవసరం ఉన్నది. లైఫ్ సేవింగ్ ఔషధాలను ఒక వ్యక్తికి పంపిణీ చేయాలంటే సుమారు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు ఖర్చౌతుంది.

**11.20 ఉ.** వారికి అవసరమైన అన్ని మందులను ప్రభుత్వ సెక్టార్‌లో అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ప్రైవేట్ హాస్పటల్స్‌లో చేసే ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీలను కూడా ఆరోగ్యశ్రీ లో చేర్చడం జరిగింది. కొన్ని సెలక్టెడ్ కేసులను కార్పొరేట్ హాస్పటల్స్‌తో సంప్రదించి ఇప్పటికే కొన్ని ప్రైవేట్ హాస్పటల్స్‌లో ఈ ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీలు చేయడం జరిగింది. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు సంబంధించి ఇప్పటికే పేదవారికి 3 సర్జరీలను ఈ ప్రైవేట్ హాస్పటల్స్‌లో చేయడం జరిగింది. ఉస్మానియాలో, గాంధీలో ఈ కెడావర్ సర్జరీలు జరుగుతున్నాయి. కెడావర్ అంటే చనిపోయిన వారి అవయవాలను బ్రతికున్న వారికి అమరుస్తారు. లైవ్ డొనర్లు కూడా పెరుగుతున్నారు. బ్రతికున్న వారి లివర్‌లో కొంత పార్ట్ తీసుకొని, అదేవిధంగా కిడ్నీలను కూడా ఇతర పేషంట్లకు ఇవ్వడానికి అవకాశం ఉంది. ఆ దిశగా ఉస్మానియాలో లైవ్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీలు, లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయడానికి అక్కడున్న థియేటర్లను మాడిఫై చేస్తున్నాము. ఒకటి రెండు నెలల్లో పూర్తి స్థాయిలో డెవలప్ చేసి సర్జరీలు జరగడానికి అన్ని రకాల చర్యలు చేపట్టడం జరుగుతోంది. నిష్ణాతులైన డాక్టర్లు మన దగ్గర ఉన్నా, అవసరమైతే బయట నుంచి తీసుకునే అవకాశం ఉంటే చూడమని గౌరవ సభ్యులు క్రిష్ణయ్య గారు చెప్పడం జరిగింది. ఆల్‌రెడీ ఆ సిస్టమ్‌ను ఫాలో అవుతున్నాము. మన డాక్టర్లకు సపోర్ట్‌గా అదనంగా బయట నుంచి డాక్టర్లు రావడానికి అవకాశం, అవసరం ఉంటే వారిని తీసుకొని వారికి పేమెంట్ కూడా చేస్తున్నాము. మన దగ్గర కూడా మంచి టీమ్ ఉంది, వారికి కొంచెం సపోర్ట్ చేస్తే బాగా చేయడానికి సిద్ధంగా ఉన్నారు, బయట నుంచి కూడా డాక్టర్లను తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నాము.

## మెగా డెయిరీగా విజయ డెయిరీ

* ప్రశ్న నెం. 28 (2042) శ్రీ జీవన రెడ్డి తాటిపర్తి, డా.జి. చిన్నా రెడ్డి : – పశు సంవర్ధక , పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య పరిశ్రమల శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా :

అ) ప్రభుత్వం విజయ డెయిరీని మెగా డెయిరీగా స్థాయిని పెంచే అంశాన్ని ప్రకటించిన విషయం వాస్తవమేనా ;

ఆ) గత 5 నెలల్లో డెయిరీ రైతుల ప్రోత్సాహకాలను రూ.22 కోట్లకు కూడబెట్టిన విషయం వాస్తవమేనా ;

ఇ) అయితే, ఈ విషయంలో తీసుకున్న చర్యలేమిటి ; డెయిరీ రైతులకు ఎప్పటిలోగా ప్రోత్సాహకాలను చెల్లించడమవుతుంది ?

**పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య పరిశ్రమల శాఖ మంత్రి (శ్రీ తలసాని శ్రీనివాస్ యాదవ్):** అ) ప్రస్తుతానికి అట్టి ప్రతిపాదన ఏదీ లేదు.

ఆ) అవునండీ.

ఇ) రూ. 20.33 కోట్ల రెగ్యులర్ బడ్జెట్‌తో పాటు, ప్రభుత్వం పాల ప్రోత్సాహకం నిమిత్తం 2016–17 సంవత్సరానికి రూ.51.76 కోట్ల అదనపు బడ్జెట్ కోసం ప్రభుత్వం బి.ఆర్.ఓ. ను జారీ చేసింది. పాడిపరిశ్రమ రైతులకు త్వరలోనే చెల్లింపు చేయడమవుతుంది. 2016, ఏప్రిల్ నుండి 2016, ఆగస్టు వరకు లీటరుకు రూ.4/– చొప్పున నగదు ప్రోత్సాహకం మొత్తంగా రూ.22.59 కోట్లను త్వరలోనే విడుదల చేయడమవుతుంది.

**శ్రీ టి.జీవన్ రెడ్డి: –** అధ్యక్షా, పాడి పరిశ్రమను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం విజయా డైరీ వారి నుంచి సేకరించే పాలకు లీటరుకు 4 రూపాయల రాయితీని ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడం ద్వారా అందరికీ చాలా సంతోషంగా ఉంది. దురదృష్టమేమిటంటే, 2016 ఏప్రిల్ నుంచి 2016 ఆగస్టు వరకు రూ.22.59 కోట్లు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. 2016–17 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఒక్క రూపాయి కూడా పాడి పరిశ్రమకు రాయితీ విడుదల చేయడం

జరగలేదు. మంత్రి గారు ఆగస్టు వరకే చెప్పారు, సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు చూస్తే మరొక 4 నెలలు కూడా ఉంటుంది. ఒకవైపు మీరు పాడి పరిశ్రమను ప్రోత్సహిస్తున్నామని చెబుతూనే ఈ 9 నెలల కాలంలో నిధుల విడుదలకు సంబంధించి నిర్ణయం తీసుకోలేదు. మన రాష్ట్ర బడ్జెట్ లక్షా ముప్పై వేల కోట్ల రూపాయలు. పాల ఉత్పతిదారులు రైతాంగమే, కాబట్టి ఆ రైతాంగాన్ని ప్రోత్సహించడానికి సంవత్సరానికి రూ.100 కోట్లు ప్రతి నెలా రూ.10 కోట్ల చొప్పున విడుదల చేసినట్లైతే రైతాంగానికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. కేవలం హైదరాబాద్ నగరాన్నే ఉదాహరణగా తీసుకుంటే ప్రతి నిత్యం దాదాపు 25 లక్షల లీటర్ల పాలు వినియోగం అవుతున్నాయి. విజయా డైరీ ద్వారా సేకరించే పాలు కేవలం 4 నుంచి 5 లక్షల లీటర్లు మాత్రమే. కేవలం 20 శాతం వినియోగాన్ని మాత్రమే మనము విజయా డైరీ ద్వారా సేకరిస్తున్నాము. మిగిలిన 80 శాతం వినియోగానికి మనం బయట నుంచి తెచ్చుకుంటున్నాము. పాల ఉత్పత్తిదారులను ఎంత ప్రోత్సహిస్తే రైతాంగాన్ని అంత ప్రోత్సహించినట్లుగా భావించడానికి అవకాశం ఉంటుంది.

ఉత్పత్తి వ్యయం, పశుగ్రాసం అన్నీ పెరిగి పోయాయి. కాబట్టి దయచేసి గౌరవ మంత్రి గారు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, రైతుకు ఎప్పటికప్పుడు ఇచ్చే రాయితీ వెంటనే విడుదల చేసినట్లైతే అది వారి పెట్టుబడికి ఉపయోగపడుతుంది. రాయితీ విడుదల చేయడంలో ప్రభుత్వం అలసత్వం చూపడంతో పాడి పరిశ్రమ అనేక ఆటు పోట్లను ఎదుర్కొంటున్నది. కరీంనగర్ జిల్లానే తీసుకుంటే కరీంనగర్‌లో కూడా విజయా డైరీలో అంతర్భాగంగా వృద్ధి చేసే డైరీ కేంద్రం కంపెనీ యాక్ట్ తో ప్రైవేట్ పరం అయిపోయింది. కంపెనీ యాక్ట్ ద్వారా దాన్ని రిజిస్టర్ చేయడంతో విజయా డైరీకి ఏదైతే రాయితీ అందించాలని సంకల్పిస్తున్నారో మేము ఆ రాయితీలను పొందలేక పోతున్నాము. విజయా డైరీలో అంతర్భాగంగా ఎక్కడైతే డైరీలను ఏర్పాటు చేయడం జరిగిందో ఆ డైరీలన్నింటికి కూడా ఈ 4 రూపాయల రాయితీ అందించాలని కోరుతున్నాను. మంత్రి గారు స్వయంగా పాల ఉత్పత్తులతో అనుబంధం ఉన్నటువంటి వారు. రైతాంగానికి విడుదల చేయాల్సిన నిధులు 9 నెలలవైతే వారు కేవలం 5 నెలలే అని పేర్కొన్నారు. డిసెంబర్ కూడా వెళ్లిపోయి 2017 మొదలైంది. దయచేసి నిధులను వెంటనే విడుదల చేసి రైతాంగానికి అండగా నిలవాలని మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

**డా. జి. చిన్నా రెడ్డి: –** గౌరవనీయులు జీవన్ రెడ్డి గారు చెప్పినట్లుగా విజయా డైరీ ఉత్పత్తి కెపాసిటీ ప్రతి దినం నాలుగున్నర లక్షల లీటర్ల నుంచి ఐదు లక్షల లీటర్ల వరకు మాత్రమే ఉంది. కేవలం ఒక లక్షన్నర లీటర్లు మాత్రమే విజయా డైరీకి వస్తున్నాయి. ఈ మధ్య చాలా ప్రైవేట్ డైరీలు వచ్చాయి. హెరిటేజ్, దొడ్ల, మస్కతీ ఇలా చాలా డైరీలున్నాయి, వాటితో విజయా డైరీ పోటీ పడ లేకపోతోంది. వాళ్లు ఎక్కువ ధర ఇస్తున్నారు, వాళ్ల పాల సేకరణ విధానం చాలా బాగుంది అనే ఉద్దేశంతో ప్రభుత్వ విజయా డైరీకి పాలు రాకుండా ప్రైవేట్ డైరీలకు వెళుతున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని మన గౌరవ ముఖ్యమంత్రి గారు అధికారంలోకి వస్తూనే ప్రైవేట్‌డైరీలతో పోటీ పడే విధంగా ఒక్కొక్క లీటరుకు రూ.4 ఇన్సెంటివ్ ఇస్తామని చెప్పారు. చాలా సంతోషం. దానివల్ల లక్షన్నర లీటర్ల పాలు వచ్చే విజయా డైరీకి నాలుగున్నర లక్షలు వరకు పెరిగింది. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో ప్రతి రోజుకు దాదాపు 25 లక్షల లీటర్లు అవసరమౌతున్నాయి. ఈ పాలను మన ప్రక్క రాష్ట్రాలైన కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ప్రక్కనున్న ఆంధ్రప్రదేశ్ నుంచి మనం ఈరోజు తెచ్చుకోవడం జరుగుతోంది. మీరు ప్రకటించిన రూ.4 ఇన్సెంటివ్ ఎప్పుడో బకాయిల రూపంలో విడుదల చేయడం కన్నా మీరు లీటరుకు ఇచ్చే ధరతో ఈ ఇన్సెంటివ్‌ను కూడా కలిపి పది రోజుల కొకసారి ఇచ్చే బిల్లుతో పాటు ఇస్తే అదే రైతుకు నిజమైన ఇన్సెంటివ్ అని గౌరవ మంత్రి గారికి నేను తెలియజేస్తున్నాను.

రైతుకు ప్రోత్సాహం ఇస్తున్నాము, దాన్ని ఎప్పుడో లంసమ్‌గా ఇస్తామంటే తీసుకోవడానికి రైతు మాత్రం సిద్ధంగా లేడని సవినయంగా మనవి చేస్తూ, ఈ విజయా డైరీని విస్తరించే అవకాశం ఏదన్నా ఉందా అని అడిగితే మొదటి ప్రశ్నకు సమాధానం లేదన్నారు. ఈ శాఖ చేపట్టిన తరువాత వారే అక్టోబర్ 13 నాడు ఈ విజయా డైరీని 15 లక్షల లీటర్ల నుంచి 20 లక్షల లీటర్లకు పెంచబోతున్నామన్న మాట చెప్పడం జరిగింది. ఆ విధంగా మనం పెంచుకుంటూ వెళితేనే కనీసం హైదరాబాద్ రిక్వైర్‌మెంట్ అయినా మనం తీర్చడానికి అవకాశం ఉంటుంది. హైదరాబాద్ చుట్టూ ఉన్న జిల్లాల్లో చదువుకుని నిరుద్యోగులుగా ఉన్న యువకులకు గేదెలను, ఆవులను సబ్సిడీతో ఇప్పించి వారి నుంచి పాల సేకరణను రూ.4 ఇన్సెంటివ్ ఇచ్చి తీసుకోండి. అప్పుడు తప్పకుండా హైదరాబాద్‌కు కావాల్సిన పాల అవసరాన్ని మన తెలంగాణ రాష్ట్రమొక్కటే ప్రొడ్యూస్ చేస్తుంది. కాబట్టి విజయ డైరీ మీద దృష్టి పెట్టండి, సెల్ఫ్ సఫిషియంట్ అవుతాము. అవసరమైతే ప్రక్క రాష్ట్రాలకు కూడా మనం ఎగుమతి

చేసుకునే అవకాశం ఉంటుందని తమరి ద్వారా గౌరవ మంత్రి గారికి మనవి చేస్తున్నాను.

**శ్రీ చల్లా వంశీచంద్ రెడ్డి (కల్వకుర్తి):–** ఇదే విషయానికి సంబంధించి 2016 మార్చి బడ్జెట్ సమావేశంలో సభలో నేను లేవనెత్తినప్పుడు గౌరవ మంత్రి గారు ఈ రూ.4 ఇన్సెంటివ్‌ను పాడి రైతుల ఖాతాల్లోకి వెంటనే పంపించడం జరుగుతుందని ఆనాడు హామీ ఇవ్వడం జరిగింది. క్యాలెండర్‌లో పేజీలే కాదు క్యాలెండరే మారిపోయింది. కొత్త సంవత్సరం వచ్చింది. గౌరవ మంత్రి గారు ఇప్పటికీ త్వరలో రిలీజ్ చేస్తామని చెబుతున్నారు. ఆ త్వరలో ఎప్పుడు వస్తుందనే సందేహం, భయాందోళన రైతులలో ఉంది. 2015–16 సంవత్సరానికి సంబంధించి బడ్జెట్లో రూ.4 ఇన్సెంటివ్ కోసం మనం రూ.12 కోట్లు కేటాయించుకున్నాము. కానీ వాస్తవంగా మనకు కావాల్సింది రూ.46 కోట్ల 30 లక్షలు.

**11.30 ఉ.** అధ్యక్షా, వాస్తవంగా రూ. 46.30 కోట్లు కావాలి. 2015-16 సంవత్సరంలో రూ. 46.30 కోట్లు అవసరమైనప్పుడు కనీసం 2016-17 బడ్జెట్‌లో రూ. 46 కోట్ల కంటే ఎక్కువగా కేటాయించాలి. 2016-17లో మంత్రి గారి సమాధానంలో ఉంది రూ. 20.33 కోట్లు మాత్రమే కేటాయించామని అన్నారు. దానిని దృష్టిలో పెట్టుకొని ఈ సంవత్సరం మంత్రిగారు చెప్పిన దాని ప్రకారం రూ. 72 కోట్లు అవుతుంది. జీవన్ రెడ్డి గారు, చిన్నా రెడ్డి గారు చెప్పినట్లుగా ప్రోత్సాహకాన్ని సెపరేట్‌గా ఇవ్వకుండా, పాల బిల్‌తో ఇచ్చే విధంగా చేస్తే బాగుంటుంది. 2018-19 బడ్జెట్‌లో రూ. 80 కోట్లు అంతేకాకుండా నాలుగు రూపాయల ఇన్సెంటీవ్ కోసం సెపరేట్‌గా రూ. 80 కోట్లు కేటాయించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను. పాడి రైతులు పశుగ్రాసం లేక ఇబ్బంది పడుతున్నారు. సరిపడా మందులు వెటర్నరీ హాస్పిటల్‌లో ఉండడం లేదు. మంత్రి గారు దృష్టిపెట్టాలి. యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ గ్రామీణ ప్రాంతాలలోని పశు వైద్యశాలల్లో ఇప్పటికీ అందుబాటులో ఉండడం లేదు. కుక్క కాటుకు గురైతే ఆరు వందల నుండి వెయ్యి రూపాయలు అవుతుంది. అది కూడా ప్రైవేట్ క్లినిక్ దగ్గరకు వెళ్లి వ్యాక్సిన్ ఇప్పించుకోవలసి వస్తుంది. రైతులకు భారం అవుతోంది. ప్రతి నియోజకవర్గంలో ఆర్.ఐ.డీ.ఎఫ్. నిధులతో రూ. 60 కోట్లతో రైతు శిక్షణా కేంద్రాలతో, రూ. 10 కోట్లతో వ్యాధి నిరోధక కేంద్రాలను కన్‌స్ట్రక్ట్ చేశారు. సిబ్బందిని నియమించకపోవడం వల్ల ఈ బిల్డింగ్స్ రెడీగా ఉన్నా అవి సంబంధిత డిపార్ట్‌మెంట్స్ హ్యాండోవర్ చేసుకోవడం లేదు. దయచేసి సిబ్బందిని అలాట్ చేసి ఈ బిల్డింగ్స్‌ని హ్యాండోవర్ చేసుకోవాలని మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ దుర్గం చిన్నయ్య (బెల్లంపల్లి): –** పాడి రైతులకు గతంలో గేదలకు సంబంధించి ఒక యూనిట్‌కు యాభై శాతం బ్యాంక్ లోన్, యాభై శాతం ప్రభుత్వ సబ్సిడీ వచ్చేది. అప్పటి ప్రభుత్వ అధికారులు, బ్యాంకులూ ఇద్దరూ కలసి ఇష్టం ఉన్నట్లు గొడ్డి గేదెలను గుంటూరు నుండి తీసుకొచ్చి తెలంగాణలో ఇచ్చేవారు. ఇక్కడి వాతావరణానికి అవి పెరగలేక సన్నబడిపోయేవి. అందువల్ల రైతులు అవి వేరేవాళ్లకు అమ్ముకునేవారు. కొన్ని గేదెలు చనిపోయేవి. బ్యాంకు లోన్ రైతుల మీద పడేది. గత ప్రభుత్వంలో ఈ విధంగా జరిగేది. మన ప్రభుత్వం వచ్చిన తరువాత రైతులకు సంబంధించి ప్రభుత్వమే యూనిట్ కాస్ట్ భరిస్తుందని చెప్పడం జరిగింది. అది వాస్తవమా? ఇప్పటివరకూ ఏ రైతుకీ యూనిట్ కాస్ట్‌ను ఇవ్వలేదని మాకున్న సమాచారం. దయచేసి మంత్రి గారు వివరణ ఇవ్వాలి.

**శ్రీ టి. శ్రీనివాస్ యాదవ్ : –** అధ్యక్షా, విజయా డెయిరీ గురించి మనకు తెలుసు. వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమ ఉంది. దీని యొక్క హిస్టరీ తెలుసుకోవాలంటే, లక్షలాది మంది జీవితాలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నాయి. కొంత డ్రాట్ వచ్చినా, రకరకాల సమస్యలు వచ్చినా పాడి పరిశ్రమ మీద చాలా వరకూ చాలా మంది జీవితాలు ఆధారపడి ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత విజయ డెయిరీని ప్రమోట్ చెయ్యాలన్న ఉద్దేశ్యంతో, పాడి రైతులకు ప్రోత్సాహకం ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ఆ రోజు ముఖ్యమంత్రి గారిని కలిసినప్పుడు రెండు రూపాయల ఇన్సెంటీవ్ ఇస్తే బాగుంటుందని చాలా మంది అడిగారు. రెండు రూపాయలు సరిపోవు, నాలుగు రూపాయలు ఇస్తామని గౌరవ ముఖ్యమంత్రి గారు నిర్ణయం తీసుకోవడం జరిగింది. లక్షా ముప్పై వేల లీటర్ల పాల సేకరణ జరిగితే ఈరోజు అది రమారమి అయిదున్నర లక్షల లీటర్లకు చేరింది. దానితోబాటు గతంలో 32 వేల మంది పాడి రైతులుంటే ఇప్పుడు 80 వేలకు చేరుకున్నారు. గత ప్రభుత్వంలో విజయ డెయిరీని ప్రమోట్ చేసే అవకాశాలు లేకపోయేవి. ప్రైవేట్ డెయిరీలు ఇష్టారాజ్యంగా మన రాష్ట్రంలోనే కాకుండా ఇతర ప్రాంతాలలో విస్తరించే పరిస్థితులు వచ్చాయి. ముఖ్యమంత్రి గారి నిర్ణయం మేరకు పాడి పరిశ్రమకు సంబంధించిన రైతులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో కొద్దిగా వెనుకాముందు అయినప్పటికీ ఈ ప్రభుత్వం మాట చెప్పింది కాబట్టి మాట నిలబెట్టుకుంటాము. నాలుగు రూపాయల ఇన్సెంటీవ్ ఇవ్వాలంటే దగ్గర దగ్గర రూ. 72 కోట్లు అవుతుంది. అది ఈ ప్రభుత్వమే భరిస్తుంది. పాల ఉత్పత్తి మీద ఆధారపడిన వాళ్లకు ఇన్సెంటీవ్‌ను సెపరేట్‌గా ఇవ్వమన్నారు. పాల బిల్లును సెపరేట్‌గా

ఇవ్వనున్నారు. రెండూ కలిపి ఇస్తే వెసులుబాటు ఉండదని కొద్దిగా ఇది డిలే అయినా వాళ్ల ప్రమోట్ చేసుకోడానికి అవకాశం ఉంటుంది. మొదటి క్వశ్చన్‌కి ఆన్సర్‌గా నేను లేదు అని జవాబు చెప్పాను. విజయ డెయిరీని పెద్దఎత్తున ప్రమోట్ చెయ్యడానికి ఈరోజు మాడ్రన్ టెక్నాలజీని ఉపయోగించుకోడానికి ప్రయత్నం చేస్తున్నాము. విజయ డెయిరీ ద్వారా 11 రకాల వస్తువులు తయారవుతున్నాయి. ఆ 11 రకాల వస్తువులు ఏమిటో గతంలో మనకు తెలిసేది కాదు. విజయ డెయిరీకి సంబంధించిన ప్రొడక్ట్స్‌ని మనం తీసుకునే పరిస్థితి లేదని మొన్న కొత్త సంవత్సరంలో సభ్యులకు వాటిని పంపించడం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా అవుట్‌లెట్స్ పెట్టాలనే ఉద్దేశ్యం ప్రభుత్వానికి ఉంది. విజయ డెయిరీని ప్రమోట్ చేస్తూ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్‌ను క్రియేట్ చెయ్యాలని మన ఉద్దేశ్యం. రైతుల పట్ల, పాడి పరిశ్రమ పట్ల ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తుంది. సభ్యులడిగినట్లు వెంటవెంటనే బిల్లులు చెల్లించే విధంగా నేను మాట్లాడతాను. రీసెంట్‌గా రూ. 51 కోట్లు మాకు రావడం జరిగింది. రైతులు ఇబ్బంది పడవలసిన అవసరం లేదు. వంశీచంద్ రెడ్డి గారు ఆవేదన చెందవలసిన అవసరం లేదు. కమిట్‌మెంట్‌తో ముందుకు వెళ్తాము. రాబోయే కాలంలో పాడి పరిశ్రమకు సంబంధించి అదే విధంగా ఎనిమల్ హస్బెండ్రీకి సంబంధించి పెద్దఎత్తున ప్రమోట్ చెయ్యడానికి రాబోయే బడ్జెట్‌లో ముఖ్యమంత్రి గారు ఇప్పటికే పిలిచి మాట్లాడడం జరిగింది. వెటర్నరీ హాస్పిటల్స్ గురించి మాట్లాడారు. 25-30 సంవత్సరాల క్రితం వెటర్నరీ హాస్పిటల్‌లో ఏమి ఉండేవి కావు, రకరకాల సమస్యలు మనకు కనిపించేవి. ఈ సంవత్సరం ఏప్రిల్, మే నెలలో వంద వెహికిల్స్ తీసుకుంటాము. నియోజకవర్గానికి ఒక వెహికిల్ ఇస్తాము. నెంబర్ కూడా ఫిక్స్ చేస్తాము. డాక్టర్లు, కాంపౌండర్లు, మెడిసిన్స్‌తో నియోజకవర్గ హెడ్‌క్వార్టర్‌లో వెహికిల్స్‌ని ఏర్పాటు చేస్తాము. వెటర్నరీ హాస్పిటల్ ప్రాపర్‌గా పనిచేసినా, చెయ్యకపోయినా మొబల్‌వ్యాన్‌తో ఇంటింటికి వెళ్లే అవకాశం ఉంటుంది. వెటర్నరీ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను మేము ఓపెన్ చేశాము. నారాయణగూడాలో ఓపెన్ చేశాము. మొత్తంగా రాష్ట్రమంతా విస్తరింపచేస్తాము. మెడిసిన్ కాస్ట్ ఎంత, మెడిసిన్ గురించిన వివరాలు ఆన్‌లైన్‌లో తెలుస్తాయి. జిల్లాలకు వెళ్లినప్పుడు రకరకాల లెక్కలు చెబుతారు. ఆ విధంగా ఉండకూడదని ఈ కార్యక్రమం చేపట్టడం జరిగింది. గతంలో పాడి పరిశ్రమ, మత్స్య పరిశ్రమ దివాళా తీసింది. గతంలో మత్స్య శాఖ గురించి, పాడి పరిశ్రమ గురించి చెప్పుకోడానికి ఏమి ఉండేది కాదు. వ్యవసాయానికి అనుబంధంగా రాష్ట్రంలో దీనికి సంబంధించి ఒక డిపార్ట్‌మెంట్ ఉంది, ఈ డిపార్ట్‌మెంట్ ప్రధాన భూమిక పోషిస్తుందని రాష్ట్రం వచ్చిన తరువాత మన ముఖ్యమంత్రి గారు concentrate చేసి ఈ డిపార్ట్‌మెంట్స్ వెనుకబడిన జాతులకు పూర్తి స్థాయిలో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

**శ్రీ టి. జీవన్ రెడ్డి : –** అధ్యక్షా, మంత్రి గారు అన్నీ బాగా చెప్పారు. 2016-17 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆగస్టు, డిసెంబర్ అంటే తొమ్మిది మాసాలు గడిచాయి. తొమ్మిది మాసాలలో లీటరుకు నాలుగు రూపాయల రాయితీ ఇస్తుందని చెప్పిన తరువాత హర్షం వ్యక్తం చేశాము. లక్షా ముప్పై వేల కోట్ల రూపాయల బడ్జెట్‌తో రైతాంగాన్ని ప్రోత్సహించడానికి , వ్యవసాయ అనుబంధంగా ఉన్నటువంటి పాడి పరిశ్రమను ప్రోత్సహించడానికి నిధులను విడుదల చేయవలసిన అవసరం ఉంది.

**11.40 ఉ.** మంత్రిగారు అన్ని విషయాలు చెప్పారు. ఈ ప్రభుత్వం ఎప్పుడు విడుదల చేస్తుందనేది స్పెసిఫిక్ డేట్ చెబితే మేం సంతోషపడతాం. ఈ అంశం లక్షలాది మంది రైతాంగానికి సంబంధించినది. ప్రతి రైతు ఇంటికొక ఆవు, గేదె కట్టేసుకోవాలని ముఖ్యమంత్రి గారు చెప్పారు. ప్రభుత్వం ఎప్పుడు విడుదల చేస్తుందనే స్పెసిఫిక్ డేట్ చెబితే ఆ మెసేజ్ ప్రజలకు వెళుతుంది.

**శ్రీ తలసాని శ్రీనివాస్ యాదవ్:–** జీవన్ రెడ్డి గారూ, ఉపన్యాసం అంటే మీకున్న అనుభవం నాకు లేదు. అధికారంలో ఉంటే ఒక రకంగా మాట్లాడతావు, ప్రతిపక్షంలో ఉంటే ఒక రకంగా మాట్లాడతావు. వారు అధికారంలో ఉన్నప్పుడు చేసుకునే పరిస్థితి లేదు. ఈ రాష్ట్రంలో 60 సంవత్సరాల నుంచి బడుగు, బలహీన వర్గాలు ఉన్నారు. వెనుకబడిన తరగతుల వారున్నారు. లేదంటే పాలమీద ఆధారపడి జీవనం కొనసాగించే వారున్నారు. వీరందరి గురించి కాంగ్రెస్ నాయకులు ఎప్పుడైనా ఆలోచన చేశారా? జీవన్‌రెడ్డి గారు చెప్పినట్లుగా తొమ్మిది మాసాల బకాయిలు లేవు. ఇప్పటికే ఆగష్టు మాసం వరకు చెల్లింపులు చేయడం జరిగింది. రూ.51 కోట్లు బీ.ఆర్.ఐ. కూడా విడుదల చేశాం. నేను ఇంతకు ముందు మాట్లాడినప్పుడు చెప్పిందేమిటంటే సదరు బకాయిల విషయంలో హర్రీబర్రీ పడాల్సిన అవసరం లేదు. ఫస్ట్ టైం ఈ రాష్ట్రంలో ఇటువంటి కార్యక్రమాన్ని తీసుకోవడం జరిగింది. పాలకు సంబంధించిన డబ్బును మాత్రం వెంటనే విడుదల చేస్తున్నాము. కేవలం ఇన్‌సెంటివ్‌కి సంబంధించి మాత్రం కొంచెం వెనకా ముందు అవుతుందని నేను మొదటనే చెప్పాను. గౌరవ సభ్యుడు తొమ్మిది మాసాల నుంచి ఇవ్వడం లేదని చెబుతున్నారు. ఆగష్టు వరకు చెల్లింపులు చేశాం.

కేవలం నాలుగు మాసాలకు సంబంధించి వీలైనంత తొందరలో ఆ డబ్బులు విడుదల చేయడం జరుగుతుంది. తప్పనిసరిగా మేమిచ్చిన మాట ప్రకారం వీలైనంత తొందరగా డబ్బులు విడుదల చేస్తాము. మాకు కూడా తొందరగానే చేయాలనే ఉద్దేశం ఉన్నది. దాని గురించి ఎవరూ టెన్షన్ పడాల్సిన అవసరం లేదు.

**శ్రీ టి.జీవన్‌రెడ్డిః–** అధ్యక్షా, గౌరవ మంత్రిగారు సభను తప్పుదోవ పట్టిస్తున్నారు. వారు లిఖితపూర్వకంగా ఇచ్చిన జవాబు ఒక రకంగా ఉన్నది, వారు సభలో చెబుతున్నది ఇంకొక రకంగా ఉన్నది. వారిప్పుడు మాట్లాడుతూ ఆగష్టు మాసం వరకు చెల్లింపులు చేశామని, కేవలం నాలుగు మాసాల బకాయిలు మాత్రమే పెండింగు ఉన్నాయని చెప్పారు. వారు సభకు లిఖితపూర్వకంగా ఇచ్చిన జవాబు ప్రకారం 2016, ఏప్రిల్ నుంచి 2016,ఆగష్టు వరకు లీటరుకు రూ.4 చొప్పున నగదు ప్రోత్సాహకమొత్తంగా రూ.22.59 కోట్లను త్వరలోనే విడుదల చేయడమవుతుందని చెప్పారు. మంత్రిగారు సాక్షాత్తూ సభనే తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశాక మేం సభలో ...

**మిస్టర్ స్పీకర్ః–** కాంట్రడిక్షన్ ఉన్నదంటున్నారు కాబట్టి మంత్రిగారు క్లారిఫై చేస్తారు.

**శ్రీ తలసాని శ్రీనివాస్ యాదవ్ః–** అధ్యక్షా, ఆగస్టు మాసం వరకు డబ్బులు విడుదల చేయడం జరిగింది. సభకు ఇచ్చిన సమాధానానికి సంబంధించి సదరు క్వశ్చన్ పోస్ట్‌పోన్ అయింది. ఇదే క్వశ్చన్ గత వారం వచ్చింది. కాబట్టి ఆ సమాచారమే ఇప్పుడు ఉన్నది. తాజా సమాచారం ప్రకారం ఆగష్టు మాసం వరకు డబ్బులు విడుదల చేశామని చెబుతున్నాను.

MR.SPEAKER: The remaining questions are postponed.

(కాంగ్రెస్ సభ్యుల నుంచి అంతరాయం)

జీవన్‌రెడ్డి గారూ, మంత్రిగారు లేటెస్ట్ సమాచారాన్ని చెప్పారు.

**శ్రీ టి.జీవన్‌రెడ్డిః–** అధ్యక్షా, గౌరవ మంత్రిగారు శాసనసభ సచివాలయాన్నే తప్పుపడుతున్నారు. శాసనసభ సచివాలయం ప్రశ్నలకు జవాబులు టైం టు టైం అప్‌డేట్ చేయడం జరుగుతుంది. It can be postponed question. కానీ ఇవ్వాళ సభకు మరలా అదే క్వశ్చన్ వచ్చినప్పుడు లేటెస్ట్ సమాచారాన్ని అప్‌డేట్ చేయాల్సిన అవసరం, బాధ్యత శాసనసభ సెక్రటేరియట్‌పైన ఉంటుంది. లక్షలాది మంది రైతులు పాడి పరిశ్రమను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో లీటరుకు రూ.4 ఇన్‌సెంటివ్‌ను విజయ డైరీ ద్వారా రైతాంగానికి ఇస్తామని పేర్కొనడం జరిగినందున గత తొమ్మిది మాసాల నుంచి టైం టు టైం దాటవేస్తూ నిధులు విడుదల చేయడంలో జాప్యం కావడంతో రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందుల దృష్ట్యా కాంగ్రెస్ పార్టీ తరఫున వాకౌట్ చేస్తున్నాము.

**శ్రీ తలసాని శ్రీనివాస్ యాదవ్ః–** అధ్యక్షా, వారు యాభై సంవత్సరాల నుంచి పట్టించుకోకుండా ఇప్పుడు మా ప్రభుత్వం వచ్చి మంచి చేస్తున్న విషయాన్ని గురించి నేను సభకు క్లారిఫై చేశాను. క్లారిఫై చేసిన తరువాత కూడా రాజకీయం చేయాలనే ఆలోచనతో ఆరోజు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కనీసం పాడిరైతుల వైపు చూడని వారు ఈరోజు మైకు దొరుకుతుందా లేదా అనేటటువంటి ఉద్దేశంతో వారు పదేపదే మాట్లాడటమంటే ఇంతకన్నా పెద్ద దారుణం ఏముంటుంది. నేను సభను తప్పుదోవ పట్టించడమేంటండీ? మా ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుంది.

(కాంగ్రెస్ సభ్యుల నుంచి అంతరాయం)

**మిస్టర్ స్పీకర్ః–** జీవన్‌రెడ్డి గారూ, మీరు ఏమన్నారంటే మంత్రిగారి సమాధానం కాంట్రడిక్టరీగా ఉన్నదని అన్నారు. దానిమీద మంత్రిగారు ఇంకా క్లుప్తంగా క్లారిఫికేషన్ ఇచ్చిన తరువాత కూడా అదే అంశం మీద ప్రొటెస్ట్ చేస్తామంటే ఎలాగండీ?

**శ్రీ టి.జీవన్‌రెడ్డిః–** అధ్యక్షా, ఇవ్వాళ ఈ సభలో చర్చించేది ఈ ప్రభుత్వం ఏం చేస్తున్నదనేది చర్చించుకుంటున్నాము. ఈ ప్రభుత్వం కేవలం వాగ్దానాలకే పరిమితం కావడంతో రైతాంగం ఆందోళనకు గురవుతున్న దృష్ట్యా మరీ ముఖ్యంగా పాడి పరిశ్రమకు సంబంధించి లీటరుకు రూ.4 రాయితీ ఇవ్వడం జరుగుతుందని పేర్కొని గత తొమ్మిది మాసాల నుంచి విడుదల చేయనందుకు కాంగ్రెస్ పార్టీ శాసనసభాపక్షం తరఫున వాకౌట్ చేస్తున్నాము.

(ఈ దశలో కాంగ్రెస్ పార్టీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేస్తుండగా అధికారపక్ష సభ్యులు షేమ్, షేమ్ అని అనసాగారు)

11.50 ఉ.

**శ్రీ తలసాని శ్రీనివాస్ యాదవ్: –** అధ్యక్షా, గడిచిన సుమారు 50, 60 సంవత్సరాల నుంచి పాడి రైతులను ఆదుకోవడానికి ఎవరూ చేయనటువంటి విధంగా మన ముఖ్యమంత్రి గారు ఒక లీటరుకు 4 రూపాయల ఇన్సెంటివ్‌ను ఇచ్చే కార్యక్రమం తీసుకొచ్చారు. ఇది రైతులకు ఏవిధంగా ఉపయోగపడుతుందని ఒక వైపు చెబుతూనే, మీరడిగిన తరువాత ఆ విషయాన్ని క్లారిఫై కూడా చేశాను. రాజకీయాలు చేయాలనే,

టివిల్లో, పేపర్లల్లో రావాలనే ఉద్దేశమే తప్ప, వీరి ప్రభుత్వం ఉన్నప్పుడు ఏనాడు కూడా బడుగు, బలహీనవర్గాల, కులవృత్తులపై ఆధారపడిన వాళ్లకు మేలు చేయాలని వీరు ఆలోచన చేయలేదు. చెప్పిన సందర్భంలో బులెటిన్‌ను రిలీజ్ చేయడంలో ఆలస్యమైందని చెబుతు ఉన్నప్పటికి ఈ విధంగా వీరు రాజకీయ బద్‌నాం చేస్తున్నారు. ఇన్ని సంవత్సరాల నుంచి చేయడానికి వారికేమో చేత కాలేదు. వారిక్కడ ప్రొటెస్ట్ చేసినంత మాత్రాన రైతులు వారికి సపోర్ట్ చేస్తారని అనుకుంటున్నారు. వాళ్లను జీవిత కాలంలో కూడా రైతులు సపోర్ట్ చేసే పరిస్థితి లేదు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన తరువాత మన ముఖ్యమంత్రి గారు తీసుకున్న నిర్ణయాలకు ఈ రోజు రైతులు, ప్రజలందరూ సంతోషంగా ఉన్నారు. శాసనసభలో ఈ విధమైన రాజకీయాలు చేయడమనేది దుర్మార్గం, దౌర్భాగ్యం. ఒకవైపు మీరు చెబుతున్నప్పటికి మరియు మేము క్లారిఫై చేసిన తరువాత కూడా 9 మాసాలు, 9 మాసాలు అని అంటున్నారు. మాకు ఆ సోయి లేదా? మేము కమిట్‌మెంట్‌తో ఉండాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాలను చేస్తున్నాము. వీరు ఏమి చేసినప్పటికీ మా కార్యక్రమాలు మేము చేసుకుంటు పోతాము. అల్టిమేట్‌గా అక్కడ ఉన్న పాల రైతులు సంతోషంగా ఉండాలనేదే ప్రభుత్వం కోరిక.

## సభా సమక్షంలో ఉంచబడిన పత్రాలు

**MR. SPEAKER:-** The remaining questions are postponed. The Papers to be laid on the Table of the House are deemed to have been laid on the Table of the House.

1. A copy of the Annual Report of the Telangana State Public Service Commission for the period from 18-12-2014 to 31-03-2015 as required under Article 323(2) of Constitution of India.

2. The copies of Notifications issued in G.O.Ms. No.193, Revenue (DA-CMRF) Department dated 19-08-2016 and G.O.Ms.No.204, Revenue (DA-CMRF) Department, dated 22-09-2016 under the Telangana State Districts (Formation) Rules 2016 as required under sub-section 2 of Section 4 of Districts (Formation) Act, 1974.

## సభాకార్యక్రమము

## వాయిదా తీర్మానాల అనుమతి గురించి

1. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల గురించి శ్రీ కె. జానారెడ్డి గారు మరియు ఇతరులు ఇచ్చిన వాయిదా ప్రతిపాదనను తిరస్కరించడమైనది.

2. డిఎస్సీ క్వాలిఫైడ్ టీచర్ల నియామకం గురించి శ్రీ జి. కిషన్ రెడ్డి గారు ఇచ్చిన వాయిదా ప్రతిపాదనను తిరస్కరించడమైనది.

3. మహిళా విశ్వవిద్యాలయం ఏర్పాటు గురించి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు మరియు ఇతరులు ఇచ్చిన వాయిదా ప్రతిపాదనను తిరస్కరించడమైనది.

4. దివ్యాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా కొనసాగించాలని కోరుతూ శ్రీ సున్నం రాజయ్య గారు ఇచ్చిన వాయిదా ప్రతిపాదనను తిరస్కరించడమైనది.

## జీరో అవర్

**శ్రీ ఎన్. దివాకర్ రావు (మంచిర్యాల):** – అధ్యక్షా, ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపు గ్రామాల రైతుల, ప్రజల ప్రధాన కోరిక. ఎల్లంపలి ప్రాజెక్టు కోసం దాదాపు 7,500 ఎకరాల భూమిని ఇవ్వడం జరిగింది. 9 గ్రామాలు ముంపు ప్రాంతంలో ఉన్నాయి. కడెం ప్రాజెక్టు టెయిల్ ఎండ్ ప్రాంతం 42వ డిస్ట్రిబ్యూటర్‌కు సంబంధించినది. అక్కడి మిగతా భూమికి నీరందించాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఎ.న్టి.పి.సి. కి 6 టి.ఎమ్.సి.లు, హైదరాబాద్‌కు త్రాగునీరు, మా ప్రాంతానికి 3 టి.ఎమ్.సి.లు, మంథెని ప్రాంతానికి 2 టి.ఎమ్.సీ.ల నీళ్లను అందిస్తున్నాము. మా ప్రాంతం కూడా వ్యవసాయ రంగంగా అభివృద్ధి చెందడానికి 1 టి.ఎమ్.సి.ల లిఫ్ట్‌ను ఏర్పాటు చేసినట్లైతే 10,000 ఎకరాల ఆయకట్టు వస్తుంది. కావున, లిఫ్ట్‌ను ఏర్పాటు చేసి నీరందించాలనే రైతాంగం కోరికను ప్రభుత్వం తప్పకుండా నెరవేర్చాలని ఇరిగేషన్ మంత్రి గారిని, ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాను.

**శ్రీ ఎమ్.డి. మహమూద్ అలీ (ఉప ముఖ్యమంత్రి) (రెవెన్యూ):** – అధ్యక్షా, గౌరవ సభ్యులు తెలియజేసిన అంశాన్ని నోట్ చేసుకున్నాము. సంబంధిత ఇరిగేషన్ మంత్రి గారికి ఈ విషయాన్ని పంపిస్తాము.

**శ్రీమతి డి.కె. అరుణ:** – అధ్యక్షా, ఈ ప్రశ్న దేవాదాయ శాఖ మంత్రి గారికి సంబంధించినది. కొల్లాపూర్ నియోజకవర్గం,

పెద్ద కోత పల్లి మండలం, నైమాన్ పల్లి గ్రామంలోని శ్రీ మైసమ్మ దేవస్థానానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేస్తుంటారు. వాహనాల పార్కింగ్, తైబజార్, తలనీలాలు, పూజ సామాగ్రి అమ్మకం కోసం దేవస్థానం ప్రతి సంవత్సరం టెండర్లను పిలుస్తుంది. దేవాదాయ, ధర్మాదాయ శాఖ టెండరు నిమిత్తమై అక్టోబర్ 31 నాడు ఒక బహిరంగ ప్రకటనను చేయడం జరిగింది. 9 నవంబర్ నాడు బహిరంగ వేలాన్ని నిర్వహిస్తామని చెప్పి రెండు సార్లు టెండర్లను వాయిదా వేయడం జరిగింది. మొదటగా పాలెంలో టెండర్లను నిర్వహిస్తామని చెప్పినప్పటికి, టెంపుల్ సమీపంలోనే డిసెంబర్ 30వ తేదీ నాడు బహిరంగ వేలాన్ని నిర్వహించారు. టెండర్లలో పాల్గొనటానికి వచ్చిన ఇతర వ్యక్తుల నుండి డి.డిలను కొంత మంది లాక్కొని వెళ్లారు. పోలీసులు ఆ గొడవను సద్దుమణిచిన తరువాత, పోలీసు స్టేషన్‌లో కంప్లైంట్ ఇచ్చిన తరువాత, టెండర్ ప్రక్రియ మొత్తం ముగిసిన తరువాత ఆ డి.డి.లను తిరిగి ఇవ్వడం జరిగింది. అది మంత్రి గారి నియోజకవర్గం కావడం వల్ల.........

(అంతరాయం)

మంత్రి గారి పి.ఎ., తమ్ముడు మంత్రి గారి పేరు చెప్పుకొని పని చేసినట్లు సమాచారం. టెండర్లలో పాల్గొనకుండా చేసి, డి.డి.లు లాక్కెళ్లి, ఏకపక్షంగా టెండర్లల్లో పనులను తీసుకోవాలనే ఉద్దేశంతో పని చేసిన వారిని వెంటనే ........

**శ్రీ ఎ. ఇంద్ర కరణ్ రెడ్డి : –** గౌరవ సభ్యురాలు తెలియజేసిన శ్రీ మైసమ్మ దేవాలయ వేలంపాటకు సంబంధించిన అవకతవకలపై తప్పకుండా ఎంక్వైరీ వేయిస్తాము.

**శ్రీ వేముల వీరేశం:–** అధ్యక్షా, గత అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో రామన్నపేట దగ్గర బస్సు యాక్సిడెంట్ జరిగింది. ఆ సందర్భంలో ఆ రోడ్డును 4 లైన్ల రహదారిగా మారుస్తామని చెప్పడం జరిగింది. భువనగిరి–చిట్యాల వరకు గల రహదారిని 4 లైన్ల రహదారిగా మార్చాలని మీ ద్వారా ఆర్ అండ్ బి మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ నాయిని నరసింహారెడ్డి (హోం శాఖ మంత్రి):–** అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పిన అంశాన్ని నోట్ చేసుకున్నాము. సంబంధిత మంత్రి గారికి ఈ విషయాన్ని నివేదించడం జరుగుతుంది.

**12.00 మ.**

جناب سید احمد پاشاہ قادری(Janab Syed Ahmed Pasha Quadri): جناب اسپیکر صاحب! میں حکومت سے اور ہوم منسٹر صاحب سے ہوم گارڈس کے مسائل کو حل کرنے کا مطالبہ کرتا ہوں۔ کئی مہینوں سے ایوان میں اور حکومت کے پاس ہوم گارڈس کے مسائل کے لئے نمائندگی کی گئی، لیکن اب تک اس کا کوئی نتیجہ نہیں نکلا۔ جو پولیس والوں کے ساتھ کام کرتے ہیں، بلکہ ان سے زیادہ محنت کرتے ہیں، ان کی تنخواہیں بڑھانے کا مطالبہ ایک عرصہ دراز سے چل رہا ہے۔ محنت زیادہ ہے، تنخواہ کم ہے۔ ان کے ساتھ انصاف ہونا بے حد ضروری ہے۔ حکومت کا کام ہے کہ ان کو دیگر سہولتیں بھی فراہم کرے۔ ہوم گارڈس کو بس پاس کی سہولت نہیں ہے۔ ان کو ہیلتھ کارڈ کی سہولت نہیں ہے۔ ان کے خاندان کو بھی ہیلتھ کارڈ کے ذریعہ سہولت دینی چاہئے۔ آج غریب ہوم گارڈس کو تمام سہولتیں ملیں گی تو وہ اچھے طریقہ سے ڈیوٹی بھی کریں گے۔ پولیس میں جب تقررات ہوتے ہیں، تو ہمارا مطالبہ یہ ہے کہ کم از کم 10-15% جائیدادیں ہوم گارڈس کے لئے رکھی جائیں تو مناسب رہے گا۔ ان کو سی ایل اور ای ایل کی بھی کوئی سہولت نہیں ہے۔ سال میں 15 دن سی ایل اور ایک سال میں ایک مہینے کی ای ایل کی بھی سہولت ان کو فراہم کرنا چاہئے۔ ان کو ٹی اے اور ڈی اے بھی نہیں ملتا۔ حکومت کے official work پر یہ اضلاع بھی جاتے ہیں، لیکن ان کے لئے ٹی اے اور ڈی اے کی بھی سہولت نہیں ہے۔ میں اخیر میں یہ کہوں گا ان کی فلاح و بہبود کے لئے حکومت کی جانب سے ایک کمیٹی بھی بنائی گئی اور اس کمیٹی نے اپنی رپورٹ بھی حکومت کو دی۔ حکومت کا کام ہے کہ اس کی سفارشات پر فوری عمل آوری کرے تا کہ وہ خوشحالی کی زندگی گزار سکیں۔

جناب نائنی نرسمہا ریڈی(Janab Naini Narsimha Reddy): اسپیکر صاحب! ہمارے رکن اسمبلی پاشاہ قادری صاحب نے جو complaint کیا ہے کہ ہوم گارڈس پولیس سے زیادہ کام کرتے ہیں، یہ ٹھیک نہیں ہے۔ وہ پولیس کے ساتھ کام کرتے اور ان کی help کرتے ہوئی ہے۔ ان کے بارے میں جو بھی سہولتیں ہوں، وہ ان کو دینے کے بارے میں حکومت سوچ رہی ہے، کچھ چیزیں pending ہیں، کچھ چیزوں پر جلدی سے جلدی فیصلہ کیا جائے گا۔

**శ్రీ ఎమ్. యాదగిరి రెడ్డి (జనగాం):–** అధ్యక్షా, నా నియోజక వర్గంలో 100 ట్రైబల్ హ్యాబిటేషన్లు ఉన్నాయి. ఇక్కడి వారు ఎక్కువగా జొన్నలు తింటారు. వారికి నెలకు ఇస్తున్న 6కిలోల బియ్యానికి బదులు జొన్నలు కావాలని అడుగుతున్నారు. అదే విధంగా స్లైసింగ్ మిషన్లు ఏర్పాటు చేయాలని మనవి చేస్తున్నాను.

**శ్రీ ఎ. ఇంద్ర కరణ్ రెడ్డి :–** అధ్యక్షా, గౌరవ శాసన సభ్యులు చెప్పిన అంశాన్ని నోట్ చేసుకున్నాము. సంబంధిత మంత్రి గారికి పంపడం జరుగుతుంది.

**శ్రీ ఎన్.వి.ఎస్.ఎస్ ప్రభాకర్ (ఉప్పల్):–** అధ్యక్షా, నిజాం కాలం నాటి నుండి తెలంగాణ రాష్ట్రంలో వాల్మీకి, చమర్, మదర్ వంటి ఎస్.సి ఉపకులాల వారు మన తెలంగాణ గడ్డ మీద నివాసం ఉంటున్నాయి. హైదరాబాద్ సంస్థాన విమోచనంలో ఆనాటి నిజాం

నవాబ్‌లకు వ్యతిరేకంగా వారి పోరాటం చాలా ముఖ్యమైన ఘట్టం. అదే విధంగా మన రాష్ట్ర సాధనలో కూడా వారి పోరాటం చాలా కీలకమైనది. మన కొత్త రాష్ట్రం ఏర్పడిన తరువాత వారికి ఇక్కడ కులం సర్టిఫికేట్ ఇవ్వడంలేదు. అది పెండింగ్‌లో ఉన్నటువంటి మాట వాస్తవము. ఈ విషయాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందని కోరుతున్నాను. మన రాష్ట్రంలో కాపు, కాళింగ, తూర్పు కాపులకు సంబంధించిన ఉన్న బిసి ఉపకులాల వారికి కూడా సర్టిఫికేట్లు ఇస్తామని చెప్పారు. జి.హెచ్.ఎమ్.సి. ఎన్నికల సందర్భంలో వాగ్దానం చేయడం, అన్ని రాజకీయ పక్షాల నుండి కూడా లేఖలు కూడా కోరింది. కాని ఇంత వరకు వారికి కులం సర్టిఫికేట్లు ఇవ్వడం లేదు. భారత రాజ్యాంగం ప్రకారం ఎవరు ఎక్కడ నివాసం ఉన్నప్పటికీ కులం సర్టిఫికేట్ ఇవ్వడం అనేది రాజ్యాంగ పరిధిలోకి వచ్చే హక్కు.

**శ్రీ మహమ్మద్ మహమూద్ అలీ :–** అధ్యక్షా, గౌరవ సభ్యులు ప్రభాకర్ గారు చెప్పిన అంశాన్ని నోట్ చేశాము. సంబంధిత మంత్రి గారికి పంపిస్తాము.

**శ్రీ కె. విద్యాసాగర్ (కోరట్ల): –** అధ్యక్షా, ఇది ఇరిగేషన్ శాఖకు సంబంధించిన ప్రశ్న. పాత ప్రభుత్వంలో వాటర్ యూజర్స్ అసోసియేషన్ తరఫున దాదాపు 750 పనులు చేపట్టడం జరిగింది. అందులో ఎన్నో అవకతవకలు జరిగాయి. కొన్ని పనులకు పేమెంట్ ఇవ్వడం జరిగింది. నిజంగా చేసిన కొన్ని పనులకు పేమెంట్ ఇవ్వలేదు. మన ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ విషయమై ఎంక్వైరీ కూడా వేశారు. తొందరగా ఎంక్వైరీ చేసి ఒరిజినల్ పనులకు పేమెంట్లు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ శాఖామాత్యులను కోరుతున్నాను.

**శ్రీ పి. మహేందర్ రెడ్డి (రవాణా శాఖ మంత్రి):–** అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పిన అంశాన్ని నోట్ చేసుకున్నాము. సంబంధిత డిపార్ట్‌మెంటుకు పంపించి వెంటనే లెటర్ కూడా పంపడం జరుగుతుంది.

**శ్రీ ఆర్. కృష్ణయ్య :–** అధ్యక్షా, ఇది ట్రైబల్ వెల్ఫేర్ మంత్రి గారికి సంబంధించిన అంశం. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంటు క్రింద 101 కాలేజి హాస్టళ్లు నడుస్తున్నాయి. కాని ఈ హాస్టళ్లలో వర్కర్స్‌ని అప్పాయింట్ చేయడంలేదు. ప్రతి కాలేజి హాస్టల్‌కు వంట చేసే వారు, ఊడ్చే వారు, కడిగేవారు వంటి నలుగురు వర్కర్లను అపాయింట్ చేయాలి. ఎన్ని సార్లు ప్రభుత్వానికి చెప్పినా వర్కర్లను అపాయింట్ చేయకపోవడం వల్ల కాలేజీ హాస్టళ్లలో భోజనం పెట్టడంలేదు. ముఖ్యంగా అమ్మాయిలు చాలా ఇబ్బంది పడుతున్నారు. గిరిజనులకు సబ్ ప్లాన్ ఉంది, కేంద్ర రాష్ట్రాలు అనేక పథకాలు రూపొందించాయి. కాలేజీ హాస్టళ్ల ముగ్గురు, నలుగురు వర్కర్లను ఇవ్వడానికి ఉన్న ఇబ్బంది ఏమిటి? ఈ విషయమై అనేక సార్లు మంత్రి గారితోనూ, ప్రభుత్వంతోనూ చర్చలు జరిపాము. కాబట్టి, ఈ విషయమై వెంటనే చర్య తీసుకుని వర్కర్లను అపాయింట్ చేసి, హాస్టల్ విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

**శ్రీ ఎ. చందూలాల్ :–** అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పిన అంశాన్ని నోట్ చేసుకున్నాము. తగిన చర్యలు తీసుకుంటాము.

**శ్రీ తీగల కృష్ణా రెడ్డి (మహేశ్వరం):–** అధ్యక్షా, జిల్లాల పునర్ విభజనలో భాగంగా మహేశ్వరం నియోజక వర్గంలో ఉన్న కందుకూరు మండలాన్ని రెవెన్యూ మండలంగా తీర్చిదిద్దినందుకు ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అక్కడ రెవెన్యూ కార్యాలయాలు లేకపోవడం వలన ఇబ్బంది పడుతున్నాము. అక్కడ ఎమ్.ఎల్.ఏ.కు కట్టించిన కార్యాలయాన్ని రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి ఇచ్చాము. తక్షణమే ఆ భవనం కట్టించి ఇవ్వాల్సిందిగా సంబంధిత మంత్రి గారిని కోరుతున్నాను. అంతే కాకుండా అక్కడ సిబ్బంది కొరత కూడా ఉంది. సిబ్బందిని కూడా నియమించాల్సిందిగా సంబంధిత మంత్రి గారిని కోరుతున్నాను. మహబూబ్ నగర్ నుండి ఆమన్‌గల్, కల్వకుర్తి, కడ్తాల్‌లు మా మండలానికి చేరింది కనుక, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు కాబట్టి తక్షణమే నిధులు కేటాయించి ఆ బిల్డింగును కట్టించాల్సిందిగా మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ మహమ్మద్ మహమూద్ అలీ :–** అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పిన అంశాన్ని నోట్ చేశాము. సమాధానం పంపిస్తాము.

**శ్రీ సున్నం రాజయ్య :–** అధ్యక్షా, ఇది హౌసింగ్ మంత్రి గారికి సంబంధించిన ప్రశ్న. 10,12 సంవత్సరాల నుండి గృహ నిర్మాణ సంస్థలో 1179 మంది ఉద్యోగులు ఔట్‌సోర్సింగ్‌లో పని చేస్తున్నారు. వీరందరు ఐటి మేనేజర్స్, జూనియర్ అసిస్టెంట్లు, అకౌంట్స్ ఆఫీసరు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లుగా పని చేస్తున్నారు. ప్రభుత్వం వీరందరినీ 9 మాసాల నుండి పట్టించుకోవడం లేదు. విరు 10, 12 సంవత్సరాల నుండి ఇదే డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్నారు. వయో పరిమితి దాటి 40 సంవత్సరాలకు పైబడి ఉన్నారు. వీరందరు ఉన్నత చదువులు చదివిన బడుగు బలహీన వర్గాలకు చెందిన పిల్లలు, కాబట్టి వారందరిని రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**శ్రీ ఎ. ఇంద్ర కరణ్ రెడ్డి :–** అధ్యక్షా, గౌరవ సభ్యులు సున్నం రాజయ్య గారు చెప్పింది నోట్ చేసుకున్నాము. పరిశీలించడం జరుగుతుంది.

**శ్రీ కె.పి. వివేకానంద్ (కుత్బుల్లాపూర్): –** అధ్యక్షా, ఇది ఔటర్ రింగ్ రోడ్డుకు సంబంధించిన ప్రశ్న. ఔటర్ రింగ్ రోడ్డు పనులు పూర్తయ్యాయి కాని రేడియల్‌కి సంబంధించిన పనులు అసంపూర్తిగా ఉన్నాయి. మా నియోజక వర్గంలో ప్రధాన రహదారులన్నీ పూర్తి చేసుకున్నాము. కాకపోతే గండి మైసమ్మ నుండి, బహదూర్‌పల్లి, సూరారం, జీడిమెట్ల వరకు వచ్చే రోడ్డు 2014 సంవత్సరంలో పూర్తి కావాల్సి ఉంది. కాంట్రాక్టరు యొక్క లేజీనెస్ వల్ల అక్కడ పని చాలా స్లోగా నడుస్తోంది. ఆ పని త్వరగా పూర్తి చేయాలని సంబంధిత మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ పి. మహేందర్ రెడ్డి :–** అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పింది నోట్ చేసుకున్నాము. సంబంధిత డిపార్ట్‌మెంట్ ద్వారా వారికి సమాధానం పంపించడం జరుగుతుంది.

**శ్రీ టి. జీవన్ రెడ్డి :–** అధ్యక్షా, ఈ రాష్ట్రంలోని పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించి గ్రామ పంచాయతీల్లో బాధ్యత వహిస్తున్న వేలాది పారిశుద్ధ్య కార్మికులకు సంబంధించిన అంశం. పారిశుద్ధ్య కార్మికులకు కేవలం రూ.15 వందల నుండి రూ.26వందల వరకు నామమాత్రపు వేతనాలు చెల్లిస్తుండడంతో వారు వివిధ నిరసన కార్యక్రమాలు చేపట్టడంతోబాటు, రాష్ట్రంలోని అత్యున్నత న్యాయస్థానమైన హైకోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు సూచన మేరకు తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ప్రిన్సిపాల్ సెక్రెటరీ, పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ఒక కమిటీని వేసింది. వారి సూచన మేరకు జి.ఓ.ఎమ్.ఎస్. నెం. 63, 27.08.2016 నాడు ప్రభుత్వ ఉత్తర్వును జారీ చేసింది.

**12.10 మ.** అధ్యక్షా, రూ.1623 వరకు పొందుతున్న వేతనాన్ని, నాలుగువేల రూపాయలకు పెంచే విధంగా, రూ26౦౦లు వేతనం పొందుతున్న వారికి రూ.5వేలకు పెంచే విధంగా చూడాలని కోరుతున్నాను. వేతన చెల్లింపును ప్రభుత్వం నుంచి కాకుండా, గ్రామ పంచాయతీలపై బాధ్యత ఉంచడం వల్ల, గ్రామ పంచాయతీల్లో అరకొర నిధులు సమకూర్చుకోలేక వీటిని సక్రమంగా ఇవ్వడం లేదు. కనుక ఈ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసినా కూడా పారిశుద్ధ్య కార్మికుల సమస్య అక్కడే ఉంది. కనుక ప్రభుత్వానికి నా సూచనేమంటే, ప్రభుత్వంపై ఆర్థికంగా భారంపడకుండా గ్రామ పంచాయతీలకు నిధులు వెసులుబాటు కల్పించే విధంగా చేయాలి. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం ఎన్.ఆర్.ఈ.జి.ఎస్.లో ఉపాధుడం, కాలువ మరమ్మత్తులు, మరికొన్ని అంశాలు ఇందులోని అంతర్భాగాలని తెలియజేస్తున్నాను. ఎన్.ఆర్.ఈ.జి.ఎస్.ను పారిశుద్ధ్య కార్మికులను అనుసంధానం చేసినట్లైతే వీరికి వేతనం చెల్లింపు చేసుకునే అవకాశం ఉంటుంది, ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది, అదే విధంగా ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందని తెలియజేస్తున్నాను.

**శ్రీ ఎ. ఇంద్రకరణ్ రెడ్డి:–** అధ్యక్షా, గౌరవసభ్యులు తెలిపిన అంశాన్ని నోట్ చేసుకున్నాము. సంబంధిత డిపార్ట్‌మెంట్ నుంచి జవాబు పంపడం జరుగుతుంది.

**శ్రీ దుర్గం చిన్నయ్య:–** అధ్యక్షా, మా నియోజక వర్గంలో వేల ఎకరాల భూమి ప్రభుత్వ రెవెన్యూ డిపార్ట్‌మెంట్ వారి ఆధీనంలో ఉంది. కాని, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ వారు ఆ భూమిని మాది అని అంటున్నారు. మా బెల్లంపల్లి నియోజక వర్గం వెన్నెల మండలానికి ముఖ్యమంత్రి గారు ఒక రెసిడెన్షియల్ స్కూల్‌ను, హరీష్‌రావు గారు ఒక గోదామును మంజూరు చేశారు. ఈ విషయాలపై రెవెన్యూ డిపార్ట్‌మెంట్ వారు ల్యాండ్ అలాట్ చేశారు, కాని వీటిని ప్రారంభించాలని వెళితే అక్కడ గల ఫారెస్ట్ అధికారులు ఈ భూమి ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కి సంబంధించినది, రెవెన్యూ శాఖ వారు ఏ విధంగా మీకు ఇస్తారని అంటున్నారు. కనుక అక్కడ ఎటువంటి పనులు చేయనివ్వకుండా అడ్డుపడుతున్నారని తెలియజేస్తున్నాను. దయచేసి రెవెన్యూ మంత్రి ఈ విషయంపై దృష్టిసారించి, సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాను.

**శ్రీ మహమ్మద్ మహమూద్ అలీ:–** అధ్యక్షా, గౌరవ సభ్యులు తెలిపిన అంశాన్ని నోట్ చేసుకున్నాము. మీటింగ్ పెడతాము.

جناب محمد معظم خان (Janab Mohd.Moazam Khan): اسپیکر صاحب! میں آپ کے ذریعہ چیف منسٹر صاحب سے کہنا چاہ رہا ہوں کہ میرے حلقہ بہادر پورہ میں کالا پتھر علاقہ میں ایک پرائمری دواخانہ ہے اس کے upgradation کے لئے already ایک زمانے سے چیف منسٹر صاحب سے representation کیا جا رہا ہے۔ بہادر پورہ حلقہ ایک گنجان علاقہ ہے اور وہاں کوئی area hospital نہیں ہے۔ میں آپ کے ذریعہ چیف منسٹر صاحب سے کہنا چاہ رہا ہوں کہ representation دیا گیا ہے اس کو consider کرتے ہوئے اس علاقہ میں پرائمری دواخانہ میں ایک area hospital کے لئے اس دواخانہ کی زمین دو ہزار گز سے زیادہ ہے۔ اس میں ایک اچھا سا area hospital قائم کیا جا سکتا ہے۔ میں آپ کے ذریعہ چیف منسٹر صاحب سے گزارش کرنا چاہتا ہوں کہ اس علاقہ میں آپ ایک بڑا ہاسپٹل قائم کریں۔ Thank you Sir.

**శ్రీ టి.పద్మా రావు (అబ్కారీ శాఖ మంత్రి)–:** అధ్యక్షా, గౌరవ సభ్యులు తెలిపిన అంశాన్ని నోట్ చేసుకున్నాము. లిఖితపూర్వక సమాధానం పంపడం జరుగుతుంది.

MR.SPEAKER: Now Tea break for 15 minutes.

(The House then adjourned at 12.13 p.m. for 15 minutes)

(The House re-assembled at 12.34pm

12.30 మ. With the Hon'ble Speaker in the Chair)

MR. SPEAKER: Let us continue with short discussion.

## లఘుచర్చ (కొనసాగింపు)

## "రాష్ట్రంలో మత్స్య పరిశ్రమాభివృద్ధి" గురించి

**శ్రీ టి.రాంమోహన్ రెడ్డి:–** అధ్యక్షా, తెలంగాణ రాష్ట్రంలో చేపల అభివృద్ధి విషయంలో నాకు మాట్లాడే అవకాశం కల్పించినందుకు మీకు ధన్యవాదాలు. ప్రపంచంలోనే చైనా దేశం చేపల ఉత్పత్తిలో మొట్టమొదట స్థానాన్ని సంపాదించడం జరిగింది. మన భారతదేశం రెండవ స్థానంలో ఉన్నది. ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడు మనం దేశంలోనే మొట్టమొదటి స్థానంలో ఉండేవాళ్లము. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ నేతృత్వంలో రాజశేఖర్‌రెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మన రాష్ట్రంలో నేషనల్ బోర్డ్ ఫర్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ అనే జాతీయస్థాయి సంస్థను 2006వ సంవత్సరంలో ఏర్పాటు చేయడం జరిగింది. అగ్రికల్చర్ యూనివర్శిటీలో తాత్కాలికంగా ఏర్పాటు చేసి ఆ తర్వాత రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కేంద్ర వ్యవసాయ శాఖమంత్రి శరత్‌పవార్ గారు, ఆనాటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డిగారు ప్రారంభించడం జరిగింది. ఇక్కడ నుంచి దేశ వ్యాప్తంగా చేపల అభివృద్ధికి ఏలాంటి నిర్ణయాలు తీసుకోవాలి, ఏలాంటి నిధులు ఇవ్వాలని దేశ వ్యాప్తంగా పర్యవేక్షణ కేంద్రవ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయశాఖామంత్రి ఛైర్మన్‌గా ఉండే ఈ సంస్థను హైదరాబాద్ నుంచి నడిపించడం అన్నది మనకు గర్వకారణం. ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడు నెల్లూరులో ఫిషరీస్‌కు సంబంధించిన కళాశాలను ఏర్పాటు చేయడం జరిగింది.

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత తెలంగాణలో ఒక్క ఫిషరీస్ కళాశాల కూడా లేదు. ఫిషరీస్ కళాశాలను నాగార్జున సాగర్‌లో కానీ, లోయర్ మానేరు ప్రాజెక్టు దగ్గర ఎక్కడైనా కానీ సర్వే చేసి ఫిషరీస్ కళాశాలను ఏర్పాటు చేసుకోవలసిన అవసరం ఉన్నది. మన రాష్ట్రంలో 74రిజర్వాయర్లు 2324 ఎడ్యుకేషనల్ టౌన్స్, 19746మైనర్ ఇరిగేషన్ టౌన్స్, గ్రామపంచాయతిలల్లో ఉన్నాయి. నేను శాసనసభ్యుడు అయిన తర్వాత మిషన్ కాకతీయ పథకం గురించి చెరువుల అభివృద్ధిలో భాగంగా నేను స్వయంగా ఫిషరీస్ డిపార్టుమెంట్ అధికారులను అదే విధంగా ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ అధికారులను పిలిచి ఒక సమావేశాన్ని పెట్టి ఫిషరీష్ యొక్క సామర్థ్యాన్ని నియోజకవర్గాలల్లో పెంచాలని మేము స్ప్రెడ్ ఓవర్ ఆఫ్ వాటర్ గురించి ప్రణాళికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించడం జరిగింది. మేము ఏవైతే నివేదికలు పంపించడం జరిగిందో దాన్ని పరిగణలోకి తీసుకోకుండానే చేపపిల్లలను చెరువులల్లోకి పంపించడం జరిగింది. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఉన్న చెరువులకు చేపపిల్లలను పంపించాలని నేను కోరడం జరిగింది. మా నియోజకవర్గంలో ముదిరాజ్ సంఘాలకు, గంగపుత్ర సంఘాలకు సంబంధించిన వాళ్లకు మాత్రం ఈ చేపపిల్లలను పంపిణి చేస్తున్నారు. సాలార్‌నగర్ ప్రాజెక్టు అనే ప్రాజెక్టు నా నియోజకవర్గంలో ఉన్నది. ఆ ప్రాజెక్టు దగ్గర పోతురాజు అనే కాంట్రాక్టరు కైకలూరు నుంచి చేప పిల్లలను తెప్పించుకుని మా నియోజకవర్గంలో ప్రాజెక్టుల్లో వేయడం జరిగింది. అయితే ఎన్ని చేప పిల్లలను వేస్తున్నారని మా నియోజకవర్గంలో నేను కౌంట్ చేయించాను. అతను 88వేల చేపపిల్లలను ఈ సాలార్‌నగర్ ప్రాజెక్టుల్లో వేయవలసి ఉన్నది, కేవలం 18వేల చేపపిల్లలను మాత్రమే అక్కడ వేయడం జరిగింది. నేను వెంటనే మా వికారాబాద్ జిల్లా కలెక్టర్ దివ్య గారికి ఆ కాంట్రాక్టరుపై కంప్లైంట్ చేయడం జరిగింది. కలెక్టర్, గారి ఆదేశాల మేరకు ఆ వ్యక్తి తరువాత రోజు మిగిలిన చేపలను తీసుకొని వచ్చి ఆ ప్రాజెక్టులో వేయడం జరిగింది.

ఆ తరువాత నేను ఒక రెండు మూడు ఇతర చెరువులను చూశాను, వాళ్లు కేవలం 20శాతం చేపపిల్లలను మాత్రమే వేస్తున్నారు. మిగిలిన 80శాతం చేపపిల్లలను వేయడం లేదు. ఇందులో అవినీతి జరుగుతుందని నేను కలెక్టర్‌గారి దృష్టికి తీసుకొని వెళ్లాను. వారు మళ్లీ మిగిలిన చేపలను వేయడం జరిగింది. నా నియోజకవర్గంలో నేను స్వయంగా లెక్కపెట్టించాను కాబట్టి ఈ అవినీతి బయటపడింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ చేప పిల్లల కాంట్రాక్టర్లు ఎవరైతే ఉన్నారో వారు ముఖ్యంగా మత్స్యకారుల సంఘాలను, పేద ప్రజలను మోసం చేసే కార్యక్రమం జరిగిందని మీ ద్వారా నేను మంత్రి గారికి తెలియజేస్తున్నాను. నేను ఈ విషయాన్నీ మంత్రి గారిని స్వయంగా కలిసి కూడా చెప్పాను. తెలంగాణ రాష్ట్రంలో ముదిరాజ్‌లకు సంబంధించిన పేద ప్రజలు బండ్లు పెట్టుకొని పండ్లు అమ్ముకుంటూ, కూరగాయలను అమ్ముకుంటూ, చేపలను పట్టుకుంటూ ఉంటున్నారు. వారికి కంటిన్యువస్‌గా జీవనోపాధి వచ్చే అవకాశం లేదు. గతంలో రాజశేఖర్ రెడ్డిగారు వీరు బి.సి. డి

గ్రూప్ క్రింద ఉంటే ఈ మత్స్యకారుల స్థితిగతులు మెరుకుపడాలని చెప్పి బి.సి.ఎ కు మార్చాలని అప్పుడు జి.వోను ఇవ్వడం జరిగింది.

**12.40 మ.** బి.సి. కమీషన్‌ని ఇప్పుడు కొత్తగా ఏర్పాటు చేశాము. దానికి ఛైర్మన్‌ని కూడా అపాయింట్ చేయడం జరిగింది. సుప్రీం కోర్టులో ఒక కేసు పెండింగ్‌లో ఉంది, కాబట్టి కమీషన్ ద్వారా అక్కడకు ఒక నివేదికను పంపిస్తే తప్పకుండా మత్స్యకారులకు మేలు జరుగుతుందని మీకు తెలియజేస్తున్నాను. మా దగ్గర ఆనం వెంకటేష్ అనే గంగ పుత్రుడు చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీళ్లల్లో పడి చనిపోవడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఎక్స్‌గ్రేషియా లక్ష రూపాయలు వచ్చింది కానీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే లక్ష రూపాయలు మాత్రం ఇంత వరకు రాలేదు. ఈ సంఘటన జరిగి రెండున్నర సంవత్సరాలు అయిపోయింది. ఈ విషయాన్ని నేనే స్వయంగా కమీషనర్ కార్యాలయానికి వెళ్లి అక్కడ కూడా చెప్పిన విషయం మీ దృష్టికి తీసుకు వస్తున్నాను. మా ప్రక్క నియోజక వర్గం షాద్‌నగర్లో విశ్వనాధరాజు అనే వ్యక్తి చేపల పెంపకంలో మంచి నైపుణ్యం సాధించాడు. అతనితో స్వయంగా మాట్లాడ్డం జరిగింది. అతడు ఇచ్చిన లెక్కల ప్రకారం ఒక ఎకరం భూమిలో రూ.25 లక్షలు పెట్టుబడి పెడితే సంవత్సరం లోపే రూ.12.5 లక్షల ఆదాయం వస్తుంది. రెండు సంవత్సరాల్లో రూ.25 లక్షలు వస్తాయి. ఈ మంచి స్కీమ్‌ను విశ్వనాధరాజు గారు ప్రారంభించారు.

ఈ 6,7 తేదీల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి అగ్రికల్చర్ సెక్రటరీ గారు పర్సనల్‌గా వచ్చి గుండేడు గ్రామం లోని బాలానగర్ మండలంలోని షాద్‌నగర్ లోని రీ సర్క్యులేటరీ ఆక్వా కల్చర్ పద్ధతిని పర్యవేక్షిస్తారు. జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాల్లో ఈ పద్ధతిని పెట్టాలని తక్కువ నీరు, తక్కువ స్థలంలో సేంద్రియ పద్ధతిలో ఎక్కువ చేపలను పెంచే ప్రక్రియ, రసాయనాల వినియోగం లేకుండా సేంద్రియ ఆర్గానిక్ చేపల పెంపకం, చెరువుల్లో కుంటల్లో బదులుగా ఇళ్లల్లోనే చిన్న స్విమ్మింగ్ పూల్ మాదిరిగా వాటర్ ట్యాంక్ నిర్మించుకొని చేపలను పెంచే ప్రక్రియ, చేపల వ్యర్థాలున్న నీరును ఎప్పటికప్పుడు కూరగాయల మొక్కల పెంపకం ద్వారా శుద్ధి చేసి ఆ నీరును తిరిగి చేపల ట్యాంకులోకి పంపు చేయడం ఇది రీ సర్క్యులేటింగ్ ఆక్వా కల్చర్ సిస్టమ్ ప్రత్యేకత. ఈ టెక్నాలజీ ద్వారా సేంద్రీయ పద్ధతిలో చేపల పెంపకం తోపాటు సేంద్రియ కూరగాయల సాగు కూడా సాధ్యమవుతుంది. కలుపు, ఎరువులు, లేబర్ కొరత వంటి సమస్యలు లేకుండా సులువుగా ఈ రీ సర్క్యులేటింగ్ ఆక్వా కల్చర్ సిస్టమ్‌ని అమలు చేయవచ్చు. ఈ అధునాతన చేపల పెంపకం విధానాన్ని షాద్‌నగర్ సమీపంలో బాలానగర్ వద్ద ప్రోగ్రెసివ్ ఫార్మర్స్ భూపతి రాజు రామక్రిష్ణం రాజు అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో గిఫ్ట్ అనే ఒక రకం చేప కూడా ఉంది. కొర్రమట్టలను కూడా అక్కడ పెంచడం జరుగుతోంది. విశ్వనాధ రాజుకు మన రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ చేపల రైతు అవార్డు కూడా ఇచ్చింది. వివిధ రాష్ట్రాలు దేశాల నుంచి వచ్చే వారు ఆయన ఫామ్ హౌజ్‌కు వెళ్లి ఆయన నిర్వహిస్తున్న విధానాన్ని పరిశీలిస్తున్నారు. మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి గారు ఇంకా చాలా మంది అక్కడకు వెళ్లి విజిట్ చేసి వచ్చారు.

కేంద్రం ఇచ్చే సబ్సిడీతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా సబ్సిడీని ఇచ్చి రీ సర్క్యులేటింగ్ ఆక్వా సిస్టమ్‌ను ప్రోత్సహించాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. పాలీ యోజనకు పెద్ద ఎత్తున సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహిస్తామంటున్న ప్రభుత్వం ఈ విధానానికి కూడా రాయితీలు, సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహిస్తే నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కలగడమే కాకుండా తెలంగాణ ప్రజలకు చేపలను అందుబాటులోకి తీసుకు రావడానికి వీలవుతుంది. చేపల సాగు అంటే సముద్ర తీరం, నదులు, చెరువులు, కుంటలు, బావులు ఉండాలనేది ఒకప్పటి విధానము. ఇందుకు భిన్నంగా కేవలం నాలుగైదు వందల గజాల్లోనే ఈ రీ సర్క్యులేటింగ్ ఆక్వా కల్చర్ సిస్టమ్ ద్వారా నగర ప్రాంతాలకు కూడా శ్రేష్టమైన చేపల పెంపకాన్ని చేపట్టవచ్చని రుజువైంది. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ఈ కల్టివేషన్ను ప్రోత్సహించడానికి నిధులు కేటాయించి సబ్సిడీలు ఇస్తే తెలంగాణ నగరం పట్టణాల్లో కూడా ఈ చేపల పెంపకం విజయవంతం అవుతుందనే విషయాన్ని మీ దృష్టికి తీసుకువస్తున్నాను. ముఖ్యంగా మనకు అతి ముఖ్యమైన వనరు అయినటువంటి నీళ్లు చాలా తక్కువ మోతాదులో ఉన్నాయి. సకాలంలో వర్షాలు పడకపోవడం వల్ల ఎవరైతే రైతులు చేపల పెంపకం వృత్తి మీద ఆధారపడి ఉంటున్నారో అలాంటి వారి జీవనోపాధి కష్టాల్లో పడుతోంది. రీ సర్క్యులేటింగ్ ఆక్వా కల్చర్ విధానం ద్వారా తక్కువ నీళ్లతో కంట్రోల్డ్ ఎన్విరాన్‌మెంట్ లోపల సోలార్ సిస్టమ్ కూడా ఏర్పాటు చేసి రీ సర్క్యులేటెడ్ సిస్టం ద్వారా పాత నీళ్లు పోయి కొత్త నీళ్లు వస్తూ, ఆక్సిజన్ ద్వారా చేపలకు మంచి వాతావరణం ఏర్పాటు చేయడం వల్ల దాని బరువు పరిమాణం పెరిగి, పెద్ద ఎత్తున ఉండే చేపలు వస్తాయి.

క్యాట్ ఫిష్ విషయానికి వస్తే, పౌల్ట్రీ ఫామ్స్‌లోని వ్యర్థాలను, పశువుల వ్యర్థాలను తీసుకు వెళ్లి చాలా ప్రాంతాలలో ఈ క్యాట్‌ఫిష్‌ను పెంచుతున్నారు. ఇది ఆరోగ్యానికి హానికరం కాబట్టి దీని పెంపకాన్ని నిరోధించాలి. ఉస్మానియా యూనివర్సిటీలో కూడా దీని మీద పరిశోధన చేసి జీవ రాశులకే ఇది విషపు పరిణామంగా మారుతోంది కాబట్టి దీన్ని బ్యాన్ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. నేను

కోరుకునేది ఒకటే మనం చెరువుల్లో వదిలే చేప పిల్లలను ఇంకా రెండింతలు గ్రామాల్లోని చెరువుల్లో వదలాల్సిన అవసరం ఉంది. పేదలకు తక్కువ సమయంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే వ్యాపారం ఏదన్నా ఉందంటే అది కేవలం చేపల పెంపకం మాత్రమే. చేపల ఉత్పత్తి కేంద్రాలేవైతే ఉన్నాయో వాటిని సంఘాలకు ఇవ్వాలి. గ్రామాలలో ఉన్న మత్స్య పరిశ్రమ సంఘాల ద్వారానే చేప పిల్లలను ఉత్పత్తి చేసే విధంగా ఉండాలి. ఉదాహరణకు మా పరిగి నియోజకవర్గంలో లక్నాపూర్ ప్రాజెక్టు ఉంది. ఆ లక్నాపూర్ ప్రాజెక్టు దగ్గర ఈ చేపల పెంపకం ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసి మత్స్యకారుల సంఘాలను ప్రోత్సహించాలని నేను మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**శ్రీ కౌసర్ మొహియుద్దీన్ (కార్వాన్): –** అధ్యక్షా, మత్స్యకారుల విషయం మీద మంత్రి గారు కొన్ని సూచనలు ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో 74 రిజర్వాయర్లు, 434 సాగునీటి చెరువులు ఉన్నాయి. మత్స్యకారులకు సంబంధించి కొన్ని కులాలకు చెందిన వారున్నారు, వీరిలో మైనారిటీ కులానికి చెందిన మత్స్యకారులు కూడా ఉన్నారు. వారిని గుర్తించి ప్రభుత్వం ఎటువంటి రాయితీ ఇస్తుందో చెప్పాలి. మత్స్యకారులకు సంబంధించి ప్రాంతాల వారిగా ఎంత మంది ఉన్నారు, వారిలో ఎంత మంది మైనారిటీలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారో చెప్పాలి. "రాష్ట్రీయ కృషి వికాస్ యోజన జాతీయ వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి బోర్డు" ద్వారా వెనుకబడిన ప్రాంతంలో గ్రాంటు నిధి, వ్యవసాయ మార్కెట్ కమిటీ క్రింద రాష్ట్రంలో 33 రీటేల్ చేపల మార్కెట్లున్నాయని మంత్రి గారు వివరించారు. మత్స్యకారులకు ప్రమాదం సంభవించి ఒక వేళ మరణిస్తే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే లక్ష రూపాయల ఎక్స్‌గ్రేషియా ద్వారా మైనారిటీలకు చెందిన ఎంత మందికి లబ్ధి చేకూరిందో వివరించండి.

సబ్సిడీని పొందే చేపల మార్కెట్లు గ్రామ పంచాయితీలో మండల పంచాయితీలో ఎన్ని ఉన్నాయి. అలా గుర్తించిన వాటిలో ఏదైనా మైనారిటీలకు కల్పించే అవకాశం ఆలోచన ప్రభుత్వానికి ఉందా? జంట నగరాల్లో కూడా ప్రత్యక్షంగా చేపల మార్కెట్లు ఏర్పాటు చేస్తున్నారా? అలాగే మత్స్యకారుల పరిశ్రమ అభివృద్ధి కొరకు జంట నగరాల్లో కాలువలు ఎక్కడున్నా ఏర్పాటు చేస్తున్నారా? దశాబ్దాల చరిత్ర గల గంగపుత్రులు బెస్త వాళ్లు వారి ఉనికిని కోల్పోతున్నారు. చెరువుల క్రింద పొలాలు ఉండడంతో మార్చి నెల ముందు చేపల వేట చేయొద్దని గ్రామస్థుల నుంచి వ్యతిరేకత వస్తోంది. చేపల వేట మార్చి నెల మొదలైనా జూన్ 30 వరకు మాత్రమే చేయాల్సిందిగా జూలై నుంచి కొత్త కౌలు రకము అమలౌతుందని ఆ సమయంలో మత్స్యకారులను చేపలను పట్టనీయరు. వివక్షకు గురౌతున్న గంగ పుత్ర, బెస్త, గండ్ల కులస్తుల న్యాయమైన డిమాండ్లను శాసన సభ పక్ష నాయకులకు మీ ద్వారా వినిపిస్తున్నాను.

جناب ٹی ہریش راو (Janab T.Harish Rao): اسپیکر صاحب! ہمارے کوثر محی الدین صاحب کو میں مبارکباد پیش کرنا چاہتا ہوں کہ انہوں نے آج بہت اچھی صاف تلگو میں بات کی۔ میں بھی 12-13 سال سے اسمبلی میں ہوں، ابھی تک MIM کے کسی MLA کو تلگو میں بات کرتے ہوئے نہیں سنا۔ پہلی بار بہت اچھی صاف اردو میں present کرنے کے لئے آپ کو اور آپ کی پارٹی کو میں مبارکباد پیش کرتا ہوں۔

جناب کوثر محی الدین (Janab Kausar Mohiuddin): صاحب یہ میری بار ہے۔ میں بھی آپ ہی کے میدک ضلع سے ہوں اور تلگو میڈیم کا ہوں۔

12.50 మ. **శ్రీ జి. కిషన్ రెడ్డి (అంబర్‌పేట) : –** అధ్యక్షా, చేపల పెంపకం, చేపలకు సంబంధించినటువంటి మార్కెటింగ్ గురించి మనం చర్చించుకుంటున్నాము. ఇది చాలా ప్రాధాన్యత కలిగిన సెక్టార్. మన దేశంలో, ఇంతకు ముందు చెప్పినట్లు, ఈ సెక్టార్ ద్వారా పెద్దఎత్తున ఉపాధి కల్పించాలని చర్యలు తీసుకున్నాము. మన దేశంలో ప్రజలకు చేపలు అందుబాటులో ఉండాలని మనం ఒక లక్ష్యాన్ని పెట్టుకున్నాము. ఇటీవల నరేంద్ర మోడీ గారు నీళ్ల క్రాంతి ప్రాజెక్ట్ క్రింద మన దేశంలో సుమారు రూ. 17,199 కోట్ల ఇన్వెస్ట్‌మెంట్‌ను ఈ మత్స్య పరిశ్రమలో పెట్టాలని, అందుకు సంబంధించి కేంద్రప్రభుత్వం ఇప్పటికే వరల్డ్ బ్యాంక్ అదే విధంగా మిగతా ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ సహకారం తీసుకునే ప్రయత్నం చేస్తోంది. దీనికి టార్గెట్ కూడా పెట్టుకున్నారు. 2020 లోపల మన దేశం లక్ష కోట్ల రూపాయల చేపలను ఎక్స్‌పోర్ట్ చెయ్యాలని కేంద్రప్రభుత్వం టార్గెట్ పెట్టుకుంది. కేంద్రప్రభుత్వ లక్ష్యంలో మనం కూడా పార్ట్ కావడం కోసం చేస్తున్నటువంటి ప్రయత్నం చాలా మంచి పరిణామం అని ప్రభుత్వానికి మనవిచేస్తున్నాను. కేంద్రప్రభుత్వం, నేషనల్ బ్యాంక్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ద్వారా, నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా, వరల్డ్ బ్యాంక్ ద్వారా, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ద్వారా నిధులు తీసుకొని, ఈ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ అన్నింటినీ ఫిషరీస్‌కి సంబంధించిన డెవలప్‌మెంట్‌లో భాగస్వాములను చేస్తున్నది. చేపల ఎక్స్‌పోర్ట్ విషయంలో మన దేశంలో ఏ రకమైన రిసోర్సెస్ ఉన్నాయి, ఏ రకమైన చేపలను డెవలప్ చెయ్యాలి, విదేశాలలో ఏ రకమైన మార్కెట్ ఉంది, క్వాలిటీ ఎలా

ఉంది, ఎంత క్వాలిటీని ఎక్స్‌పోర్ట్ చెయ్యాలి అనే విషయాల గురించి కేంద్రప్రభుత్వం ఆలోచిస్తోంది. 2020 లోపల లక్ష కోట్ల చేపలను ఎక్స్‌పోర్ట్ చేయాలని కేంద్రప్రభుత్వం టార్గెట్ పెట్టుకుంది కాబట్టి మనం కూడా ఆ టార్గెట్‌ను రీచ్ కావడానికి సహకరించాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాము. మన రాష్ట్ర ప్రభుత్వం కూడా పెద్దఎత్తున చేపలకు సంబంధించిన సీడ్‌ను అనేక చెరువులు, కుంటలలో వేయడం జరుగుతోంది. ఒక రూపాయికి ఒక పిల్ల చొప్పున తీసుకొచ్చి వేశారు. ఇంకా కొంత ప్రయత్నం చేసినట్లయితే ఆ కాస్ట్ తగ్గే అవకాశం ఉంది. గతంలో మన రాష్ట్రంలో సొసైటీలకు డబ్బు ఇచ్చి చేపల పెంపకాన్ని ప్రోత్సహించేవారు. ఈరోజు సొసైటీలను కాదని మనమే చేప పిల్లలను తీసుకొచ్చి చెరువులలో వేస్తున్నాము. రానున్న రోజులలో ఆ యొక్క చేప పిల్లల కాస్ట్‌ను తగ్గించడానికి ప్రయత్నం చేయాలి. ఒకొక్క చేప పిల్ల యాభై పైసలకు వచ్చే అవకాశం ఉంది. ఆ విధంగా మనం ప్రయత్నం చెయ్యాలి. మనం తెచ్చుకున్నటువంటి సీడ్ నాణ్యత విషయమై కూడా ఒకసారి ప్రభుత్వం ఆలోచించాలి. సీడ్ నాణ్యతతో ఉంటే అభివృద్ధి కూడా బాగుంటుంది. దాని గురించి కూడా ప్రభుత్వం రానున్న రోజుల్లో చెయ్యాలి. చేపలకు ఇంజక్షన్స్ ఇచ్చి పెద్ద చేపల లాగ తయారుచేస్తున్నారు. ఈ విషయం గురించి ఆలోచించాలి. ఇతర ప్రాంతాల మీద ఆధారపడకుండా మనకు కావలసిన సీడ్‌ను మన ప్రాంతంలో ఉత్పత్తి చేసుకునే విధంగా ప్రయత్నం చెయ్యాలి. మనకు అనేక సాగునీటి ప్రాజెక్టులున్నాయి. సాగునీటి ప్రాజెక్టుల దగ్గర, ఇతర ప్రాంతాలలో సీడ్ ఉత్పత్తి కేంద్రాలను డెవలప్ చేస్తే చాలా ఉపయోగంగా ఉంటుంది. నాగార్జునసాగర్, శ్రీశైలం, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులే కాకుండా ఇతర ప్రాంతాలలో సీడ్ డెవలప్ చేస్తే బాగుంటుంది. డెడ్ స్టోరేజ్ నుండి సీడ్‌కు కావలసిన వాటర్‌ను మనం తీసుకోడానికి అవకాశం ఉంది. ఎండా కాలంలో సీడ్‌ను ఉత్పత్తి చేసినట్లయితే వర్షా కాలంలో వర్షాలు వచ్చినప్పుడు సీడ్‌ను ఆయా ప్రాంతాలను పంపడానికి అవకాశం ఉంటుంది. ఈ విషయమై ప్రభుత్వం ఆలోచించాలి. అదే విధంగా కొత్త సొసైటీలను ఏర్పాటు చేయవలసిన అవసరం ఉంది. చాలా సొసైటీలకు సంబంధించిన దరఖాస్తులు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. అధునాతన మార్కెటింగ్ ఫెసిలిటీస్ కల్పించవలసిన అవసరం ఉంది. మార్కెట్‌లలో ఎక్కడైనా చేపలు అమ్ముతుంటే చాలా దుర్వాసన వస్తుంది. ఆధునిక పద్ధతులలో చేపల మార్కెట్ ఉందని తెలియజేసే విధంగా చేపల మార్కెటింగ్ సెంటర్స్‌ను డెవలప్ చేయవలసిన అవసరం ఉంది. మెదక్, రంగారెడ్డి జిల్లాలలోని చెరువులను అదే విధంగా హైదరాబాద్‌లో దుర్గం చెరువు, సరూర్‌నగర్, సఫిల్‌గూడ, రామచంద్రాపురం లోని చెరువులను అభివృద్ధి చేయడం జరిగింది. ఇప్పుడు ఆ చెరువుల్లో డ్రైనేజ్‌ను వదులుతున్నారు. ఆ చెరువుల్లో చేపల పెంపకం పూర్తిగా తగ్గిపోయింది. గతంలో కూడా మనం ఈ చెరువులను అనేక రకాలుగా అభివృద్ధి చేసే ప్రయత్నం చేశాము. నెదర్లాండ్ సహకారంతో హైదరాబాద్‌లోని చెరువులను ఆధునీకరించాము. ఆ చెరువుల్లో ఇప్పుడు డ్రైనేజ్ కలుస్తోంది. కాబట్టి డ్రైనేజ్‌ని వదలకుండా, ఫిషరీస్, ఇరిగేషన్ , టూరిజం, జీ.హెచ్.ఎం.సీ. డిపార్ట్‌మెంట్స్ సహకారంతో ఆయా చెరువులలో చేప పిల్లలను పెంచే ప్రయత్నం చేసి చేపలను ఉత్పత్తి చేస్తే చాలా మందికి ఉపయోగం కలుగుతుంది. ఆ విషయం గురించి ప్రభుత్వం ఆలోచించాలి. ఎట్టి పరిస్థితులలో చెరువుల్లో డ్రైనేజ్ వదలకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలి. స్థానిక సంస్థలకు ఆర్థిక సహకారం అందించినా చేపల ఉత్పత్తి పెంచుకుంటే బాగుంటుందని మీ ద్వారా మంత్రి గారికి తెలియజేస్తున్నాను. చాలా మందికి ఉపాధి అవకాశాలు పెరుగుతాయి కాబట్టి చెరువులను రక్షించాలి. మిషన్ కాకతీయ క్రింద చెరువులు తవ్వాము. ఆయా చెరువుల్లో చేపలు పెంచాలంటే, చెరువుల మధ్యలో డెప్త్ ఎక్కువగా ఉండాలి. డెప్త్ ఎక్కువగా ఉంటే చేపలను పెంచడానికి చెరువులు ఉపయోగపడతాయి. చెరువుల్లో డెప్త్ పెంచే విధంగా ప్రయత్నం చెయ్యాలి. ఆ విధంగా చేస్తే చేపలు ఎక్కువగా పెరగడానికి అవకాశం ఉంటుంది. రైతుబజార్లున్నాయి. రైతు బజార్లలో చేప పిల్లలను పెడతాము. కేంద్రప్రభుత్వం సుమారు రూ. 2900 కోట్లతో ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆధ్వర్యంలో కోల్డ్‌స్టోరేజ్‌లను ఏర్పాటు చేస్తుంది. మనం కూడా ఆ సంస్థ నుండి రుణం తీసుకొని కోల్డ్‌స్టోరేజ్‌లను పెట్టవలసిందిగా మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. కలకత్త లాంటి ప్రాంతాలకు మన దగ్గర నుండి చేపలు వెళ్తున్నాయి. దానిని దృష్టిలో పెట్టుకొని లోకల్ మార్కెటింగ్‌కి సరైన సౌకర్యాలు కల్పించవలసిన అవసరం ఉంది.

**1.00 మ.** అదే విధంగా ఇంతకు ముందు మంత్రిగారు చెప్పినట్లుగా కేంద్ర ప్రభుత్వం సుమారు 14 కోట్లు మన రాష్ట్రానికి సహకారం అందించింది. చేపల ఎగుమతులను పెంచడంలో మనం అనేక రకాల చర్యలు తీసుకోవలసిన అవసరమున్నది. పెద్ద పెద్ద చెరువులలో చేపలు పట్టడానికి లోపలికి వెళ్లినప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి. కాబట్టి ఇన్సూరెన్స్ కింద కేంద్ర ప్రభుత్వం 50 శాతం, మన రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం ఇచ్చే స్కీం కింద గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కావచ్చు, అదే విధంగా సేవింగ్ కమ్ రిలీఫ్

కావచ్చు, హౌసింగ్ కావచ్చు, ట్రైనింగ్ కావచ్చు వీటన్నింటిని కూడా మత్స్యకారులకు అందించాల్సిన అవసరమున్నది. ఈ విషయంలో ప్రభుత్వం మరింత సమర్థవంతంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరమున్నది. మత్స్యకార సంఘాల గురించి రూలింగ్ పార్టీకి మనవి చేస్తున్నాను. మత్స్యకార సంఘాలలో రూలింగ్ పార్టీకి అనుకూలంగా ఉన్న వారిని ప్రోత్సహిస్తూ ఇతర మత్స్యకారుల సంఘాలను డిస్కరేజ్ చేస్తున్న పరిస్థితి ఉన్నది.

(అధికారపక్ష సభ్యుల నుంచి అంతరాయం)

నేను చెప్పేదేమిటంటే రాజకీయ జోక్యం ఉండకుండా ఆ వృత్తిమీద ఆధారపడిన వాళ్లందరినీ ఒకే రకంగా ప్రోత్సహిస్తే బాగుంటుందని కోరుతున్నాను.

హోల్‌సేల్ మార్కెట్లు రిటైల్ మార్కెట్లను అభివృద్ధి చేయాల్సిన అవసరమున్నది. వీరికి ప్రభుత్వం తరఫున ట్రైనింగ్‌నిచ్చే ప్రయత్నం చేయాలని కోరుతూ, చేప పిల్లగా ఉండే దశ నుంచి పూర్తిస్థాయి ఎదుగుదల వరకు అన్ని రకాల సహాయ సహకారాలను ఈ ప్రభుత్వం అందించాలి. మత్స్యకారులకు ఎక్స్‌పోర్టుకు సంబంధించిన శిక్షణను ఇవ్వడం గురించి ప్రభుత్వం మరింతగా దృష్టికేంద్రీకరించి చేప ఉత్పత్తులలో మన తెలంగాణ రాష్ట్రం, భారత ప్రభుత్వం చేస్తున్న ప్రోత్సాహంలో భాగంగా మనం కూడా అగ్రగామిగా ఉండాలి. గతంలో సముద్రం ఉన్న దగ్గరనో, నదులు ఉన్న దగ్గరనో, పెద్ద పెద్ద చెరువులు ఉన్న దగ్గరనో చేపల ఉత్పత్తి జరిగేది. అక్కడి నుంచి ఎక్స్‌పోర్టు అయ్యేవి. చెరువులలో పెరిగే చేపలకు మనం ఫీడ్ వేయాల్సిన అవసరం లేదు. న్యాచురల్ ఫీడ్ తింటాయి కాబట్టి ఆ చేపలు చాలా రుచిగా ఉంటాయి, వాటికే డిమాండ్ కూడా ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఆ రకమైన చేపల మీద దృష్టి కేంద్రీకరించి సహజమైన చెరువులలో చేపలను పెంచాల్సిన అవసరమున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు పోషకాహారం కోసం నెలకొకసారి గుడ్డు ఇస్తున్నాం, అదే మాదిరిగా చేపలను కూడా వారానికొకసారో నెలకొకసారో ఇచ్చే ప్రయత్నం ప్రభుత్వం తరఫున చేసినట్లైతే అటు మత్స్యకారులకు ఉపయోగకరంగా ఉంటుంది ఇటు పేద ప్రజలకు కూడా సహాయం చేసినట్లవుతుందని చెబుతూ నేను పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం మరింత సమగ్రమైన కార్యాచరణ రూపొందించి మన రాష్ట్రంలో కూడా చేపల ఉత్పత్తికి అన్ని కులాలను భాగస్వాములను చేయాల్సిన అవసరమున్నది. ట్రెడిషనల్‌గా వస్తున్న ఏ ఒక్క కులానికి కూడా అన్యాయం జరగకుండా చూడాల్సిన అవసరమున్నది కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ ఆర్. కృష్ణయ్య:-** అధ్యక్షా, వ్యవసాయం, పాడిపరిశ్రమ తరువాత మత్స్య పరిశ్రమకు సంబంధించిన చేపల ఉత్పత్తి, వాటి పెంపకం గురించి ప్రత్యేకంగా బెస్త, గంగపుత్ర, ముదిరాజ్ తదితర కులాలకు జీవనోపాధి కలిగిస్తుంది. చేపలు చాలా పౌష్టికాహారం. రాష్ట్ర ప్రభుత్వం కొర్రమీనును రాష్ట్ర చేపగా గుర్తించింది. మనకు ఇతర దేశాల మాదిరిగా సముద్రతీర ప్రాంతం లేకున్నా మన దేశంలో కూడా అనేక రాష్ట్రాలకు సముద్రతీర ప్రాంతం ఉన్నప్పటికీ మనకు ఇటీవల ప్రభుత్వం చేపట్టిన కాకతీయ మిషన్ ద్వారా చేపట్టిన చెరువుల పునరుద్ధరణ గానీ, లేదంటే ఇటీవల కురిసిన వర్షాల వల్ల గానీ ప్రభుత్వం ఈసారి చేప పిల్లలను చెరువులలో వదలడం మూలంగా మత్స్య పరిశ్రమను అభివృద్ధి చేయడానికి చాలా మంచి అవకాశాలు ఏర్పడ్డాయి. ఈ సందర్భంగా ప్రభుత్వానికి కొన్ని ముఖ్యమైన సూచనలివ్వదల్చుకున్నాను.

చేపలను ఉత్పత్తి చేయడం, వాటిని మార్కెటింగ్ చేయడం గురించి కొన్ని సంస్కరణలను చేపట్టాల్సిన అవసరమున్నది. ఉత్పత్తిలో వేలు రకాలైన చేపలను ఉత్పత్తి చేయాల్సిన అవసరమున్నది. ఎందుకంటే కొన్ని రకాల చేపలు మార్కెట్లో అందుబాటులో ఉండటం లేదు. కాబట్టి కొర్రమీను, దానికి సంబంధించిన రిలేటెడ్ బురదకంశ వంటి చేపలను ప్రోత్సహిస్తే అవి ఆరోగ్యవంతమైనవి, ప్రజలు కూడా వాటిని ఎక్కువ కొనడానికి అవకాశముంటుంది. రెండవది మన దగ్గర చేపల ఉత్పత్తి కేంద్రాలు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 28, ప్రైవేట్ రంగంలో 7 ఉన్నట్లుగా ప్రభుత్వ నివేదికలు చెబుతున్నాయి. కాబట్టి ప్రభుత్వ ఆధ్వర్యంలో కనీసం 150 చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలకు పెంచాల్సిన అవసరమున్నది. అంతే కాకుండా చేపల మీద రీసర్చ్ జరగాలి. అందుకోసం ప్రత్యేకంగా ఒక కాలేజీని ఏర్పాటుచేసి రిలేటెడ్ సబ్జెక్టు మీద ప్రజలకు మంచి అవగాహన కల్పించాల్సిన అవసరమున్నది. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచిస్తున్నాను.

చేపల వృత్తి కొన్ని లక్షల కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తున్నది. ఆ కోణం నుంచే కాకుండా కోట్లాది మంది ప్రజలకు చేపల ద్వారా మంచి న్యూట్రీషియన్ లభిస్తుంది. మాంసం, కోడికూర, కోడిగుడ్లకంటే కూడా చేపకూర మంచిదని డాక్టర్లు చెబుతున్నారు. ఎటువంటి రోగం ఉన్నా చేపకూర తినొచ్చని డాక్టర్లు చెబుతున్నారు. కాబట్టి చేపల ఉత్పత్తి మరియు వాటి వాడకం గురించి ప్రచారం బాగా చేయాలి. కోడిగుడ్డుకు జరిగినంత ప్రచారం చేపలకు జరగడం లేదు. కోడిగుడ్డు మంచి పుష్టికరమైన ఆహారమని పాఠ్యపుస్తకాలలో

ముద్రించారు. చేపల గురించి కూడా పాఠ్య పుస్తకాలలో ఒక సబ్జెక్టు పెడితే చేపల గురించి ప్రజలకు అనవగాహన పెరిగే అవకాశముంటుంది.

చేపలను వాడుకునేందుకు చేస్తున్న మార్కెటింగ్ సదుపాయమేమిటంటే మార్కెట్‌లో ఉత్పత్తిదారులు దోపిడీకి గురవుతున్నారు. చేపల చెరువుల దగ్గర కిలో చేపలు రూ.40కి తీసుకుంటే వాటిని అమ్మే దగ్గర రూ.50, కొర్రమీను అయితే కిలో రూ.600 అంటే ఉత్పత్తిదారుడేమో దోపిడీకి గురవుతున్నాడు, మధ్య దళారులు లాభపడే ప్రక్రియ కొనసాగుతున్నది. దీనిని అరికట్టడానికి ప్రభుత్వపరంగా కొన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరమున్నది. అదే విధంగా చేపల ఉత్పత్తి అనేది కేవలం మార్చి, ఏప్రిల్, మే మాసాలలో ఎక్కువ సరఫరా అవుతాయి కాబట్టి వృథా అయ్యే అవకాశమున్నందున చేపల నుంచి బై ప్రొడక్ట్స్‌ను కూడా తయారుచేయాలి. ఎలాగంటే ఆస్ట్రేలియాలో ఎండు చేపలను అమ్ముతారు. మిషినరీలలో పచ్చి చేపలను పెట్టి మంచి ఫిష్ ఆయిల్‌ను తయారు చేస్తారు. ఇది అనేక రోగాలకు మేలు చేస్తుంది. మన దగ్గర కూడా చేపల ఉత్పత్తి ఎక్కువగా వచ్చే టైంలో బై ప్రొడక్ట్స్‌ను తయారుచేయడానికి ప్రభుత్వం తరపున కొంత రీసర్చ్ జరిగి విదేశాలలో ఏ విధమైన ప్రక్రియ ఉన్నదో ఫిష్ ఆయిల్ తయారు చేయడం, ఎండు చేపలను తయారు చేయడం, చేపలు చెడిపోకుండా ఉండటం కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలి.

రెండవది చేపలు అమ్మేవారికి లైవ్ ఫిష్‌స్టాల్ పెట్టాలి. ఎందుకంటే కొంతమంది చనిపోయిన చేపలను తినరు. కాబట్టి హైదరాబాదులో ఫిషరీస్ కార్పొరేషన్ ద్వారా లైవ్ ఫిష్‌స్టాల్‌ను ఏర్పాటుచేసి ఆ లైవ్ ఫిష్‌స్టాల్స్‌లో చేపలను అమ్మే పద్ధతిని ప్రోత్సహించడంతోబాటు దానికి సబ్సిడీనివ్వాలి. హైదరాబాదులో బేగంబజార్, ముషీరాబాద్ మార్కెట్, ఎల్.బినగర్‌లలో ఒక్కటే ఏరియాలో ఉండటం వలన ఉపయోగకరంగా లేవు. అందుకే ప్రజలు ఎక్కడెక్కడ ఉంటారో అక్కడ లైవ్ ఫిష్ స్టాల్స్‌ను ఏర్పాటు చేయడంతోబాటు మార్కెటింగ్ సౌకర్యాలను మెరుగుపర్చే పద్ధతుల ద్వారా వినియోగదారులకు అందే విధంగా మరియు ఫిష్‌స్టాల్స్‌ను ఎంకరేజ్ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే మరింత ఉపయోగకరంగా ఉంటుంది. ఎందుకంటే ఈ అంశం కోట్లాది మందికి ఉపయోగపడేది.

**1.10 మ.** ఫిషరీస్ కార్పొరేషన్‌పై ప్రభుత్వానికి ఉన్న సంకల్పాన్ని ప్రశంసిస్తున్నాను. దీనిని ప్రజలకు మరింత చేరువగా వచ్చేట్లు, వినియోగదారులకు ఉపయోగపడేటట్లు, ఉత్పత్తిదారునికి, వినియోగదారునికి మధ్యన ఎక్కువ దోపిడి లేకుండా, తక్కువ మార్జిన్‌లోనే చేపలు అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉన్నది. మత్స్య పరిశ్రమను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున కేటాయించిన 100 కోట్ల రూపాయలకు అదనంగా, కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్‌ని తీసుకొని మరిన్ని చర్యలు తీసుకున్నట్లైతే మత్స్య పరిశ్రమకు చేయూతనిచ్చిన వారమౌతాము. ప్రభుత్వ పరంగా ఐస్ సప్లై చాలా తక్కువగా ఉంది. చేపలను సరిగా నిల్వచేయనట్లైతే పాడైపోవడం జరుగుతుంది. ఎంతో కష్టపడి ఉత్పత్తి చేసిన చేపలు వృధాగా పోకుండా డీప్ ఫ్రిజ్‌లలో పెట్టడానికి కావాల్సిన ఫ్రిజ్‌లను, ఐస్‌ను ఎక్కువగా సప్లై చేసే దిశగా ప్రభుత్వం ఆలోచించాలని సూచిస్తున్నాను. చేపల బై ప్రొడక్ట్స్, ఎండు చేపలు, ఫిష్ ఆయిల్ తయారు చేయడానికి ప్రభుత్వ పరంగా లోతుగా అధ్యయనం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

**శ్రీ సున్నం రాజయ్య:** – అధ్యక్షా, మత్స్య సంపద గురించి మాట్లాడే అవకాశాన్ని కల్పించినందుకు ధన్యవాదములు. రాష్ట్రంలోని గ్రామాల్లో, పట్టణాల్లో ఈ వృత్తిని నమ్ముకొని 10 లక్షల మత్స్య కుటుంబాలు, 3650 మత్స్య సొసైటీలు ఉన్నాయి. వీరి కోసం ఇప్పటికే అనేక ప్రాజెక్టుల్లో, చెరువుల్లో వదిలిన చేప పిల్లలను కూడా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. హైదరాబాద్ నగరంలో కోటి జనాభ ఉన్నది. హైదరాబాద్‌లో నాలాల, ఫుట్‌పాత్‌ల మీద చేపలు అమ్ముకుంటున్న పరిస్థితి ఉంది. ఇక్కడ సరైన ఫిష్‌మార్కెట్ లేదు. మొండా మార్కెట్, బేగం బజార్‌లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రతి కార్పొరేషన్, డివిజన్ పరిధిలో ప్రత్యేకంగా ఒక చేపల మార్కెట్‌ను పెడితే కొనుగోలు దారులకు, అమ్మకందారులకు మంచి ఉపయోగం ఉంటుంది. మత్స్య రంగానికి కేటాయించిన 100 కోట్ల రూపాయల్లో ఇప్పటివరకు 30 కోట్లను మాత్రమే విడుదల చేయడం జరిగింది. ఇంకా మిగిలిన మొత్తం డబ్బులను ఈ రెండు నెలల కాలంలో ఖర్చు పెడితేనే వారికి ఉపయోగకరంగా ఉంటుంది.

మండల, నియోజకవర్గ కేంద్రాల్లో ప్రత్యేకంగా ఫిష్‌మార్కెట్ ఉండాలి. భద్రాద్రి నియోజకవర్గంలోని తాలిపేరు, పాలెం వాగుల్లో శాసనసభ సమావేశాల ముందరనే చేప పిల్లలను వదలడం జరిగింది. ఇక్కడ పూర్తిగా గిరిజనులే వీటిపై ఆధారపడి ఉన్నారు. గిరిజనులకు కావాల్సిన పనిముట్లు, వలలు, ట్రాన్స్‌పోర్ట్ అందించాల్సిన అవసరం ఉన్నది. దీంతోబాటు ఈరోజు వరకూ ఉన్న బకాయిలను చెల్లించాల్సిన అవసరం ఉన్నది. మత్స్యకారులికిచ్చే ఎక్స్‌గ్రేషియాను రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలి. వేటకు వెళ్లినప్పుడు

జరిగే ప్రమాదాల నష్ట నివారణకు, వారి కుటుంబాలకు ఆ విధంగా ఎక్స్‌గ్రేషియా చేయాల్సిన అవసరం ఉంది.

( బెల్)

మత్స్యకారులను ఆదుకోవడానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి. మిషన్ కాకతీయ ద్వారా చేపట్టిన చెరువుల్లో చేప పిల్లలను వదిలి, గంగపుత్రులను, ముదిరాజ్‌లను, వాడ బలిజలను ఈ వృత్తిని నమ్ముకున్న వారికి రక్షణగా ఉండేందుకు, అనేక రకాల చర్యలను చేపట్టాల్సి ఉంది. వీరికి ఏ ఇతర ఆధారం కూడా లేదు. ప్రతి నెల వీరికి వెయ్యి రూపాయల పింఛన్‌ను ఇవ్వాల్సిన అవసరం ఉన్నది. వ్యవసాయేతర పరిశ్రమలేవి వీరికి లేనందున వీరికి మేలు చేయడానికి ప్రభుత్వం పూనుకోవాలని కోరుతున్నాను.

**శ్రీ కె. చంద్ర శేఖర్ రావు (ముఖ్యమంత్రి):–** అధ్యక్షా, చాలా ముఖ్యమైన అంశంగా బిఎసిలో మాట్లాడుకున్నప్పుడు తమరు అనుమతించారు. ఆరోజు మంత్రి గారు స్టేట్ మెంట్ ఇచ్చారు. గౌరవ సభ్యులు రామ్‌మోహన్ రెడ్డి గారు, కిషన్ రెడ్డి గారు, ఆర్. కృష్ణయ్య గారు, కౌసర్ మోయినుద్దీన్ గారు, సున్నం రాజయ్య గారు చర్చలో పార్టిసిపేట్ అయి తమ సూచనలు, సలహాలు చెప్పారు. ఇది మన రాష్ట్రానికి సంబంధించిన చాలా ప్రధానమైన సబ్జెక్టు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఈ రాష్ట్రానికి ఒక జీవిక ఏర్పడాలి. గతంలో మనం ఎప్పుడు రాష్ట్రంగా లేము. ఇప్పుడు రాష్ట్రంగా అవతరించాము, Telangana should have its own livelihood, ఈ రాష్ట్రానికి ఒక జీవిక ఏర్పడాలి. ఈ విషయమై నేను అన్ని రంగాలకు సంబంధించిన అనేక మంది మేధావులతో, శాస్త్రవేత్తలతో, సీనియర్ అధికారులతో, బ్యూరోక్రాట్స్‌తో, ఆర్థిక శాస్త్రవేత్తలతో చర్చోపచర్చలు జరిపాము, ఇంకా కూడా కొన్ని చర్చలు జరుగుతున్నాయి.

కొత్తగా ఏర్పడిన రాష్ట్రానికి పరిపుష్టమైన చక్కటి భవిష్యత్తు మార్గనిర్దేశంతో కూడిన జీవిక ఏర్పడాలంటే అందుకు పటిష్టమైన పునాది, పరిశ్రమ అయ్యే ప్రయత్నాలు పకడ్బందీగా జరిగితేనే తప్ప సాధ్యం కాదు. తొందరపాటు, తత్తరపాటుతో కాకుండా, దీర్ఘంగా ఆలోచించి సాధ్యాసాధ్యాలు పరిశీలించి, మనకు ఉన్న ఆర్థికవనరులను అర్థం చేసుకొని ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా ప్రణాళిక రచన చేస్తోంది. దానిలోభాగంగా ఇది ప్రధానమైన సబ్జెక్టని మిమ్మల్ని రిక్వెస్ట్ చేయడం జరిగింది. ఈ విషయాన్ని నేను విమర్శ కోసం చెప్పడం లేదు, జరిగిన ఫ్యాక్ట్ ఇది. సమైక్య రాష్ట్రంలో, తెలంగాణ ఒక భాగంగా ఉన్నప్పుడు చేపల పరిశ్రమ అంటే కోస్టలైన్ మెరైన్ ఫిషింగే, సముద్ర తీరాన ఉండే మత్స్యకారులు, పల్లెకారులు వాళ్లే, మంచి చెడ్డ అటే పోయింది. ఇక్కడ కాన్‌సన్‌ట్రేషన్ లేకపోగా ఉన్నది కూడా ధ్వంసం అయింది.

నా చిన్నతనంలో దుబ్బాక జెడ్.పి.హెచ్.ఎస్.లో చదువుకున్నాను. అక్కడ నుంచి ఎక్స్‌కర్షన్‌కు మమ్మల్ని కరీంనగర్ జిల్లాలోని అప్పర్‌మానేరు ప్రాజెక్టుకు తీసుకెళ్లారు. ఆ ప్రాజెక్టు ప్రస్తుతం సిరిసిల్లా జిల్లాలో ఉంది. అప్పర్ మానేరు ప్రాజెక్టు దగ్గరకు తీసుకువెళ్లి అక్కడి చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని చూపించారు. కొన్ని దశాబ్దాల క్రితమే తెలంగాణలోని ప్రతి ప్రాజెక్టు దగ్గర చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలుండేవి. ఇప్పుడు నూరు శాతం ఎక్కడ లేవు. totally closed. ఫిషరీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఫెడరేషన్ చేశారు. దానిలో దాదాపు 100 వరకు ఖాళీలున్నాయి. అందులో ఏ పని పాట లేదు, ఉద్యోగులు ఉన్నంతలో పని చేస్తారు. దీనిని ఒక సమగ్ర సబ్జెక్టుగా, విషయంగా తీసుకున్న సందర్భం గతంలో లేదు. కానీ , ఇప్పుడు ఈ ప్రభుత్వం దీనిని మత్స్యపరిశ్రమగా రూపొందించాలని నిర్ణయం తీసుకుంది. తెలంగాణకు ఉన్న గొప్ప వరం మన మైనర్ ఇరిగేషన్ వ్యవస్థ. ఈ మాటను మామూలుగా తమాషా కోసం చెప్పడం లేదు. ఫ్యాక్ట్, హిస్టరీ కాబట్టే ఈ మాటను నేను పదే పదే చెబుతాను. కాకతీయ రెడ్డి రాజుల కాలంలో మనకిచ్చిన దీవెన ఈ మైనర్ ఇరిగేషన్ వ్యవస్థ. గతంలో మన దగ్గర 70,000 నుంచి 75,000 చెరువులుండగా చాలా వరకు నాశనం అయ్యాయి. ఫైనల్‌గా మనకు 46,500 చెరువులున్నాయి. ఇండియాలో ఏ రాష్ట్రానికి కూడా ఇన్ని చెరువులు లేవు. చెరువులను పంచాయతీ రాజ్ మరియు ఇతర ట్యాంక్‌లుగా వర్గీకరణ చేశారు. అన్ని చెరువులను ఇరిగేషన్ ట్యాంకులుగానే పెట్టి, అభివృద్ధి చేయాలని ఇరిగేషన్ శాఖకు ఆదేశాలివ్వడం, ఇరిగేషన్ మంత్రికి కూడా చెప్పడం జరిగింది. మిషన్ కాకతీయ అనే బృహత్తర పథకాన్ని చేపడుతున్న విషయం తమరికి మరియు గౌరవసభ్యులకు తెలుసు. ఈ పథకం ద్వారా 15,000 నుంచి 16,000 చెరువులను పూర్తి చేశాము. ఈ సంవత్సరం భగవంతుడు మన్నించి వర్షాలు బాగా కురవడం వల్ల చెరువులన్ని నిండాయి.

**1.20 మ.** రంగారెడ్డి, మహబూబ్ నగర్, నల్గొండ జిల్లాల్లో వర్షాలు తక్కువ ఉన్న చోట అక్కడ మిషన్ కాకతీయ పనులు చేసే అవకాశం ఉంది. లేని చోట ఫీడర్ ఛానల్ వర్క్స్‌ని చేసుకోమనడం జరుగుతుంది. గౌరవ శాసన సభ్యులు ఇచ్చే సూచనను బట్టి, సిట్యుయేషన్‌ను బట్టి, ఆ యొక్క డిపార్ట్‌మెంట్, మంత్రి నిర్ణయం

తీసుకుంటారు. ఆంధ్ర ప్రాంతం వారు వైజాగ్, శ్రీకాకుళం నుండి వచ్చి మర బోట్లతో శ్రీశైలంలో చేపలు పట్టుకుంటారు. మహబూబ్ నగర్‌లో ఉండే మత్స్యకారులను పట్టుకోనివ్వరు. వారి మీద దాడులు కూడా చేశారు. ఈ విషయమై గతంలో ఉద్యమ సమయంలో నేను మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లో తిరిగినప్పుడు అక్కడి ప్రజలు కంప్లెయింట్ చేశారు. మా మత్స్యకారులను కొడితే జాగ్రత అని రాజోలు సభ ఉపన్యాసంలో నేను వారిని హెచ్చరించాను. మన అదృష్టం కొద్దీ మనకు ఉన్న పొటెన్షియల్ తెలంగాణకు though we are a landlocked state మనకు సముద్ర తీరం లేకపోయినప్పటికీ కాకతీయ రాజుల పుణ్యం కొద్దీ, నిజాం నవాబులు కట్టించిన అనేక మధ్య తరహా ప్రాజెక్టులు మనకు ఉన్నాయి. వాటన్నింటినీ ఇప్పుడు శుభ్రం చేసుకుంటున్నాము. తమరికి తెలిసిన విషయమే, పంచాయతీ రాజ్ మంత్రి, ఆర్ అండ్ బి మంత్రి కూడా చెప్పారు. నేను పర్సనల్‌గా రివ్యూ చేసినప్పుడు ఒక ఆదేశం కూడా ఇచ్చాము. రాష్ట్రంలో ఎక్కడ ఏ నది మీద, ఏ వాగు మీద బ్రిడ్జి కట్టినా, చెక్ డ్యామ్ కమ్ బ్రిడ్జ్ కట్టాలిగాని బ్రిడ్జ్ ఒక్కటే కట్టొద్దని ఆదేశమిచ్చాము. అది కాకుండా మనకున్న పొటెన్షియల్ ఎంత అనేది ఎప్పుడు మనం మ్యాప్ చేయలేదు. కలెక్టర్లకు కూడా చెప్పాను. కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రం కాబట్టి, తెలంగాణ తన జీవికను పదిల పరచుకోవాలి. Telangana should determine its livelihood in all the sectors. ఏ ఏ రంగంలో ఏ ఏ అవకాశం ఉంది, ఏమి చేయాలి అనే ముందు చూపు ఉండాల్సిన అవసరం ఉంది. అందుకోసం అనేక విషయాలను సెటిల్ చేస్తూ, పోయే క్రమంలో ఈ సంవత్సరం అద్భుతమైన పెట్టుబడులు ఈ రంగంలో పెట్టబోతున్నామని సభకు హామీ ఇస్తున్నాను. ఈ రంగంలో ఉన్న నిపుణులు చెప్పిన విషయాన్ని బట్టి, నాలుగున్నర నుండి ఐదున్నర వేల కోట్ల రూపాయల చేపలను తెలంగాణలో ఉత్పత్తి చేసే ఆస్కారం ఉంటుంది. అంత పెద్ద పొటెన్షియల్ ఉంది. I am sure, 100% we are going to achieve that. వచ్చే బడ్జెట్ సమావేశంలో ఇందుకు అవసరమైన నిధులు కేటాయిస్తాము. రూ.100కోట్లతో కాదు. ఒకటి, ఇంకా బడ్జెట్ పెంచాల్సిన అవసరము ఉంది. రెండు, దీనికి తగిన ఏర్పాట్లు కావాలి. జూరాల వద్ద మొదలు పెట్టుకుంటే దక్షిణ తెలంగాణ మొదలు పెట్టి, రామన్‌పాడు, శ్రీశైలం, నాగార్జున సాగర్, టెయిల్ పాండ్, పులిచింతల, నల్గొండ జిల్లాలో ఉన్న మూసీ ప్రాజెక్టు, మహబూబ్‌నగర్‌లో ఉన్న కోయిల్‌సాగర్, కొత్తగా వచ్చిన సంగంబండ రిజర్వాయరు, రేలంపాడు రిజర్వాయరు వీటన్నింటినీ స్టడీ చేస్తున్నారు. ఇటుప్రక్క సింగూరు, నిజాం సాగర్, ఎస్.ఆర్.ఎస్.పి., ఎల్లంపల్లి, కడెం రిజర్వాయరు, ఆదిలాబాదులో ఉండే స్వర్ణతో మొదలు పెడితే సుద్దవాగు వరకు, వట్టివాగు, కొమురంభీం అనేక మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టులు లోయర్ మానేరు, అప్పర్ మానేరు, మిడ్ మానేరు. వరంగల్‌లో ఉన్న పాకాల, గన్నవరం, రామప్ప, లక్నవరం. ఖమ్మంలోని లంకా సాగర్, వైరా, పాలేరు రిజర్వాయర్లన్నీ మనకు ఉన్నాయి. వీటిని పటిష్టంగా, పక్కాగా 100 శాతం 5000కోట్ల రూపాయల ఆదాయం తెలంగాణ మత్స్య కార్మికులకు అందించాలని పకడ్బందీ ప్రణాళికా రచన చేస్తున్నాము. దక్షిణ తెలంగాణలో ఒక ఫిషరీస్ కాలేజీ రావాలి. ఉత్తర తెలంగాణలో ఒక కాలేజీ రావాలి. వచ్చే అకడమిక్ ఇయర్‌లో రెండు ఫిషరీస్ కాలేజీలను తప్పకుండా నెలకొల్పుతాము. కాలేజీలను నెలకొల్పడమే కాకుండా చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలను కూడా పెంచుతాము. చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలు ఎన్ని అవసరముంటాయో అన్ని మన వద్దనే ప్రొడ్యూస్ చేసే విధంగా ఏర్పాటు చేస్తాము. ఈలోపు ఈ చెరువుల పూడికలు పూర్తి అవుతూ ఉంటాయి. అదే విధంగా అంతర్ రాష్ట్ర సమస్యల మీద వేసిన కమిటీ ఉంది. అందులో ఇరిగేషన్ శాఖ మంత్రి గారు కూడా ఉన్నారు. ఆ కమిటీ ఆంధ్ర ప్రాంతీయులతో మాట్లాడి, మన షేర్ డిటర్‌మైన్ చేసుకోవాలి. శ్రీశైలంలో, నాగార్జున సాగర్‌లో, పులిచింతలలో మన చేపల వాటా ఎంత వస్తుంది అనేది తెలియాలి. పెద్ద ప్రాజెక్టులలో చేపలు పట్టుకోడానికి మరబోట్లు కూడా ఏర్పాటు చేస్తున్నాము. ఇవన్నీ నిర్ణయించే ఫిషరీస్ ఫెడరేషన్‌ను ఫెడరేషన్‌గానే ఉంచాలా కార్పొరేషన్‌గా మార్చాలా అనే విషయమై పాలసీ డిసైడ్ చేస్తాము. అక్కడ కేవలం 400 చిల్లర ఉద్యోగులు మాత్రమే ఉన్నారు. 85 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ సిబ్బంది ఏమూలకూ చాలరు కాబట్టి, వచ్చే నెలలో నోటిఫికేషన్ విడుదల చేసి మరొక 500 నుండి 600 మందిని ఫిషరీస్ కార్పొరేషన్‌లో రిక్రూట్‌మెంట్ కూడా చేస్తాము. రిక్రూట్ చేసి పటిష్టమైన పద్ధతిలో తెలంగాణ మత్స్య పరిశ్రమగా రూపు దిద్దడానికి సంపూర్ణంగా ముందుకు తీసుకెళతాము. ఇందుకు గాను కాలేజీలను, విత్తన ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేస్తాము. మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, ఉత్తరప్రదేశ్, డిల్లీ, హర్యానా, పంజాబ్ ఈ విధంగా దేశంలో సముద్రం లేని రాష్ట్రాలు చాలా ఉన్నాయి. అక్కడికి కూడా చేపలను బాగా ఎక్స్‌పోర్ట్ చేయగలుగుతాము. అంతే కాకుండా కొంత ఇతరత్రా దేశాలకు కూడా ఎక్స్‌పోర్ట్ చేయగలుగుతాము. ఇప్పుడున్న ఫిషరీస్ కార్పొరేషన్ జల జీవం లేకుండా ఉంది. దానికి ఒక ఐ.ఏ.ఎస్. అధికారిని నియమిస్తాము. ప్రస్తుతం అనిమల్ హజ్బెండరీ అండ్ ఫిషరీస్,

స్పెషల్ ఛీఫ్ సెక్రెటరీగా సురేష్ చందా గారు బాధ్యత వహిస్తున్నారు. రాబోయే సంవత్సరంలో రెండు కార్యక్రమాలకు ప్రాధాన్యతను ఇస్తున్నాము. మనకు చేపలు పట్టేవారు ఉన్నారు. వారికి ప్రత్యేకంగా ట్రెయినింగ్ ఇవ్వాల్సిన అవసరం లేదు. బిసి వర్గాల్లో రెండు ప్రధానమైన వర్గాలు ఉన్నాయి. ఒకటి యాదవులు, రెండు మత్స్యకారులు. మత్స్యకారుల్లో బెస్త కులం వాళ్లను రెండు రకాలుగా పిలుస్తారు. ఈ బెస్త వారిని నిజామాబాద్ ఆ ప్రాంతంలో గూన్లోలు అంటారు. మీ జనాభా ఎంతని ఏ కులం వారిని అడిగినా 5 రెట్లు పెంచి చెప్తారు. అన్ని కుల సంఘాలు చెప్పిన అంకెను కూడితే తెలంగాణ జనాభా 16కోట్లు వస్తుంది. కుల సంఘాలు చాలా లక్షల కుటుంబాలు మాకు ఉన్నాయని చెప్తే ఆయా కులాలకు ఎక్కువ బడ్జెట్ పెడతారేమో అని ఆ విధంగా చెప్తారు. తప్పు లేదు. సమగ్ర కుటుంబ సర్వేలో మేము మత్స్యకారులము అని నమోదు చేసుకున్న వారు 42వేల చిల్లర జనాభా మాత్రమే. డిప్యూటి స్పీకర్ గారు ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్ జిల్లా, చేగుంట మండలంలో ఒకసారి సొసైటీల మధ్య గొడవలు జరిగి ఇద్దరు వ్యక్తులు చనిపోయారు. అప్పుడు కనుమూరు రామచంద్ర రావు గారు మంత్రిగా ఉన్నప్పుడు మేము శాసన సభ్యులుగా ఆ జిల్లా సందర్శనకు వెళ్లాము. మామూలుగా వర్షాలు కురిసి చెరువులు నిండితే తెలంగాణలో ఉత్పత్తి అయ్యే చేపలు నేచురల్ ఫిష్ ఈల్డ్ లక్ష టన్నుల వరకు ఉంటుంది. పిల్లలు వేయడం ద్వారా మరొక లక్ష టన్నుల చేపలు ఉత్పత్తి అవుతాయి. నేను చెప్పిన తరువాత మంత్రి గారు చొరవ తీసుకుని గత ధరల కన్నా తక్కువ ధరకు వచ్చే విధంగా చేసి, కొంత కుంభకోణం ఉంటే దానిని నివారించి, ఓపెన్ టెండర్ పిలిచి చేప పిల్లలను కొనడానికి ఖర్చు పెట్టిన సొమ్ము రూ.24కోట్లు. రూ.24కోట్లు ఖర్చు పెట్టి 28కోట్ల చేప పిల్లలను వివిధ చెరువులలో వేయడం జరిగింది. చేపల బ్రోకర్లు ఉన్నారని మిత్రులు రాంమోహన్ రెడ్డి గారు మాట్లాడుతూ చెప్పారు. ఆ చేపల వ్యాపారులను పరిపుష్టంగా పెంచి పోషించి బేగం బజార్‌లో సుస్థిర పరచిందే కాంగ్రెస్ ప్రభుత్వంలోనే. ఈ ప్రభుత్వంలో కాదు.

**1.30 మ.** అధ్యక్షా, చేపలు పెంచే కార్యక్రమాన్ని వంద శాతం మత్స్య పరిశ్రమగా ట్రాన్స్‌ఫార్మ్ చేసేటటువంటి పద్ధతిలో ఖచ్చితంగా ఈ బేగం బజార్ బ్రోకర్లందర్నీ తరిమేస్తామని హామీ ఇస్తున్నాను. ఫిషరీస్ కార్పొరేషన్‌ను బలోపేతము చేయడం ద్వారా, ఫిషరీస్ కార్పొరేషన్ మొత్తం ఎక్స్‌పోర్ట్ బాధ్యతలు తీసుకునే విధంగా నిర్వహణ ఖర్చులు వారు చూసుకునే విధంగా, మిగిలిన ప్రతి రూపాయి చేపల సొసైటీలో పనిచేసే కార్మికులకు చేరే విధంగా బాధ్యత వహిస్తామని తెలియజేస్తున్నాను. బెస్త కులస్తులు, గొన్లోళ్ల కులస్తుల వారు తక్కువ జనాభా ఉంటారు. రెండు నుంచి మూడు లక్షల మంది జనాభా ఉండవచ్చని చెబుతున్నారు. వీరే కాక ఈ వృత్తిలోకి దిగినవారు ముదిరాజు కులస్తులు. ప్రస్తుతం లక్ష టన్నులు నాచురల్ ప్రొడక్షన్, విత్తనం వేయడం ద్వారా మరో లక్ష టన్నులు వచ్చాయి. ఈ సంవత్సరం రెండు నుంచి రెండున్నర లక్షల టన్నులు వచ్చాయని తెలియజేస్తున్నాను. అదేవిధంగా ఈసారి 28కోట్ల సీడ్స్ వేసినందున మొత్తం మూడున్నర లక్షల టన్నులు ఉత్పత్తవుతాయని, మత్స్యశాఖ వారు అంచనా వేశారని తెలియజేస్తున్నాను. భవిష్యత్తు కోసం 10 నుంచి 11లక్షల టన్నుల చేపల ఉత్పత్తిని చేస్తారని తెలియజేస్తున్నాను. That is something great. That is something big. ఇది రాష్ట్రానికి, మత్స్య కార్మికులకు బ్రహ్మాండమైన ఆర్థిక వెసులుబాటును మరియు పరిపుష్టిని కలిగించాలంటే, అనవసరంగా కుల ఘర్షణలకు పోకండి, బెస్తవాళ్లను, ముదిరాజులను ఇక్కడే ఉంచాలనే విషయాలు అవసరం లేదు. రాష్ట్రంలో ఉన్న బెస్త సోదరునికి ఇందులో అవకాశం వస్తుంది. ఫస్ట్ ప్రయారిటీ బెస్త కులస్థులకే ఇస్తాము. ముదిరాజులకు ప్రత్యేక వృత్తి లేనందున చేపలు పట్టేవారు ఈ రంగంలో ఎక్కువయ్యారు. ఉదాహరణకి మహబూబ్‌నగర్ జిల్లాలో ముదిరాజులే చేపలను పడతారు, బెస్త వాళ్ల సంఖ్య చాలా తక్కువగా ఉన్నందున, కనుక రెండు కులాల వారు బతకవలసిన వారే, కనుక బెస్త వారికి సంపూర్ణమైన హక్కు ఇచ్చి, మిగిలిన హక్కులను ముదిరాజులకు ఇస్తాము. కనుక ఇద్దరి కులాల మధ్య గొడవలు, పంచాయితీలు, భేదాభిప్రాయాలు అవసరం లేదు. అందరికి పరిపుష్టంగా లాభం జరిగే పనులను ప్రభుత్వం చేపడితే అందరి కడుపులు నిండుతాయని తెలియజేస్తున్నాను. దీని కోసం లక్ష టన్నుల చేప ఉత్పత్తి ఉన్న వాటిని, పది లక్షల టన్నులకు ఉత్పత్తికి తీసుకువెళ్లే ప్రయత్నం జరుగుతోంది. సమగ్రంగా వివరించాలని నేను వీటన్నింటినీ తెలియజేస్తున్నాను. లోకల్ రిసోర్స్‌ని మ్యాప్ చేసి ఎక్కడ నీళ్లైతే అక్కడ చేప పిల్లల్ని పెంచాలి. ఇరిగేషన్ శాఖ వారికి ఫోన్ చేసి మొత్తం మన వద్ద ఉన్న ప్రాజెక్టులు, చెరువుల్లో ఎన్ని లక్షల హెక్టార్లలో నీరు విస్తరించి ఉన్నాయో వంటి వివరాలను తెలుసుకున్నాను. సగటున ఒక హెక్టారు నీరుకి 350 కే.జీ.ల చేపలు ఉత్పత్తవుతాయని అంచనా వేశాము. కనుక మన వద్ద మూడు నుంచి నాలుగు లక్షల హెక్టార్ల వాటర్ స్ప్రెడ్ ఉంది, కనుక కొన్ని మేజర్ ప్రాజెక్టులుపోగా 3,939 చెరువుల్లో మాత్రమే విత్తనాలను వేశారు. ఎందుకంటే, శాఖ వారు స్ప్రెడ్ వాటర్ ఎన్ని నెలలు నిల్వ ఉంటాయో పరిశీలించి

వీటిని వేస్తారు. మినిమమ్ ఆరు నెలల నుంచి ఎనిమిది నెలల వరకు నీరుంటే మంచి చేపలు ఉత్పత్తయ్యే ఆస్కారం ఉంది. బంగారు తెలంగాణను చూడాలనుకుంటున్నా అప్పటి దాకా దేవుడు చల్లగా చూడాలని కోరుకుంటున్నాను. కాళేశ్వరం ఎత్తిపోతల, పాలమూరు ఎత్తిపోతల పథకాలు పూర్తైతే, ఎస్.ఆర్.ఎస్.పి.లో కొద్దిగా వర్షపాతం వచ్చినా, ఆ ఆయకట్టులో ఉన్న చెరువులన్నీ కలకలాడుతుంటాయి.

గతంలో తెలంగాణలో ఉన్న చెరువులను చూస్తే చిన్నతనం జ్ఞాపకము వస్తుంది. గతంలో తెలంగాణ ప్రజలు రెండు రకాల రొయ్యలు తినేవారు. అవి గోదావరి నదిలో దొరికే గంగ రొయ్యలు, తెలంగాణ ప్రాంతంలోని చెరువుల్లో ఎర్రరొయ్యల(పొట్టు రొయ్యలు)తోపాటు చింతచిగురు, శనగపప్పు వేసి వండితే బ్రహ్మాండంగా, అద్భుతమైన రుచి ఉంటుంది. వీటిని నేను తిన్నాను.

(కొంతమంది టి.ఆర్.ఎస్. సభ్యుల నుంచి హర్షధ్వానాలు )

ప్రస్తుతం ఇవి కరీంనగర్ జిల్లాలో అక్కడక్కడ కొన్ని చెరువుల్లో దొరుకుతున్నాయంటే, ఎస్.ఆర్.ఎస్.పి. పుణ్యమని తెలియజేస్తున్నాను. ఎల్లంపల్లిలో రీజనరేటెడ్ వాటర్ ప్రతిరోజు ఎన్ని వస్తున్నాయని, ఎస్.ఆర్.ఎస్.పి. ఆయకట్టుకి, శ్రీరాం సాగర్ ప్రాజెక్టు నిండి ఉన్నందున, పంటలకు నీళ్లు ఇస్తున్నాము. కనుక ఆ నీటి డ్రాప్ అంతా ఎల్లంపల్లి రిజర్వాయర్‌కి వచ్చి చేరుతున్నాయి. ఎల్లంపల్లి రిజర్వాయర్‌లో రీజనరేటెడ్ వాటర్ 70క్యూసెక్కుల నీళ్లు వచ్చాయి. ప్రతిరోజు ఎంత నీరు వస్తున్నది, వీటిని ఏ విధంగా ఉపయోగించాలో అనే విషయాలను రికార్డు చేయిస్తున్నాను.

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో మొదలు పెట్టిన కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా ప్రాజెక్టులు కొంత పూర్తయ్యే స్థాయికి వస్తున్నాయి. వచ్చే సంవత్సరానికి పూర్తిగా పూర్తవుతాయని తెలియజేస్తున్నాను. హెలీకాప్టర్ వెలుతుంటే మక్తల్‌కి కుడివైపున సంగంబండ రిజర్వాయర్, ఎడమ వైపునకు ఊట్కూర్ రిజర్వాయర్ ఉంది. చూస్తుంటే చాలా ఆనందం కలిగింది. నెట్టెంపాడు కింద రేలంపాట రిజర్వాయర్ 4టి.ఎమ్.సి.ల కెపాసిటీతో ఉంది. వీటన్నిటినీ మత్స్య శాఖ వారు పరిగణనలోకి తీసుకోలేదు. రీజనరేటెడ్ వాటర్ ద్వారా చిన్నతనంలో చూసిన ఎర్ర రొయ్యలను ప్రతి చెరువులో, ప్రతి కుంటలో పెరిగే విధంగా సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకుందామని తెలియజేస్తున్నాను. ఎక్కువ నీళ్లు తీసుకుని మల్లన్నసాగర్ నిర్మిద్దామని అంటున్నది వీటిని చూడడానికే అని మనవి చేస్తున్నాను. రీ జనరేటెడ్ వాటర్ ద్వారా 365 రోజులు చెరువులు, కుంటలు నిండి ఉండాలన్న ఉద్దేశంతో లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లకి ఇంత ప్రాధాన్యం ఇస్తున్నాము.

గతంలో గల తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌లో కలవక మునుపు ఉన్న తెలంగాణ మరల తయారు కావాలి. సమైఖ్య రాష్ట్రంలో కేటాయించిన 1300టిఎమ్‌సిల నీళ్లు now they have come to land of Telangana. గతంలో రాలేదు, కాని అవి వచ్చేలోపు 46,500 చెరువులను పూర్తి చేస్తే చెరువులు ఎండే ప్రసక్తే ఉండదు. "రోహిణీ కార్తె వచ్చిందంటే, మొగుడికి మొఖం పెట్టి చూడకుండా" తెలంగాణ రైతు వ్యవసాయం చేసే రోజు వస్తుంది. అటువంటి తెలంగాణ ఏర్పడ్డ రోజు రెండు నుంచి రెండున్నర సంవత్సరాల లోపు 5వేల కోట్ల రూపాయలు లాభం తెచ్చే మత్స్య పరిశ్రమగా తయారవుతుందని, ప్రభుత్వం ఈ విషయంలో దృఢసంకల్పంతో ముందుకు వెళుతోందని తెలియజేస్తున్నాను. సురేష్ చంద్రగారు టెక్నికల్‌శాఖ ఆఫీసర్ నిజాయితీగా ఇచ్చేటటువంటి టాస్క్‌ను పూర్తి చేస్తారని వీరిని ప్రత్యేకించి స్పెషల్‌గా నియమించాను. యాదవులు, మత్స్య కార్మికుల కులాలు పెద్దవి. వీరికి చేపలు పట్టేందుకు శిక్షణ ఇవ్వవలసిన అక్కర లేదు. వీరికి రక్తంలోనే చేపలు పట్టే విద్య తెలుసు.

మన రాష్ట్రానికి 300 లారీల గొర్రెలను రాజస్థాన్ నుంచి దిగుమతి చేసుకుంటున్నాము. ఇటువంటి దుస్థితి మనకెందుకు ఉండాలి. మంత్రి గారికి, సురేష్ చంద్ర గారికి ఈ విషయాలను తెలిపినందున ఎన్.సి.డి.సి. నుంచి 400కోట్ల రూపాయల విలువైన గొర్రెలను తెచ్చి పంచారని తెలియజేస్తున్నాను. ఇవి సరిపోవు, ప్రస్తుతం 28కోట్ల చేప విత్తనాలు వేసినందుకు తృప్తి పడకండని, భవిష్యత్తులో 280కోట్ల సీడ్ వేయాలని తెలియజేశాను. It should reach there.

**1.40 మ.** ఆ విధంగా చేప పిల్లలను ఉత్పత్తి చేయాలి. గొర్రెల యూనిట్లు కూడా సప్లై చేయడానికి వచ్చే బడ్జెట్‌లో పెద్దఎత్తున నిధులు కేటాయించబోతున్నాము. గొర్రెలను యాదవసోదరులకు ఇచ్చేస్తే వాళ్లు పెంచుకుంటారు. అమ్మే విధానం సైంటిఫిక్‌గా లేదు. వాసన వస్తుంటుంది. నేను జి.హెచ్.ఎం.సి. సమావేశంలో కూడా చెప్పాను. సుమారు130 సంవత్సరాల క్రితం కట్టిన మోండా మార్కెట్‌లో ఎటువంటి వాసన రాదు. గతంలో అంత సైంటిఫిక్‌గా కట్టారు. నేను ముఖ్యమంత్రి అయిన తర్వాత స్వయంగా అక్కడకు వెళ్లి సందర్శించడం జరిగింది. ఆ తరహా మార్కెట్లు మొత్తం హైదరాబాద్‌లో రావాలనే ప్రయత్నం జరుగుతున్నది. కిషన్‌రెడ్డిగారికి ఈ విషయం తెలుసు. సుమారు 40 నుంచి 50 మార్కెట్లు సైంటిఫిక్ వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్లు డెవలప్ చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటువంటి మార్కెట్లు తీసుకొని రమ్మని నేను మార్కెటింగ్ మంత్రిగారికి చెప్పడం జరిగింది. ఆ

ప్రయత్నం కూడా జరుగుతుంది. సైంటిఫిక్ పద్ధతిలో చేపపిల్లలను పెంచాలి. 80లక్షల చేపపిల్లలను పెంచాలని ఇంతకుముందే చెప్పాను. ఆ స్థాయికి మనం పోవాలి. నేషనల్ ఫిషరీస్ బోర్డు అనే కార్యాలయం మన దగ్గర ఉన్నది. మంత్రి రాధామోహన్‌సింగ్‌గారితో నేను చర్చ జరిపాను. చేపల పెంపకం అభివృద్ధికి మీకు ఎంత డబ్బు అవసరమైతే అంత నేను ఇస్తానని చెప్పారు. వారికి ధన్యవాదాలు నేను తెలియజేశాను. కేంద్ర స్కీమ్ ఏదైతే ఉందో దాన్ని వంద శాతం అమలు చేస్తాము. కేంద్ర సహకారాన్ని సంపూర్ణంగా తీసుకుంటాము.

రెండు కళాశాలలను ఏర్పాటు చేస్తాము. ఒకటి దక్షిణ తెలంగాణలో, మరొకటి ఉత్తర తెలంగాణలో ఏర్పాటు చేస్తాము. రీసర్చ్ సెంటర్లను కూడా పెడతాము. అవి కూడా పటిష్టంగా నడవాలి. నిరంతరంగా ఈ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసేటువంటి గొప్ప టూర్‌గా నేను భావిస్తున్నాను. కాకతీయ రాజుల పుణ్యం వలన మనకు మైనర్ ఇరిగేషన్లు ఉన్నాయి. మనం చేస్తున్నటువంటి ఎత్తిపోతల పథకాల ద్వారా గోదావరి కృష్ణా నీళ్లు పుష్కలంగా వస్తున్నాయి. వీటన్నింటిని విజువలైజ్ చేయాలి. అద్భుతమైన తెలంగాణను నేను చూడగలుగుతాను. అద్భుతమైన మత్స్య సంపద మన దగ్గరకు వచ్చే ఆస్కారం ఉంటుంది. దానితోపాటు ఎక్స్‌పోర్ట్ చేయడానికి అవసరమైన కోల్డ్ చైన్ కూడా కావాలి. దక్షిణ తెలంగాణ నుంచి హైదరాబాద్ సికింద్రాబాద్‌కు ఏ విధంగా పంపిణీ చేయాలి, చేపపిల్లలను పెంచాలి, రీసర్చ్ చేయాలి. నేను ప్రగతి భవన్‌లో జనహిత అనే హాలును కట్టించాను. బాటమ్ లైన్‌లో ఉన్నటువంటి స్వర్ణకారులు, మత్స్యకారులు, చేనేత కార్మికులు, రైతు సంఘాలందరిని పిలచి నేను ముఖాముఖిగా మాట్లాడటం కోసం ఈ హాలును ఏర్పాటు చేశాను. మధ్యప్రదేశ్‌లో అక్కడ ముఖ్యమంత్రి శివరాజ్‌చౌహాన్ గారు కట్టించారు. వాళ్ల ఇంట్లో సుమారు 500 కార్లు పార్కింగ్ ఉన్నది. అటు రెసిడెన్స్ ఇటు ఆఫీసు ఉంది. మధ్యలో 2000మంది కూర్చునే విధంగా పెద్ద షెడ్ వేశారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌లతోకానీ, స్థానిక ప్రజాప్రతినిధుల గ్రూపులతో, ఇటువంటి స్టేక్ హోల్డర్స్, మత్స్యకార్మికులు కావచ్చు, స్వర్ణకారులు కావచ్చు ఎవరైనా సరే వారిని పిలిచి స్వయంగా ముఖ్యమంత్రిగారు, సంబంధించి మంత్రి అధికారులు కూర్చొన్ని వారి సాదకబాధకాలు తెలుసుకోవడం జరుగుతుంది. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి నివాసంలో ఉండేటువంటి హాలు స్ఫూర్తితోనే మనం కూడా ప్రగతిభవన్‌లో జనహిత అనేటువంటి హాలును కట్టాము. ఎటువంటి డిస్ట్రబెన్స్ జరగకుండా సౌండ్ ప్రూఫ్ కూడా ఉన్నది. ఈ మత్స్యకారులను పీడదినాలు పోయిన తర్వాత సంక్రాంతి వెళ్లిన తర్వాత వాళ్లను నేనే స్వయంగా పిలిపించుకొని మాట్లాడి ప్రతి గంగపుత్ర సోదరున్ని, ప్రతి ముదిరాజ్ సోదరున్ని పిలిపించి కొత్త సంఘాలను ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఇప్పుడున్న సొసైటీలు పనికిరావు. కొత్త సొసైటీలు ఏర్పాటు కావాలి. ప్రతి యొక్క సోదరుడు ఈ మత్స్యపరిశ్రమపై ఆసక్తి ఉన్న వాళ్లు అందులో సభ్యులు కావాలి.

ల్యాండ్ అక్విజేషన్ ద్వారా రైతులు భూములను కోల్పోతున్నారు. కొన్ని చోట్ల మొత్తం భూమి, మొత్తం గ్రామం పోతున్నది. వాళ్లకు ప్రత్యామ్నాయ ఉపాధిని మనం చూపించాలి. వాళ్లకు మేము హామీ ఇచ్చాము. మీ దగ్గర ఇంత పెద్ద ప్రాజెక్టు వస్తున్నది. ఈ చెరువు క్రింద పండే పంట కంటే చేరువులోపల పంట తక్కువేమి ఉండదు. చాలా అద్భుతమైన ఆదాయం వస్తుంది. మీకు కూడా అందులో సభ్యత్వాన్ని కల్పిస్తామని రైతులకు చెప్పాము. ఎవరెవరి భూములు పోతున్నాయో మీరంతా బాధపడకండి, మీ లైవ్‌లీవుడ్ కోసం అందులో మీకు సభ్యత్వం ఇస్తామని చెప్పారు. ఆ విధంగా భూములను కోల్పోయిన రైతులను, ముదిరాజ్ సోదరులను, బేస్త సోదరులకు మొట్టమొదట ప్రాధాన్యం ఇచ్చి మత్స్యపరిశ్రమ మీద ఆధారపడదలచుకున్న వాళ్లందరిని ఇందులో సభ్యులుగా చేరుస్తాము. పరిశ్రమ సుమారు 8,9 రెట్లు పెరుగుతుంది కాబట్టి మల్టీఫోల్డ్, మ్యానిఫోల్డ్‌ను ప్రభుత్వం పెంచుతుంది కాబట్టి రాబోయే బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించబోతున్నాము. రెండు రీసర్చ్ సెంటర్లను, రెండుకాలేజీలను ఏర్పాటు చేయబోతున్నాము. ఈ పరిశ్రమను అద్భుతంగా చేసుకుంటాము.

గతంలో సీడ్స్‌కోసం రూ.4కోట్ల రూపాయలు ఇవ్వడం జరిగింది. రూ.12000లు ఒక్కొక్క చెరువుకు ఇచ్చేవారు. మూడు నాలుగు చెరువుల్లో వేసి మిగిలినవి బేగం బజార్‌లో ఎవరైతే సుస్థిరమైన బ్రోకర్లు ఉన్నారో వాళ్లు తీసుకొని పోయి సీడ్ వేస్తారు. మన మత్స్యకారుల పేదవాళ్లు, వాళ్ల దగ్గర డబ్బులు లేవు కాబట్టి పోనీలే వేయండని వాళ్లకు చెబుతున్నారు. కొరమీను మరియు ఇతర చేపలను మనం మార్కెట్‌లో కొనాలనుకుంటే సుమారు కేజీ రూ.600లు ఉంటుంది. కానీ చేపలు అమ్ముకునే వాళ్లకు కేజీకి కేవలం రూ.20 మాత్రమే లాభం వస్తుంది. దళారులు ఎక్కువగా డబ్బులను సేకరిస్తున్నారు. సంఘాలను ఏర్పాటు చేయడం అందులో ఉన్న మెంబర్లను కంప్యూటరీకరణ చేయడం, ఒక మెంబర్‌కు ఎంత ఆదాయం వస్తుందో చెప్పడం, ఫిషరీస్

డెవలప్‌మెంట్ కార్పోరేషన్‌లల్లో ఒక వెయ్యిమంది ఉద్యోగస్తులు ఉండే విధంగా ఏర్పాటు చేయడం వంటివి పూర్తిగా అనుసంధానం చేసే విధంగా చేస్తున్నాము. రాష్ట్రానికి రూ.5 వేల కోట్లు వచ్చే పరిశ్రమ కాబట్టి ఫిషరీస్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్‌ను లైవ్ వైబ్రాంట్ డిపార్ట్‌మెంట్‌గా తయారు చేసుకోవాలి.

గౌరవసభ, గౌరవ శాసనసభ్యుల ద్వారా మత్స్య పరిశ్రమ మీద ఆధారపడిన బేస్తసోదరులకు, ముదిరాజ్ సోదరులకు, భూములు కోల్పోతున్న రైతు సోదరులకు నేను హామీ ఇస్తున్నాను. ఈ చేపల పిల్లలు పెంచడం కానీ, పిల్లలను చెరువులల్లో వేయడం కానీ, సైంటిఫిక్‌గా అభివృద్ధి చేయడం, హార్వెస్ట్ చేయడం కానీ, కొత్త పడవలు కొనడం కానీ, మంచి వలలు కొనడం కానీ, అన్ని కూడా మోడ్రన్‌గా సైంటిఫిక్ వేలో ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ చేస్తుంది. వచ్చే ఆదాయంలో, నిర్వహణ ఖర్చు కార్పోరేషన్ తీసుకుంటుంది. మిగిలిన సొమ్ము అంతా మధ్యదళారీలు లేకుండా పూర్తిగా సభ్యులకే బదలీ చేస్తానని ఈ సందర్భంగా నేను హామీ ఇస్తున్నాను. యాదవులు గొర్రెలను పెంచి మాంసం సరఫరా చేయడం, మత్స్యకారులకు అద్భుతంగా మంచి పరిశ్రమలను తయారు చేయడం జరగవలసిన అవసరం ఉన్నది. స్వర్ణకారులు వృత్తులను కోల్పోయారు, ఈ రోజు ఎవరూ కుండలల్లో వండడం లేదు, కుమ్మరి వాళ్ల వృత్తి పోయింది. వాళ్ల బ్రతుకు తెరువు ఏమి కావాలి. అదే పద్ధతిలో చేనేత కార్మికులు కూడా అంతే. వాస్తవాన్ని ఆలోచించాలి. సైంటిఫిక్‌గా ఆలోచించవలసిన అవసరం లేదు. ప్రభుత్వం ఈ విషయాలన్నీ పూర్తిగా సఫులంగా అధ్యయనం చేస్తున్నది. ఈ సందర్భంగా ఒక్క ఉదాహరణ చెబుతాను. దేశంలో ఉండే చేనేత కార్మికులు 130కోట్ల మందికి వస్త్ర అవసరాలను తీర్చగలుగుతారా? తీర్చలేరు, తీర్చలేనప్పుడు మనకు మిల్లులు కావాలి. ఒకసారి మిల్లు ప్రజెన్స్ వస్తే, ఆ మిల్లు యొక్క పోటీని ఈ చేనేత కార్మికుడు తట్టుకుంటాడా? తట్టుకోడు, మిల్లులో బట్ట సాఫ్ట్‌గా ఉంటుంది డిజైన్ ఎక్కువగా ఉంటుంది. తక్కువ ధరకు వస్తుంది. ఈ రోజు మగ్గం పట్టుకొని జీవనాధారం చేస్తున్నాడే ఆ కార్మికుడు అప్పులపాలయి చనిపోతున్నాడు. ఎవరైతే దానికి తోడు ప్రత్యామ్నాయం పెట్టుకున్నాడో అద్భుతంగా ఉన్నారు. తెలివైన ప్రభుత్వాలు ఉంటే కొన్ని వృత్తులు అంతరిస్తాయి. కుండల్లో ఈ రోజు ఎవరూ వండడం లేదు. పెండ్లి సమయంలో 5 కుండలు, దీపావళి పండగనాడు పెట్టే దీపాంతెలు తప్ప కుమ్మరి వాళ్లు తయారు చేసే వస్తువులను వాడే పరిస్థితి ఇప్పుడు లేదు. అలాగే పరిణామక్రమంలో సామాజిక పరివర్తనలో కొన్ని వృత్తులు అంతరిస్తాయి. కొన్ని వృత్తులు కొత్తగా వస్తాయి. 30 సంవత్సరాల క్రితం మనకు ఆటో రిక్షా అంటే ఏమిటో తెలియదు. మేము ఎప్పుడూ చూడలేదు. సైకిల్ రిక్షా ఉండేది. ఆటో నటపడం ఏ కులం వారిది. ఈ రోజు ఎవరైన డ్రైవింగ్ నేర్చుకొని ఆటోలను కొనుక్కొని నడుపుకొని భార్యపిల్లలను పోషిస్తున్నారు. అది ఏకులం వారిది కాదు. కాబట్టి అంతరించిపోతున్న వృత్తుల వారిని ప్రత్యామ్నాయ వృతులను చూపించి ప్రోత్సహించాలి. ఆ ప్రాసెస్‌లో వాళ్లకు అవసరమైనటువంటి ఆర్థిక సహాయం ప్రభుత్వాలు చేయాలి. ఇప్పుడు ఆ పని చేయబోతున్నాము. మన దగ్గర స్వర్ణకారులు వృత్తులు కోల్పోయారు, కుమ్మరి వాళ్లు వృత్తి కోల్పోయారు, చేనేత కార్మికులు అటుఇటు కాకుండా ఉంటున్నారు. ఇక్కత్, పోచంపల్లి, గద్వాల్ చీరలు చేస్తూ ఉంటే వాళ్లకు ప్రోత్సాహం ఇస్తూ మిగిలిన వాళ్లను క్రమేణ షిఫ్ట్ చేసే పరిస్థితి రావాలి.

**1.50 ప.** క్రమేణా స్వర్ణకారులు, కుమ్మరి వారు వృత్తులు కోల్పోయారు. చేనేత పని వారు అటూ ఇటూ కాకుండా ఉన్నారు. కొన్ని స్పెషలైజేషన్స్ ఇక్కత్, పోచంపల్లి, గద్వాల్ పట్టు చీరలు మొదలైన వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. స్పెషలైజేషన్ ఏమన్నా ఉంటే దాని వైపుగా మిగిలిన వాళ్లను క్రమేణా షిఫ్ట్ చేసే పరిస్థితి రావాలి. నేను తొలి పలుకుల్లోనే ఇవన్నీ మనవి చేశాను. తెలంగాణ ఒక నూతన రాష్ట్రంగా తన జీవికను తన లైవ్‌లీ హుడ్‌ను సుస్థిర పరుచుకోవాలి. ఈ రాష్ట్రంలో దాదాపు 85 నుంచి 90 శాతం మధ్య బలహీన వర్గాలకు చెందిన వారు వృత్తి పనులు చేసుకుని జీవిస్తున్నారు. నేను పదేపదే చెబుతున్నాను. 85 శాతం పైగా బి.సి., ఎస్.సి., ఎస్.టి., మైనారిటీ ప్రజలున్న రాష్ట్రం మనది. వీరంతా ఒక మంచి గౌరవ ప్రదమైన జీవితం గడిపితేనే మన రాష్ట్రం బంగారు తెలంగాణ అవుతుంది. మత్స్య పరిశ్రమకు సంబంధించి, అలాగే వేల లక్షల గొర్రెల యూనిట్లను యాదవ సోదరులకు ఇవ్వడానికి రాబోయే బడ్జెట్‌లో తమ ముందుకు వస్తాము. రెండు పాలసీలను గొర్రెల పెంపకం పాలసీ, మత్స్య పరిశ్రమ పాలసీ, ఈ రెండు పాలసీలను సమగ్రంగా సభముందు పెట్టి ముందుకు తీసుకు వెళతాము.

బెస్త కులస్థులకు ముదిరాజ్ కులస్థులకు నేను మనవి చేస్తున్నాను. మీలో మీరు గొడవ పడకండి. వీళ్లు అన్ని తీశారు, వాళ్లు ఇన్ని తీశారని అనుకోకండి. అందరం గౌరవంగా బ్రతకాలి. మంత్రి గారు చిన్న ప్రయత్నం ద్వారా కొంత ఎఫర్ట్ చేశారు. ఆ ప్రయత్నం వల్ల ఒక్క రూపాయి అరవై పైసలకు దొరికే చేపలు ఇప్పుడు ఎనభై పైసలకే దొరుకుతున్నాయి అంటే 50 శాతం రేటు

డౌన్ అయింది. దాంట్లో ఉన్న అవినీతి పోయింది. దీని వల్ల చేప పిల్లలను కూడా ఎక్కువ వేయడానికి అవకాశం ఉంటుంది. మనకు 2 లక్షల టన్నులు వస్తే, ఈ ఎఫర్ట్ వల్ల ఈ సారి మనం మూడున్నర లక్షల టన్నులను ఆశిస్తున్నాము. ఈ చిన్న ప్రయత్నం వల్ల లక్షన్నర టన్నుల చేపలను అదనంగా పట్టుకునే పరిస్థితి ఈ సంవత్సరం మనకు వచ్చింది. నేను చెప్పిన స్కీమ్‌ను కంప్లీట్‌గా ఇంటిగ్రేటెడ్ అప్రోచ్‌తో అరేంజ్ చేస్తే పది, పదకొండు లక్షల టన్నులకు మల్టీ ఫోల్డ్స్ పెరుగుతుంది. ఇప్పుడు వచ్చేది 500 కోట్లు మాత్రమే. అది 5,000 కోట్లకు వెళ్లే పరిస్థితుల్లో మనమున్నాము. పదిరెట్లు పెరగనుంది, కాబట్టి అందరికీ దాంట్లో ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు దొరుకుతాయి. మీలో మీరు బెస్త వాళ్లని, ముదిరాజ్‌లని ఫిక్స్ చేసుకోకండి. చేపలు పట్టడంలో ఎవరికి ఆసక్తి ఉందో వారందరినీ కలుపుకొని పోదాము. మీ అందరికీ కూడా కొత్త సొసైటీలను వేయించి అందరికీ లాభం చేకూరే విధంగా చూస్తాము. ఆ వచ్చే సంపద మీ కష్టం కాబట్టి మీకే చెల్లుతుంది. నిర్వహణా ఖర్చు మాత్రమే డిపార్ట్‌మెంట్ తీసుకుంటుంది. ఫిషరీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మెయిన్‌టెనెన్స్‌కు అంటే ఈ చేపలను పెంచడానికి, మంచికి చెడ్డకి ఎక్స్‌పోర్ట్ చేయడానికి కంప్లీట్ డిపార్ట్‌మెంట్ వైబ్రాంట్‌గా ఉండి వాళ్లే చేస్తారు. ఆ ఖర్చులు మాత్రమే వాళ్లు తీసుకుంటారు. మిగిలినదంతా సొసైటీ మెంబర్లకు ట్రాన్స్‌ఫర్ చేస్తారు. ఒక మంచి ఆరోగ్య కరమైన పద్ధతిలో చేస్తారు.

బెస్త వాళ్లు ప్రధానంగా చేపలను పడతారు, అది అందరికీ తెలుసు. బెస్తవాళ్లను హైదరాబాద్‌లో గంగపుత్రులని, ఆదిలాబాద్‌లో గొన్నోళ్లని మిగతా తెలంగాణ అంతా బెస్త అంటారు. వీళ్లు పోను ముదిరాజ్‌లు. కల్లుగీత వృత్తిని కేవలం గౌడ్‌లు మాత్రమే చేస్తారని మనకు తెలుసు. కానీ ఆ చెట్లు ఎక్కి కల్లు తీయడం ఇతర కులాల వారు కూడా చేస్తున్నారు. ఏజన్సీ ప్రాంతాలలో కొంతమంది ట్రైబల్స్ ఈ చేపలు పట్టే వృత్తిలో ఉన్నారు. కేవలం ఒక కులం వారు మాత్రమే ఉండాలని లేదు. అక్కడ సోర్సు ఉంది కాబట్టి నదులు రిజర్వాయర్లు ఉన్నందున ఎవరైనా ఆ పని చేయొచ్చు. గౌరవ సభ్యులందరికీ నేను మనవి చేస్తున్నాను. దయచేసి మీరంతా మీ మీ నియోజక వర్గాల్లో జరిగే బ్రిడ్జి నిర్మాణాలను చెక్ డ్యాం కమ్ బ్రిడ్జి కట్టమనండి. ఎత్తిపోతల పథకం కంప్లీట్ అయిన తరువాత నీళ్లు కంప్లీట్ లైవ్‌గా ఆ రివర్స్‌లో రివల్లెట్స్‌లో ఉంటాయి. అక్కడ కూడా చేపలు పెంచుకోవడానికి ఆస్కారం ఉంటుంది. దయచేసి వాటిని ఎన్సూర్ చేయాలని గౌరవ శాసన సభ్యులను తమరి ద్వారా కోరుతున్నాను. గోదావరి మీద మనం ప్రపోజ్ చేసి కడుతున్న బ్యారేజ్‌లలో కొత్తూరు దగ్గర కట్టిన దేవాదుల ప్రాజెక్టులో కూడా దాదాపు 20 కిలో మీటర్లు వాటర్ స్ప్రెడ్ ఉంటుంది. మేడిగడ్డ బ్యారేజ్‌లో ప్రాణహిత నది ప్లస్ గోదావరి కలిపి 54 కిలో మీటర్ల పొడవు వాటర్ స్ప్రెడ్ ఉంటుంది. దాని మీద కట్టే అన్నారం బ్యారేజ్‌లో 30 కిలో మీటర్లు వాటర్ స్ప్రెడ్ ఉంటుంది. దాని మీద కట్టే సుందిళ్ల బ్యారేజ్‌లో కూడా దాదాపుగా 15 నుంచి 18 కిలోమీటర్ల వాటర్ స్ప్రెడ్ ఉంది. ఎల్లంపల్లి రిజర్వాయర్ దగ్గర నుంచి ధర్మపురి దాటిన తరువాత జైన అనే ఒక ఊరు ఉంది. ఆ జైన గ్రామం వరకు కూడా దాదాపు 36 కిలో మీటర్ల దూరంలో ఎల్లంపల్లి బ్యారేజ్‌లో ఈ సంవత్సరం నీళ్లున్నాయి. క్రొత్త బ్రిడ్జ్ అయిపోయింది, పాత రాయపట్నం కాజ్ మునిగిపోయింది. జైన వరకు కూడా నీళ్లున్నాయి.

ఖమ్మం, వరంగల్ జిల్లా సరిహద్దులో ఉన్న కొత్తూరు నుంచి మంథెన నియోజక వర్గం కావొచ్చు, అక్కడి నుంచి పట్టుకుంటే ధర్మపురి దాటిన తరువాత జైన వరకు సుమారు 140 కిలో మీటర్లు గోదావరి అద్భుతంగా 365 రోజులు వాటర్‌తో కళకళలాడుతూ లైవ్ గోదావరిని చూడబోతున్నాము. ఒకసారి మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణం పూర్తి అయితే ఆ పంపులు బిగిస్తే నేను చెప్పిన దేవాదుల ప్రాజెక్టుకు డౌన్ బిలో కొత్తూరు దగ్గర నుంచి ధర్మపురి దాటే జైన వరకు చాలా చేపలు పెంచవచ్చు. దాదాపు 70,75 టి.ఎమ్.సి.ల నీళ్లు గోదావరి నదిలో లైవ్‌గా ఉంటాయి. ఆ చిత్రం ఊహించుకుంటేనే కడుపు నిండుగా ఉంటుంది. అది వ్యవసాయానికి ఉపయోగపడడమే కాదు, గ్రౌండ్ వాటర్ ఉత్పత్తికి ఉపయోగపడడమే కాకుండా అద్భుతంగా చేపలను పెంచే మత్స్య పరిశ్రమకు కూడా ఉపయోగపడుతుంది.

మహబూబ్‌నగర్‌లో ఇప్పటికే ఉన్న జూరాల, రామంపాడు, సంగబండ, రేలంపాడు వాటితో రాబోతున్న కరివెన, వట్టెం, ఉద్దండపూర్ రిజర్వాయర్లలో అలాగే కోయిల్ సాగర్‌లో కూడా బ్రహ్మాండమైన మత్స్య పరిశ్రమ అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. శ్రీశైలం, సాగర్ నీటితో మనం వాటర్ డిటర్మైన్ చేసుకుంటే అక్కడ కూడా చేపలు పెంచుకునే ఆస్కారం ఉంటుంది. చాలా పెద్ద పొటెన్షియల్ ఉన్న ఈ పరిశ్రమ ఒక వైబ్రాంట్ పరిశ్రమగా రూపు దాల్చబోతోంది, మీ కలలు పండబోతున్నాయి. తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్నదే అందుకు. ఆ ప్రయత్నం వచ్చే బడ్జెట్‌లోని కేటాయింపులతో తెలిసి పోతుంది. రూ.100 కోట్లు పెట్టి కేవలం రూ.30 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారని సున్నం రాజయ్య గారన్నారు. పెట్టడానికి కూడా స్కోప్ లేదు. ఒక ఇంటిగ్రేటెడ్ అప్రోచ్‌తో రూ.100 కోట్లే కాదు ఎన్ని కోట్లైనా పెడతాము. దానికి

ప్రతి నయా పైసా ఖర్చు అయ్యేలా కార్పొరేషన్ స్థాయిని పెంచుతాము. వైబ్రాంట్‌ను పెంచుతాము. అక్కడున్న సీనియర్ ఎంప్లాయీస్ అందరికీ ప్రమోషన్లు ఇచ్చి బాటమ్ లైన్ అంతా కొత్త ఉద్యోగులను రిక్రూట్ చేసి ఒక వైబ్రాంట్ కార్పొరేషన్‌ని తయారు చేసి దాన్ని ముందుకు తీసుకు వెళ్తామని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. ఈ మంచి నిర్ణయాన్ని ఈరోజు తెలిపేందుకు అవకాశం కల్పించినందుకు తమరికి ధన్యవాదాలు తెలుపుతూ, తెలంగాణలోని మత్స్యకార బిడ్డలందరికీ తమరి ద్వారా సభ ద్వారా మనందరి పక్షాన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

**శ్రీ టి.జీవన్ రెడ్డి: –** మత్స్య వృత్తి మీద ఆధారపడిన వారు ప్రధానంగా గంగపుత్రులు కానీ, వారితో పాటు ముదిరాజ్ కులస్తులకూ చేపల పెంపకానికి సంబంధించి మరింత ప్రోత్సాహం అందించే విధంగా మత్స్య పరిశ్రమను అభివృద్ధి చేయడం జరుగుతుందని ఏదైతే పేర్కొన్నారో దాన్ని కాంగ్రెస్ పార్టీ తరఫున మేము కూడా స్వాగతిస్తున్నాము. దేవుడి దయ వల్ల ఈ సంవత్సరం వర్షాలు బాగా కురిశాయి. రాష్ట్రంలో ఏదో రెండు, మూడు జిల్లాల్లో తప్ప మిగతా చెరువులు కుంటలు అన్నీ కూడా జల కళతో ఉట్టి పడుతున్నాయి. గౌరవ ముఖ్యమంత్రి గారు ఈ రోజు తీసుకున్న నిర్ణయం ఒక ఆరు నెలల క్రితమే తీసుకొని ఉంటే రేపు రాబోయే ఫలితాలు ఏవిధంగా వస్తాయని ఊహిస్తున్నామో అవి ఈ సంవత్సరమే వచ్చి మత్స్యకారులకు లబ్ధి చేకూరేదని అంటున్నాను. రాష్ట్రంలో దాదాపు 46 వేల చెరువులు కుంటలు చిన్నవి పెద్దవి ఉంటే ఈసారి దాదాపు 35, 40 వేల చెరువులు, కుంటల్లో జల కళ ఉట్టి పడుతోంది. కానీ చేపలు వేసింది మాత్రం కేవలం మూడు వేల తొమ్మిది వందల చెరువుల్లో మాత్రమే అధ్యక్షా. అంటే ఓన్లీ 10 శాతం మాత్రమే.

**2.00 మ.** అధ్యక్షా, ఈ సబ్జెక్ట్‌పై వివరాణాత్మకంగా చాలా పాజిటీవ్‌గా నేను చెప్పాను. ఏదైనా మాట్లాడి విమర్శ చేద్దామంటే ఎట్లా అధ్యక్షా? దేనికైనా ఒక పద్ధతి ఉండాలి.

(ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన శ్రీ టి. జీవన్ రెడ్డిచే అంతరాయం)

నాయనా! (జీవన్ రెడ్డిని ఉద్దేశించి) మీ ప్రభుత్వంలో ఎప్పుడైనా మత్స్యశాఖకు నాలుగు కోట్ల రూపాయలకు మంచి ఇచ్చారా? మీరు ఇచ్చింది ఏ మూలకూ సరిపోదు. మీరు కేవలం వందల చెరువుల్లోనే చేపపిల్లలు వేశారు. కాంగ్రెస్ గవర్నమెంట్‌లో ఎప్పుడూ ఈ విధంగా 3930 చెరువుల్లో చేపపిల్లలు వేసిన దాఖలాలు లేవు. చేప పిల్లలు పెరగాలంటే మినిమమ్ ఇన్ని నెలలు నీళ్లు ఉండాలని చూస్తారు. అది ఒక లెక్క. ఇన్ని నెలలు చెరువుల్లో నీళ్లుంటేనే చేపలు పిల్లలను వేస్తారు, లేకపోతే వెయ్యరు. ఈ నాలుగు వేల చెరువులేవైతే ఉన్నాయో, ఆ చెరువుల్లో ఆరు నెలలకు పైబడి నీళ్లు నిలవ ఉంది. కాబట్టి అలాంటి చెరువుల్లో వేస్తారు. ఆ విధానం ఉంది. ముఖ్యమంత్రి గారు ఆరు నెలల ముందు అనుకోవాలంట, జీవన్ రెడ్డి గారు నాకు చెప్పాలంట, ఇదేంటి అధ్యక్షా? ఈయన నాకు చెప్పాలంట. ఏదో విమర్శ చేద్దామని ఎందుకు ప్రయత్నిస్తున్నారు జీవన్‌రెడ్డి గారు? మంచి చేసినప్పుడు అభినందించాలి కదా, ఆ సంస్కారం కూడా ఉండాలి కదా.

**శ్రీ టి. జీవన్ రెడ్డి : –** అధ్యక్షా, ఉన్న మాట అంటే ఎందుకు అంత ఉలికిపడతారు. ఆరు నెలల ముందు నిర్ణయం తీసుకున్నట్లయితే వారికి లబ్ధి చేకూరేదని చెప్పాను. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏం చేసిందన్నారు. వారు విమర్శించారు కాబట్టి నేను చెబుతున్నాను. బలహీన వర్గాలకు సంబంధించి, ఆయా వృత్తులపై ఆధిపత్యం కలిగించే విధంగా చేశాం. మత్స్యకారులైనా సరే, వేరే ఎవరైనా సరే, వృత్తిపరంగా చెరువులు, కుంటలపై ఎవరైతే ఆధారపడుతున్నారో, వారికి సంబంధించి సహకార సంఘాలు ఏర్పాటు చేసి, వేలం పద్ధతిని రద్దు చేసి, గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు అధికారాన్ని రద్దు చేసి, ఆయా వర్గాల వారికే అన్ని విధాలా హక్కు కల్పించే విధంగా కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రభుత్వం మరింత మెరుగ్గా ఆలోచన చేస్తే సంతోషం అధ్యక్షా. నేను కాదనను. కాంగ్రెస్ ఏమి చేసింది అని వారంటే కనుక మేము కొంత విమర్శనాత్మకంగా చూడవలసి వస్తుంది. చేపల నారుమళ్లకు సంబంధించి ఆరు మాసాలు కూడా సరిపోదు సార్. కనీసం తొమ్మిది మాసాలుంటేనే అనుకున్నటువంటి వృద్ధి పొందగలుగుతాము. జూలై, ఆగస్టులో విత్తనం వేస్తే బాగుంటుంది. ఏప్రిల్ తరువాత చెరువుల్లో నీళ్లు తగ్గిపోతాయి. కాబట్టి జూలై, ఆగస్టులో సీడ్ వెయ్యడానికి చర్యలు చేపట్టాలి. అక్టోబర్, నవంబర్‌లో సీడ్ వేశాము. కాబట్టి మనం అనుకున్న వృద్ధి పొందలేము. రాబోయే కాలంలో అయినా జూలై, ఆగస్టు నెలల్లో సీడ్ అందించే విధంగా చర్యలు చేపడితే బాగుంటుందని సూచిస్తున్నాను. బ్లూ రెవల్యూషన్‌కి సంబంధించి యాభై శాతం నిధులు కేంద్రప్రభుత్వం అందించే అవకాశం ఉంది.ఆ మేరకు ఈసారి 14 కోట్ల రూపాయలు మనకు కేంద్రప్రభుత్వం అందించింది. భవిష్యత్‌లో బ్లూ రెవల్యూషన్ కింద కేంద్ర ప్రభుత్వం నుండి ఏ మేరకు నిధులను

రాబట్టుకోగలుగుతాము? ఈ సంవత్సరం వంద కోట్ల రూపాయలు బడ్జెట్ పెట్టుకున్నా, మత్స్య శాఖకు సంబంధించి ఖర్చుపెట్టగలిగేది ఇరవై కోట్ల రూపాయలు మాత్రమే. ఈ సంవత్సరం బ్లూ రెవల్యూషన్‌లో భాగంగా రూ. 20 కోట్ల నిధులు కేంద్రాన్ని అడిగాము. మీరు బడ్జెట్‌లో పెట్టుకున్న నిధులు కేంద్రప్రభుత్వం ఇచ్చిన నిధులు కాకుండా వేరే విధంగా ఏమైనా వెచ్చించబోతున్నారా? వ్యవసాయ శాఖా మంత్రి గారు, మత్స్య శాఖను నిర్వహించినప్పుడు కేజి కల్చర్ గురించి బాగా చెప్పారు. ఇప్పుడు కేజి కల్చర్ గురించి ఒక్క మాట కూడా చెప్పలేదు. పోచారం శ్రీనివాస్ రెడ్డి గారు జార్కాండ్ వెళ్లారు, ఇంకా ఎక్కడికో వెళ్లారు. మత్స్య పరిశ్రమకు మరింత ప్రోత్సాహం అందించాలని, మీరు కేజి కల్చర్ గురించి ఆలోచన చేసి, మత్స్యకారులకు తోడ్పడు అందించే విధంగా చర్యలు తీసుకోవాలి. ప్రమాదవశాత్తు మరణించే మత్స్యకారులకు ప్రస్తుతం రెండు లక్షల రూపాయలే బీమా సౌకర్యం అందిస్తున్నారు. ఆ బీమా సౌకర్యాన్ని అయిదు లక్షల రూపాయలకు పెంచడం జరుగుతుందని ముఖ్యమంత్రి గారు పేర్కొన్నారు. మీరు పేర్కొనకపోతే పత్రికలలో ఆ విధంగా ఎందుకు రాసారు? మీరు వారికి అయిదు లక్షల రూపాయలిస్తే సంతోషిస్తారు. మనం కేవలం ఇన్సూరెన్స్ పాలసీ ప్రీమియంని మాత్రమే చెల్లిస్తున్నాము. మత్స్యకారులు, గీతకారులు ప్రమాదవశాత్తు మరణిస్తే, అయిదు లక్షల రూపాయలు వారి కుటుంబాలకు అందించే విధంగా చర్యలు చేపడితే బాగుంటుందని నేను సూచిస్తున్నాను.

**శ్రీ కె. చంద్రశేఖర్ రావు : –** అధ్యక్షా, సభ్యులు చక్కటి సూచనలు చేశారు. ఏదైనా చెబితే అతికినట్లు చెప్పాలి.

(అంతరాయం)

మీకు అతకడం రావడం లేదు, అదే నా బాధ. నేను మంచిగా అతకపెడతాను. చేప పిల్లల సీడ్‌ను అక్టోబర్‌లో, నవంబర్‌లో వేశారని చెబుతున్నారు. చెరువులు నిండేదే అప్పుడు అధ్యక్షా. ఈ విషయం గురించి ఏ చేపలు పట్టే వాడిని అడిగినా చెబుతాడు. మేము ఆక్షన్ లేకుండా చేశామని వారు చెబుతున్నారు. మేము సర్పంచులకు పవర్‌ను తీసేసామని చెప్పారు. నేను ఒకటే మాట చెబుతాను. నేను ఎక్కువ చెప్పదలచుకోలేదు, ఘర్షణ పడదలచుకోలేదు. కాంగ్రెస్ పార్టీ నలభై సంవత్సరాలు పరిపాలించింది. ఆ టైంలో తెలంగాణలో మత్స్య పరిశ్రమ ఏ విధంగా ఉంది, మత్స్యకారులకు వచ్చిన ఆదాయం ఎంత, ఏమిటి అనేది ప్రజలకు తెలుసు. చేప పిల్లలు సప్లైకి సంబంధించి వారిచ్చిన సబ్సిడీ ఏ మూలకు సరిపోయేదు కాదు. పది శాతం సబ్సిడీ కూడా వీళ్లకు వచ్చేది కాదు. ఇప్పుడు బేగంబజార్‌లో స్థిరపడిన చేపల వ్యాపారులు బ్రహ్మాండంగా వర్ధిల్లి కోటీశ్వరులయ్యారు. మీ రాజ్యంలో మత్స్యకారులు ఎక్కడున్న వాళ్లు అక్కడే ఉన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది కాబట్టి, మనం ఉమ్మడి రాష్ట్రంలో లేము కాబట్టి concentration అంతా తెలంగాణ మీదే కాబట్టి మేము ఏం చేయబోతున్నామో దాని గురించి చెప్పాము. ఎంత గొప్పగా చెయ్యబోతున్నామో చెప్పాను. అంతకు మించి నేను వారితో వాదించదలచుకోలేదు. ప్రజలు మీరు మాట్లాడింది విన్నారు, నేను మాట్లాడింది విన్నారు. వారికి ఆ comparison తెలుస్తుంది. బడ్జెట్‌లో కూడా మేము ఏం చెయ్యబోతున్నామో, ఫిషరీస్ కార్పొరేషన్ ఎట్లా స్ప్రెడ్ అవుతుందో, ఉద్యోగులు ఏ విధంగా వస్తారో, ఎన్ని ఉద్యోగాలు వస్తాయో అవన్నీ మేము ఇవ్వబోతున్నాము. కేజి కల్చర్ అని అన్నారు. అది కేజి కల్చర్ కాదంటి, కేజ్ కల్చర్. కేజ్ అంటే పంజరం. మన ఫైనాన్స్ మినిస్టర్ రాజేందర్ గారు, అగ్రికల్చర్ మినిస్టర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి గారు జార్ఖండ్ వెళ్లి స్వయంగా చూసి కేజ్ కల్చర్ గురించి పరిశీలించి వచ్చారు. మన దగ్గర అయిదు జిల్లాలలో ప్రయోగాత్మకంగా చేశారు అధ్యక్షా. కేజ్ కల్చర్‌ను ఎగ్జామిన్ చేస్తున్నారు, సీడ్ ప్రొడక్షన్ చేస్తున్నారు, సీడ్ సెంటర్స్ ఎక్కడున్నాయో చూస్తున్నారు. వర్క్ స్టార్ట్ అయ్యింది.

**2.10 మ.** ఇవన్నింటినీ వంద శాతం ఫూల్‌ప్రూఫ్‌గా చేసి ఈ రెండు ఎత్తిపోతల పథకాలకు నీళ్లు వచ్చేవరకు వర్షాల మీద కూడా ఆధారపడకుండా మన దగ్గర కరవు వచ్చినా కూడా వీటన్నింటిని నింపుకునే ప్రయత్నం జరుగుతున్నది. జీవన్ రెడ్డి గారు యాక్సిడెంట్ జరిగిన మత్స్యకారుల గురించి చెప్పారు. నేను సదరు విషయాన్ని మంత్రి గారికి చెప్పాను. ఇప్పటికే వాళ్లు చర్యలు మొదలు పెట్టారు. ఇప్పటికే ఇన్సూరెన్స్ కంపెనీలతో కూడా మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో ప్రమాదవశాత్తూ మరణించిన మత్స్యకారులకు కేవలం రూ.2 లక్షలే ఇచ్చారు. కానీ మత్స్యకారులు ప్రమాదవశాత్తూ మరణిస్తే మా ప్రభుత్వం రూ.6 లక్షలు ఇస్తుంది.

(గౌరవ సభ్యులు బల్లలు చరిచారు)

**శ్రీ జి. కిషన్ రెడ్డి:–** మత్స్యకార సొసైటీలు కొన్ని దశాబ్దాల క్రితం ఏర్పరచుకున్నవి. గతంలో ఏడెనిమిది గ్రామాలకు కలిపి ఒక సొసైటీ ఉండేది. ఇప్పుడు గ్రామాలు విడిపోయిన సందర్భంగా అనేక గ్రామపంచాయతీలలో చాలా దరఖాస్తులు పెండింగులో ఉన్నాయి. గౌరవ ముఖ్యమంత్రిగారు చెప్పినట్లుగా ఒక ఫిషరీస్ డెవలప్‌మెంట్ పాలసీని తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేసుకుంటే బాగుంటుంది. అంతే కాకుండా అర్బన్ ఓరియంటెడ్‌లో కూడా

చాలా చెరువులున్నాయి. ఈ చెరువులలో డ్రైనేజీ వాటర్ కలువకుండా చేపల ఉత్పత్తికి ఉపయోగించుకుంటే బాగుంటుంది. అదే విధంగా కోల్డ్ స్టోరేజీలను కూడా ఏర్పాటు చేయడంతోబాటు ఇన్‌ల్యాండ్ వాటర్ సిస్టం ఏదైతే గతంలో ఉన్నట్లుగా ప్లాన్ చేస్తున్నామో దానిద్వారా కూడా చాలా పెద్దఎత్తున ఇన్‌ల్యాండ్ వాటర్ పర్మినెంట్‌గా వాటర్ ఉంటుంది. కాబట్టి నీటిల్లో కూడా చేపలను చాలా పెద్దఎత్తున ఉత్పత్తి చేసుకునే అవకాశముంటుంది. హైదరాబాదులోని సఫిల్‌గూడ చెరువు, సరూర్‌నగర్ చెరువుల వంటి వాటిని ప్లాన్ చేసుకుంటే బాగుంటుంది కాబట్టి అక్కడ కూడా చేపల పెంపకం గురించి ఆలోచన చేయాల్సిందిగా మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**శ్రీ తలసాని శ్రీనివాస్ యాదవ్:–** అధ్యక్షా, ఈ దేశానికి 1947వ సంవత్సరంలో స్వాతంత్ర్యం వచ్చింది. కానీ అణగారిన వర్గాలకు, బడుగు, బలహీన వర్గాలకు తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత అన్ని వర్గాలకు స్వాతంత్ర్యం వచ్చిందని ఈ సభ ద్వారా తెలియజేస్తున్నాను.

(ట్రెజరీ బెంచెస్ సభ్యులు బల్లలు చరిచారు)

ఈ విషయం ఎందుకు చెబుతున్నానంటే నూటికి యాభై శాతం మంది బడుగు, బలహీన వర్గాల ప్రజలుంటే ఏదో బిచ్చం వేసినట్లుగా చాలా సందర్భాలలో బడ్జెట్ కేటాయింపులు చేసేవారు. ఈరోజు ఈ రాష్ట్రంలో మన ముఖ్యమంత్రి గారు బడుగు, బలహీన వర్గాలకు, కులవృత్తుల మీద ఆధారపడిన వారిని అగ్రభాగాన నిలబెట్టాలని ప్రయత్నం చేస్తున్నారు. నేను నాలుగుసార్లు శాసనసభ్యునిగా ఉంటే చేపల గురించి, పాల గురించి, ఆవుల గురించి, గేదెల గురించి గానీ శాసనసభలో చర్చ జరిగినట్లు చరిత్రలో చూడలేదు. మొట్టమొదటిసారి చేపల గురించి మాట్లాడుకునే పరిస్థితి మన శాసనసభకు వచ్చిందంటే బయట ఉండే గంగపుత్రులు, ముదిరాజులు, ఈ కులం మీద ఆధారపడిన వాళ్లందరూ గర్వపడుతున్నారు. మొట్టమొదటిసారి చేప పిల్లలను ఉచితంగా ప్రభుత్వం పంపిణీ చేస్తున్నదంటే ఇక్కడున్న మంత్రులు, శాసనసభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు ఇంకా ఇతరత్రా వారందరూ చెరువులలో చేప పిల్లలను వదిలే కార్యక్రమంలో పాల్గొన్నారు. నేను ఈ విషయాన్ని ఎందుకు చెబుతున్నానంటే రాష్ట్రంలో ఉండే బడుగు, బలహీన వర్గాల గురించి దేశంలో ఎక్కడైనా ఆలోచిస్తున్నారో లేదో గానీ మన ముఖ్యమంత్రి గారు మన రాష్ట్రంలో ఆలోచిస్తున్నందుకు వారికి నేను మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నాను.

బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ఇతర దేశాలలో విద్యఅభ్యసించడానికి ఒక్కొక్క విద్యార్థికి రూ.20 లక్షల చొప్పున సంవత్సరానికి 300 మంది విద్యార్థులకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తున్నది. ఇది ఎవరూ అడిగింది కాదు. అంతే కాకుండా బి.సి కమీషన్ ఏర్పాటు చేయడమే కాకుండా ఎస్సీ, ఎస్టీలకు "కళ్యాణలక్ష్మి" పథకం ద్వారా రూ.51వేలు ప్రభుత్వం ఇస్తున్నట్లుగా బి.సి కులాలకు చెందిన ఆడపిల్లలకు నేను పెద్దన్నగా ఉంటానని మన ముఖ్యమంత్రిగారు సదరు పథకాన్ని ఈ సంవత్సరం నుంచి వర్తింపజేశారు. ముఖ్యమంత్రిగారు ఏదైనా మాట ఇస్తే ఆ మాట మీద సదరు కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ఎన్ని డబ్బులైనా పర్వాలేదు ఆ కార్యక్రమాలన్నింటిని ముందుకు తీసుకెళుతున్న విషయం సభ్యులందరికీ తెలుసు. కాబట్టి ఈ సభ ద్వారా నేను మరోసారి అందరు సభ్యులకు తెలియజేసేదేమిటంటే ఏ కార్యక్రమమైనా శ్రీకారం చుట్టినప్పుడు వెంటనే ఆ కార్యక్రమాలకు గురించి ఏదో ఒక విమర్శ చేయొద్దని గౌరవ సభ్యులను కోరుతున్నాను.

**శ్రీ కె. చంద్రశేఖర్‌రావు:–** అధ్యక్షా, కిషన్ రెడ్డి గారు చెప్పిన అంశానికి సంబంధించి గతంలో తెలంగాణలో మత్స్య పరిశ్రమ పరిస్థితి, దానియెడల అవలంభించాల్సిన పద్ధతులను సరిగా అవలంభించలేదని నేను స్పష్టంగా చెప్పాను. తప్పనిసరిగా కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బ్లూ రెవల్యూషన్ ద్వారా కేంద్రప్రభుత్వం ఎన్ని నిధులు ఇవ్వగలిగితే అన్ని నిధులు తెచ్చుకునేందుకు ప్రయత్నం చేద్దాం. మన రాష్ట్రంలో కూడా సొసైటీలను ఏర్పాటు చేసే సందర్భంలో అఖిలపక్షాన్ని పిలిచి సమావేశం నిర్వహిస్తాం. అఖిలపక్ష సమావేశానికి గంగపుత్రులను, ముదిరాజులను ఇంకా ఇతరత్రా వారిని పిలుద్దాం. నేను కిషన్‌రెడ్డి గారికి మరియు ఇతర సభ్యులకు హామీనిస్తున్నాను. మంత్రిగారు అఖిలపక్షసమావేశాన్ని ఏర్పాటుచేసి వారి సంక్షేమం కోసం ప్రపోజల్ పెట్టి దానిని అందరం కలిసి ఆమోదం చేసుకుందాం. ఎందుకంటే మనవారందరికీ లాభం జరగాలి. మత్స్య పరిశ్రమ గొప్ప పరిశ్రమగా రూపుదిద్దుకోవాలి. అర్బన్ చెరువుల గురించి కూడా వారు చెప్పారు. అది ఇరిగేషన్ శాఖకు సంబంధించినది. వాటిని కొన్ని GHMC, మరికొన్ని ఇతర డిపార్ట్‌మెంట్లు క్లీనప్ చేస్తున్నాయి. వాటిల్లో మురుగు చేరి మురికి కూపాలుగా తయారయ్యాయి. వాటిని పరిశుభ్రం చేసే ప్రక్రియ జరుగుతున్నది. అంతే కాకుండా ఎక్స్‌పోర్టు గానీ మన దగ్గర వాడే చేపల అమ్మకం గానీ ఒక హైజెనిక్ కండిషన్‌లో ఉండాలని చెప్పారు. తప్పనిసరిగా ఇది కన్‌టెక్టెడ్ యాక్టివిటీ. ఒకటి చేపల పరిశోధన,

రెండవది సీడ్ లింక్స్ తయారు చేయడం, మూడవది ఉత్పత్తి చేయడం, నాల్గవది ఆ ప్రొడక్షన్‌ను సైంటిఫిక్‌గా మార్కెట్ చేయడం అంటే లోకల్‌గా గానీ, డొమెస్టిక్‌గా గానీ లేదంటే బయటికి ఎక్స్‌పోర్టు చేయడం గానీ ఇవన్నీ ఒకటికొకటి కనెక్ట్ అయితే తప్ప మనం ఆశించినంత ఫలితం రాదు. మనకు సముద్రతీరం లేకపోయినప్పటికీ మనకున్న మైనర్ ఇరిగేషన్ మరియు మేజర్ ఇరిగేషన్ చెరువులలో చేపల పెంపకానికి అవకాశమున్నందున దీనిని సంపూర్ణంగా ఒక సైబ్రెంట్ ఇండస్ట్రీగా ముందుకు తీసుకళ్లడానికి అందరం కలిసే ఈ పని చేద్దామని తెలియజేస్తున్నాను.

MR.SPEAKER: The House is adjourned to meet again at 10.00 A.M. tomorrow.

(The House then adjourned at 2.18 P.M., to meet again at 10.00 A.M., on Wednesday, the 4th January,2017)

* * *

"Published under Rule 347 of the Rules of Procedure and Conduct of
Business in the Telangana Legislative Assembly and Printed
at Assembly Press, Public Gardens, Hyderabad."